
# సత్సంగ సందేశములు

పూజ్యశ్రీ స్వామి ఓంకార్

జననం :
21-1-1895



నిర్యాణం :
10-6-1982

ప్రకాశకులు
ద మిషన్ ఆఫ్ పీస్
**శ్రీ శాంతి ఆశ్రమము**
**తోటపల్లి కొండలు, వయా శంఖవరం-533 446**
తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 7382009962
email : srisanthiashram@gmail.com
website: www.srisantiashram.org.in

సత్సంగ సందేశములు
పూజ్యశ్రీ స్వామి ఓంకార్

ప్రథమ ముద్రణ : 1998
ద్వితీయ ముద్రణ : 2008
తృతీయ ముద్రణ : 2017

ప్రతులు : 1000

ప్రకాశకులు
ద మిషన్ ఆఫ్ పీస్
**శ్రీ శాంతి ఆశ్రమము**
**తోటపల్లి కొండలు, వయా శంఖవరం-533 446**
తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 7382009962
email : srisanthiashram@gmail.com
website: www.srisantiashram.org.in

సర్వహక్కులు ప్రకాశకులవి.
ముద్రణ :
**మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమండ్రి.**

**కృతజ్ఞతాభి వందనములు**

**కీ.శే. యోగాచార్య శ్రీ రాపర్తి రామారావు** గారి జ్ఞాపకార్థంగా ఓ అజ్ఞాత భక్తురాలు ఈ పుస్తక ముద్రణకు ఆర్థికసహాయం అందించారు వీరికి భగవంతుని ఆశీస్సులతోపాటు, పరమపూజ్యశ్రీ ఓంకార స్వామి, పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి ఆశీస్సులు లభించాలని ప్రార్థిస్తూ...

-ఆశ్రమ యాజమాన్యం

# జై రాధేశ్యామ్

ప్రాతఃస్మరణీయులును,

ప్రణవార్ధ స్వరూపులును, సచ్చిదానంద స్వభావులును అగు శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామివారి శ్రీ చరణారవింద సన్నిధిని భక్తి శ్రద్ధాపూర్వక ప్రణామములు.

శ్రీ ఓంకార స్వామివారి ముఖారవిందమునుండి వెలువడిన చతుర్ధోత్తర శత-(104) సత్సంగ సుగంధ సుధాసుమములు మానవాళికందరికి చాల ఉపయుక్తములై ప్రయోజనకారులై యున్నవి. అవి మనం ఆఘ్రాణిస్తుంటే, ఆ పవిత్రమూర్తి ప్రేమతో మనముందుండి మనలను మార్గదర్శనం చేస్తున్నట్లున్నవి. ఒక్కొక్కటి సౌగంధభరిత సువర్ణపుష్పము.

“నీ ప్రతి అడుగు దైవము వైపునకే. నీ ప్రతి మాటయు ఆయన మహిమ గూర్చియే. నీ ప్రతి పనియు ఆయన ఆరాధనయే. “అట్టి దైవాన్ని ఎలా మరువ గలవు?” ఈ విధపు బోధన, బుద్ధిని బుజ్జగించి భగవదోన్ముఖంగా మలిచే శైలి- స్వామి ఓంకారుని శైలి. ఆచరించుటకు అనువైన రీతి. ఆనందించుటకు పసందైన నీతి. అదే శాన్తి.

శ్రీ స్వామివారి శ్రీ సూక్తులకు పరిపాటిగా ముందుమాట వ్రాయండి అంటూ భక్తులు శ్రీమాన్ పి. లక్ష్మయ్యగారు కోరగా “అనంతకోటి కిరణములతో లోకములను ప్రకాశింజేయి సూర్యభగవానునికి చిన్నవత్తె వెలిగించి - దీపం దర్శయామి” అనడ మెంతటిదో నా యీ ముందుమాట వ్రాయడం కూడా అంటేననుకొంటూ, “ఏదైనా - యెంతైనా అతనికే అర్పిస్తూ, ఈ పరికరాన్ని శుద్ధిచేసి, అర్హతను ప్రసాదించి ఆశీర్వదించడానికి చేసిన ప్రక్రియ” యని ఆనందించాము.

ప్రస్థానత్రయ సారాన్ని చిన్న చిన్న మాటలతో ఒక హోమియో మందువలె మనోరాళాలలోనికి రమణీయంగా ప్రసరింపజేసే ప్రసంగములు శ్రీ స్వామివారివి. ఇక ఆలస్యందేనికి ఆస్వాదిద్దాము.ఆచరిద్దాము. ఆనందధామాన్ని అలరిద్దాము. అనంతుని ఆశీర్వాదములతో ! శ్రీ స్వామివారి మంగళాశాసనములు సదా మనందరిపై ప్రసరించాలని కోరుచూ వారి పూర్ణానుగ్రహ స్వరూపిణియగు శ్రీమాతా జ్ఞానేశ్వరిగారికి “జైరాధేశ్యామ్॥ నమస్సుమములర్పిస్తూ-

భగవత్సేవలో

మీ

జనవరి 1998

**మాతా శివచైతన్య**

విజయవాడ

ఓం

ఓం శ్రీ ఓంకారాయ నమః

# సందేశము

పూజ్య స్వామీజీ దివ్యచరణారవిందములకు సాష్టాంగ ప్రణామములు అర్పిస్తు న్నాను.

పూజ్య స్వామీజీ, వారి అమూల్యమైన అనుభవములను మానవాళికి సత్సంగ సందేశము ద్వారా అందించిరి. సత్సంగములేనిదే వివేకము లభించదని సంత్ కబీరు అన్నారు. వివేకము లేకుండా జ్ఞానోదయము కలుగదు. పూజ్య స్వామీజీ భక్తితో ప్రారంభించి సర్వత్రా ఆత్మదృష్టి అలవడుటకు అనువైన సాధనాసోపానములను అందించిరి. సత్సంగము ద్వారా ప్రయోజనము ఏమిటి ?

సత్ సాంగత్యము ద్వారా ఆనందము లభించును. భగవంతుని దయవలన సత్సంగము లభించును. దుఃఖనివృత్తికి సత్‌సాంగత్యము మూలము. సాధనము లన్నియు పుష్పములు. సత్సంగ ప్రాప్తియే ఫలము. పరశువేది ఇనుమును స్పర్శించిన సువర్ణమగునట్లు దుర్జనులు సత్‌సాంగత్యముచే సత్పురుషులగుదురు. విధివశమున సత్పురుషులకు దుష్టసాంగత్యము ప్రాప్తించినను పాము పడగపై గల మణివలె వారు సద్గుణములతో ప్రకాశించెదరు. సర్ప విషదోషము మణికి అంటనట్లు దుష్ట సాంగత్యముచే సజ్జనులు ఏమాత్రము దాని ప్రభావమొందక మణివలె ప్రకాశించెదరు. కవులుగాని, విజ్ఞాన ఘనులుగాని, చివరకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు గాని సత్సంగ మహిమను వర్ణింపజాలరు. స్వామీజీ అందించిన సత్సంగ సందేశములను నిత్య జీవితములో పూలబాటగా మలచుకొని శాశ్వత పరమశాంతిధామమును పొందుటకు తగిన ఆధ్యాత్మిక, నైతిక మానసికశక్తిని పూజ్య సద్గురుదేవులు ప్రసాదింతురు గాక.

ఓం తత్సత్

గురుసేవలో

**మాతా జ్ఞానేశ్వరి**

శాంతి ఆశ్రమము,

తేది 22-12-2007

# మనవి

శ్రీశాంతి ఆశ్రమ అధిష్ఠానదేవత శ్రీశ్రీశ్రీ ఓంకార సద్గురుదేవులు అభినవ దధీచిగా పేరొందిరి. 19వ శతాబ్దాంతమున జన్మించి దాదాపు ఇరువదియవ శతాబ్దాంతము వరకు 6 దశాబ్దములు పైగా సోదర ప్రాణికోట్లకు శాంతి వెలుగులు విరజిమ్మిన దివ్యతేజోమూర్తి. పిన్ననాటనే సర్వమూ త్యజించి హిమాలయములలో తపస్సు చేసి దివ్యానుభూతులు పొంది, సర్వప్రపంచమునకు అత్యంతవసరమైన శాంతి, సుఖముల నందించుటకు ఆంధ్రప్రదేశములో ఒక మారుమూల అరణ్య ప్రాంతములో శాంతి ఆశ్రమమును స్థాపించిరి. 1917వ సంవత్సరములో నాటిన శాంతిబీజము దినదిన ప్రవర్ధమానమై నేడు సుమారు 80 ఎకరముల వైశాల్యము గల్గి, సర్వమానవుల శాంతి ఆనందములకొరకు వివిధ సేవాకార్యక్రమములు చేపట్టిరి. ఈ ఆశ్రమము, ఎందరో ఆర్తులను, జిజ్ఞాసువులను, జ్ఞానులను ఆకర్షించుచున్నది.

దైవమునకు భాష్యమే మౌనము. మౌనమే ఆయన రూపము. శాంతి, ప్రేమలే ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసలు. బ్రహ్మములో చరించుటయే ఆయన నిత్యవృత్తి. ఆయన వాక్కులు మధురము, మితము, ప్రియము, హితకరములై ఉండును. ఆత్మీయతను రంగరించిన అమృతవాక్కులను తోటి సోదర సోదరీమణుల కందించి వారి జన్మ సాఫల్యతకు తోడై నిలచిన త్యాగమూర్తి. నిష్కల్మషమైన మనస్సు. నిర్మల ప్రేమ, నిరంతర దైవపరితాపము ఆయన సంపద. ఆయన నిత్యదైనిక జీవనమే ఒక గ్రంథ సముచ్చయము. ఆయన దర్శనము దైవదర్శనమే. ఆయనను దర్శించి, ఆయన సంత్సంగములలో పాల్గొని, ఆయనచే ప్రవచించబడిన దివ్య, నిత్య సందేశములు విన్నవారు సుకృతులు. ఎందరో జిజ్ఞాసువులు ఆయన బోధనలను విని, స్ఫూర్తి చెంది, తమ తమ జీవితములను దైవమువైపుకు మరల్చుకొనినారన్న అతిశయోక్తి కాదు. ఆ మహనీయుని దివ్యదర్శన, బోధనలచే ప్రభావితులై, విజయవాడలో శ్రీ నేరెళ్ళ రఘునాథరావుగారి నేతృత్వములో వారి సహచరులు శాంతి సత్సంగమండలిని 1977వ సంవత్సరములో స్థాపించి, భక్తి, ధ్యాన, సేవాదులు ద్విగుణీకృతముగా చేయుచుండుట వారియొక్క భక్తి ప్రపత్తులకు నిదర్శనము. ఆయన ఎదుట ఎలాంటి ఇతర భావములు స్ఫురించవు. మాటలు రావు. చేతనుడు అచేతనుడువలె ఉండును. అక్కడ ఆ సమయంలో ఉన్నది ఒక్కటియే. అదియే నిత్యమైన, సత్యవస్తువు, అందులో మునిగి యుండుట ఒక దివ్యానుభూతియే.

ఆయన, సర్వకాల, సర్వావస్థలలో కూడా తమ దర్శనమున కేతెంచు భక్తులకు, జిజ్ఞాసువులకు ఎలాంటి ఆటంకములు, అవరోధములు కలుగనీయకుండా చేసి తమ దివ్యానుభూతులను పంచి, దర్శకులను సంతృప్తి పరచెడివారు. ఆయన సేవలు

మానవాళికే పరిమితము కాదు. పిపీలికాది బ్రహ్మ పర్యంతము వారి నిస్స్వార్థసేవలు వ్యాప్తి చెందియుండెను.

వారి సత్సంగబోధనలు అమృతగుళికలు. పరిమితమైన మాటలు చిన్న చిన్న వాక్యములతో సులభముగ అర్థమగు తేలికభాషలో వారు తమ ప్రబోధనలు చేయుదురు. ఎంతటి పటిష్టమగు వేదాంతసూక్తులనైనా తేలికయైన సామాన్య తెలుగులో సూటిగా అర్థమగునట్లు చెప్పుదురు. వారి ఉపమానములు కూడ సామాన్య విషయముల ద్వారా బహిర్గతము చేయుదురు. వీరి బోధలలో, ప్రౌఢతెలుగు కానరాదు. ఇతర గ్రంథములలోని విషయములు అతి సులభగ్రాహ్యముగా కాననగును. తను స్వయముగా అనుభవించినదే ఆయన తన దగ్గరకు వచ్చువారికి తెలియబరచుచుందురు.

శ్రీవారు తమ సంత్సంగములలో అందించిన సందేశములు ఇదివరలో అనేక మార్లు గ్రంథరూపములో వెలువరించుట జరిగింది. ఈ పుస్తకములోని సందేశములు ఇదివరలో అచ్చొత్తింపబడలేదు. ఆ కార్యమును ఇపుడు చేపట్టుట జరిగినది.

ఇందలి సందేశములను చదివి, మననము చేసికొని, వారి దివ్యసూచనలను ఆచరణయందుంచి, ప్రతి ఒక్కరు తమ జీవిత లక్ష్యమును చేరుకొందురని ప్రార్థించుచుంటిమి. శ్రీశ్రీశ్రీ ఓంకార సద్గురుదేవుల ఆశీస్సులు సదా మీయందుండుగాక !

**– ప్రకాశకులు**

# నివేదనము

పరమపూజ్య శ్రీశ్రీశ్రీ ఓంకారస్వామివారి శతజయంతి సందర్భముగా 1998వ సంవత్సరమునందు "సత్సంగ సందేశములు" అను గ్రంథము మొట్టమొదటిసారిగా ప్రచురింపబడినది. శ్రీ ఓంకారస్వామివారు శ్రీ శాంత్యాశ్రమావరణమునందు జరుగు నిత్య సత్సంగగోష్ఠులలో తమ ఉపదేశములను, ఆశయములను, ఆశ్రమాభివృద్ధికి కావలసిన సూచనలను, ఆశ్రమవాసులు పాటింపవలసిన ప్రవర్తన నియమావళిని, మానవజీవితమును సార్థకపరచుకొనుటకు సాధకులు తెలిసికొని, పాటింపవలసిన సదుపదేశములను ఎన్నింటినో సోదాహరణముగా ఈ గ్రంథమునందు పొందుపరచి నారు. సాధకులందరికి ఈ గ్రంథము కరదీపికకావలెను.

"ఓంకారులు గతించినారు. ఓంకారము శాశ్వతమై నిలిచియున్నది" అను సూక్తి ప్రకారము శ్రీ ఓంకారస్వామివారి అనుభవపూర్వకములైన సందేశములు ఈ గ్రంథమునందు సరళమైన భాషలో ప్రకటింపబడి సాధకులకందుచున్నవి.

శ్రీ ఓంకారస్వామివారు అందించిన సందేశములలో ముఖ్యమైనవి ఇవి.

1. ఆశ్రమములో ఉండుట కర్హులెవరు ?
2. భగవదనుగ్రహమును పొందుట కర్హులెవరు ?
3. శాంతియుతజీవితమును గడుపుట కర్హులెవరు ?
4. సార్థక జీవితమును గడుపుట కర్హులెవరు ?
5. సేవచేయుట కర్హు లెవరు ? వంటి ఎన్నో సందేశములను శ్రీ ఓంకారస్వామి వారు ఈ గ్రంథము ద్వారా మన కందించినారు.

వ్యక్తిగతములైన తమ అలవాట్లను గూర్చి తెలుపుచు శ్రీస్వామివారు

1. "ప్రతి సత్సంగమునకును భక్తులకు స్వాగతమని చెప్పుట నా సహజ స్వభావము. (పుట 107)
2. నేనాచరించినదానినే ఇతరుల కుపదేశించుట నా సహజస్వభావము.
3. "నావలెనే అందరును నిరంతర దైవభావములో ఉండవలెనని కోరుకొనుట నా అలవాటు" అని పలుచోట్ల ప్రకటించిరి.

ఈ సత్సంగ సందేశముల యొక్క ప్రత్యేకతను ఈ క్రింది అంశముల ద్వారా మనము తెలిసికొనగలము.

1. ఈ సందేశముల కన్నిటికి ఒకదానితో మరొకదానికి సంబంధముగాని, కొనసాగింపుగాని ఉండదు. ఇవన్నియు ముక్తకసందేశములే.
2. సందేశములయందలి విషయం కూడ కేవల వేదాంత విషయమో, లేక పౌరాణిక విషయమోకాదు. ఏనాడు ఎవరు ఏ పాట పాడినచో ఆ విషయమును గూర్చియే ఆనాటి సంత్సంగ సందేశముండును. లేదా మహాత్ముల

జన్మదినోత్సవముల నుద్దేశించిగాని, వారి సద్గుణములను గూర్చిగాని, ఆయా పండుగలను గూర్చిగాని ఆనాటి సత్సంగ సందేశముండును.

3. ఈ సత్సంగ విషయములయందు సిద్ధాంత విషయములకు తావుండదు. నిత్య జీవితములో ప్రతివారు అనుసంధానించుకొనవలసిన, ఆచరణయోగ్యములైన, ఉపదేశములే ఉండును.
4. "వివేకానందులు" అను శీర్షికలో తమకు మార్గదర్శనమును, ఆదర్శమును "శ్రీ బోధానందస్వామి పరిచయము" అని ఓంకారస్వామి వారు పేర్కొనినారు.
5. ఈ సందేశముల నందించుటకు పూజ్యశ్రీ ఓంకారస్వామివారు ఉపయోగించిన భాష ఒక విచిత్రమైనది, విశిష్టమైనది. ఆ నుడికారమును నేటి మన పూజ్య జ్ఞానేశ్వరీ మాతాజీవారు పూర్తిగా పుణికిపుచ్చుకొనినారు. "పెద్దలు చెప్పిన మాటలను విని, వానిని ఆచరణలోపెట్టి, సుఖశాంతుల నందుకొందుము గాక! ప్రణవమును జపింతుముగాక ! గానము చేయుదుము గాక !" మొదలగు వాక్యము లిందుకు నిదర్శనము.
6. ఇందలి ఒక్కొక్క సందేశము మానవజీవితసాఫల్యమునకును, శాంతి సాధనకును, ఒక్కొక్క మార్గమును ప్రకటించుచుండును.

పూజ్యశ్రీ ఓంకారస్వామి వారి ఆశయములను, సిద్ధాంతములను, స్వభావమును, సహజగుణములను, వైదుష్యమును, విశ్వకళ్యాణదీక్షను, శాంతిప్రియత్వమును సూచిం చుచు వారందించిన ఈ సత్సంగ సందేశములను నిత్య సత్సంగములలో పఠించి, సాధకులందరిని, ఆశ్రమవాసులందరిని ఉత్తేజపరచు ప్రయత్నము చేయవలెనని పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతగారిని ప్రార్థించుచున్నాను. సాధకులందరును సత్సంగ సందేశముల నాచరణములలో పెట్టి సుఖశాంతులతో వర్ధిల్లుచు, తమతమ జీవితములను సార్థకపరచుకొందురు గాక అని ఆశించు చున్నాను.

ఇట్లు

23-12-2007
మార్గశిరపూర్ణిమ

**జి.వి.యస్.సుబ్రహ్మణ్యశర్మ**

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| I. | జైరాధేశ్యామ్ - మాతా శివచైతన్య | 03 |
| II. | సందేశము - పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీ | 04 |
| III. | మనవి - ప్రకాశకులు | 05 |
| IV. | నివేదము-ప్రొ.జి.వి.యస్.సుబ్రహ్మణ్యశర్మ | 07 |
| 1. | భక్తసూరదాసు లేక భక్తి మహిమ | 13 |
| 2. | శ్రీ వివేకానందులు | 14 |
| 3. | రామనామ ప్రభావము | 16 |
| 4. | రాతివలె గాక - వృక్షము వలె నుండుము | 17 |
| 5. | అగ్ని హోత్రము | 18 |
| 6. | ఎండమావులు లేని ఆత్మ నిత్యసుఖి | 19 |
| 7. | త్యాగ ఫలితము | 20 |
| 8. | గీతామందిర స్థాపన | 21 |
| 9. | ఆధ్యాత్మిక సంపద | 22 |
| 10. | ఆశ్రమ జీవితము | 23 |
| 11. | అర్హతగలిగి యుండుము | 24 |
| 12. | స్వర్గారోహణము | 25 |
| 13. | అన్వేషణ | 26 |
| 14. | ఆదర్శ జీవులు | 27 |
| 15. | మౌన ప్రార్థన | 28 |
| 16. | ఋణానుబంధము | 29 |
| 17. | దివ్యానుభవము | 31 |
| 18. | గీతాజయంతి | 32 |
| 19. | బ్రహ్మసత్యం-జగత్తు మిథ్య | 33 |
| 20. | ప్యాకహా ప్రభువెక్కడ ? | 34 |
| 21. | దైవాజ్ఞ | 35 |
| 22. | వ్యక్తిశాంతియే - లోకశాంతి | 36 |
| 23. | శాంతివృక్షము | 37 |

| | | |
|---|---|---|
| 24. | భగవంతుడు కాలస్వరూపుడు | 38 |
| 25. | భీష్మ ఏకాదశి | 39 |
| 26. | ఆత్మానుభవము | 40 |
| 27. | హృదయపుష్పము | 41 |
| 28. | ఇది కూడ వెడలిపోవలసినదే | 42 |
| 29. | ప్రతిబింబము | 44 |
| 30. | అహింసయే శ్రేయో మార్గము | 45 |
| 31. | కాల నిర్ణయము | 46 |
| 32. | బ్రహ్మానంద సుఖము | 47 |
| 33. | జ్ఞాపకశక్తి | 48 |
| 34. | మనసు స్వాధీనమైన | 49 |
| 35. | ప్రకృతి సౌందర్యోపాసనము | 50 |
| 36. | ఆధ్యాత్మికాహారపు విలువ | 51 |
| 37. | అహంకార ఫలితము | 52 |
| 38. | భగవన్నివాసము | 53 |
| 39. | జన్మదినముల ప్రాముఖ్యత | 54 |
| 40. | దైవరాజ్యము పసిబిడ్డలదే | 55 |
| 41. | సర్వశక్తి | 56 |
| 42. | పని క్షయకారి కాదు | 57 |
| 43. | నివృత్తి | 58 |
| 44. | ఆశ్రమము అనెడి వల | 59 |
| 45. | సత్యస్వరూపము | 60 |
| 46. | ఆచరణ ముఖ్యము | 61 |
| 47. | పవిత్ర నీడ | 62 |
| 48. | ప్రార్థనామాహాత్మ్యము | 63 |
| 49. | నా సూది ఎక్కడున్నది ? | 64 |
| 50. | పరిపూర్ణత్వము | 65 |
| 51. | పరిమితములో అపరిమితశక్తి | 66 |
| 52. | భగవద్విశ్వాసము | 67 |

53. కార్తీకపౌర్ణమి 68
54. వాసనాత్రయము 69
55. ఉగాది సందేశము 70
56. గమ్యస్థానము ఒక్కటే 71
57. వేదాంత కళాశాల 72
58. హారతి ప్రాముఖ్యత 73
59. భగవదార్తి 74
60. ఈ క్షణము 75
61. కలిలో హరిస్మరణ 76
62. ప్రేమతత్త్వము 77
63. అంతా మనస్సే 78
64. నిరాశ 79
65. వెండితెరపై ఆడెడి బొమ్మలు 80
66. లింకన్ ఆదర్శము 81
67. మానసిక వ్యధ 82
68. దాతృత్వము 83
69. శాంతము లేక సౌఖ్యము లేదు 84
70. సృష్టితత్త్వము 85
71. విధివశము 86
72. సంతృప్తి 87
73. చిన్నిపక్షుల భయము 88
74. స్వయముగా చేయుపని-లేక - రండి-వెళ్ళండి 89
75. పాలలోనున్న వెన్న 90
76. శ్రేయస్సును కోరు ప్రార్థన 91
77. మనస్సు కోతివంటిది 92
78. సూర్యోదయ అస్తమయములు 93
79. పవిత్రస్థల ప్రాముఖ్యము 94
80. స్వయం సేవ ఫలితము 95
81. ఆత్మారాముడు 96

82. పువ్వులను కోయరాదు 97
83. చేయవలసిన దేమియును లేదు 98
84. స్వభావము 99
85. మూడు బంగారు బొమ్మలు 100
86. అగ్నిజ్వాలలు 101
87. మరణ స్మృతి 102
88. కృషితో నాస్తి దుర్భిక్షమ్ 103
89. వజ్రోత్సవము 104
90. సేవానుబంధము 105
91. అప్రమత్తత 106
92. దైవములో నడచుట 107
93. రూపుమాసిన అర్బుదు 108
94. మానవసేవయే - మాధవసేవ 109
95. మీకేమి కావలయును ? 110
96. మంత్ర ప్రభావము 111
97. సుకృత జీవితము 112
98. ఆద్యంతములు 113
99. రోగుల సేవ 114
100. చీకటి నుండి వెలుతురు 115
101. మహనీయమూర్తులు 116
102. గాలివాన లేక తుఫాను 117
103. గాంధర్వసేన 118
104. సూత్రాత్మ 119
శక్తినిచ్చెడి చిన్న ప్రార్ధన 120

# 1. భక్త సూరదాసు లేక భక్తి మహిమ

సూరదాసు అంధుడే కావచ్చును. అతని నేత్రములు బాహ్య ప్రపంచమును చూడజాలకపోయినను అతని హృదయమునకు అంధత్వము లేదు. అతడు భజనను గాని హరినామ సంకీర్తననుగాని, చేయునపుడు తన హృదయములో ప్రకాశించు చున్న దైవతేజస్సుతో శరీర భావనను మరచి తన్మయావస్థలో నుండగా, శ్రీకృష్ణుడు స్వయముగా వచ్చి వినుచున్నను, అతడు అంధుడగుటచే తన ఎదురుగా నున్న కృష్ణుని గాంచలేకపోయినను ఆ దివ్యసన్నిధి సుఖమును అనుభవించి నూతన శక్తిని పొందగలిగెను. అతడొకసారి త్రోవ తప్పి ఒక గోతిలో పడిపోయి దారిగానక చేతులతో తడుముకొనుచుండ ఆ దారిని వెళ్ళుచున్న ఒకవ్యక్తి అతనిని చూచి జాలి చెంది- సూరదాసుతో “ఇదిగో నాచేతిని ఊతగా అందించుచుంటిని. పట్టుకొని పైకి రమ్ము” అనగా సూరదాసాతనితో “నీవెవరివి” అని ప్రశ్నించగా, అతడు తానొక బాటసారి నని చెప్పెనట. అపుడు సూరదాసతనితో “నన్ను ఎవడు ఈ గోతిలో పడవేసెనో వాడే వచ్చి పైకితీయును; నీ దారిన నీవు వెళ్ళు” మనెనట. అపుడు శ్రీకృష్ణుడు తన భక్తుని పైకితెచ్చే బాధ్యత తనదే యని స్వయముగావచ్చి చేయూతనిచ్చి పైకిలాగగా, సూరదాసు సంతోషముతో “ఇపుడు నాచేతికి చిక్కితివా ప్రభూ !” అని ఆనంద బాష్పములతో ఆయన చేతిని గట్టిగా పట్టుకొనెనట. కరుణార్ద్రహృదయుడగు శ్రీకృష్ణుడతనిని తృప్తిపరచి అదృశ్యుడయ్యెనట.

ఎంత అదృష్టము? అంధుడైన సూరదాసునకు అన్యచింతన లేక – సర్వము తనకు శ్రీకృష్ణుడే యని నమ్మి భజించెను. గాన భగవానుని స్పర్శను స్వయముగా ననుభవించు భాగ్యము అతనికి లభించెను. **అట్లే అందరును బాహ్య ప్రపంచమునకు అంధులుగా నుండి, అంతరంగములోనున్న దివ్యతేజస్సును అనుభవించ ప్రయత్నించ వలెను.** భక్త సూరదాసు నేటికీ పలువురు భక్తులచే స్మరింపబడుచున్న అమరజీవి.

ఓం ఓం ఓం

---

జయ జయ రామకృష్ణ హరి ఓం !

జయ జయ రామకృష్ణ హరి ఓం !

జయ జయ రామకృష్ణ హరి ఓం !

ఈ మంత్రమును సదా భక్తితో స్మరించుచు తరించుడు.

# ౨. శ్రీ వివేకానందుడు

## ( స్వామి పరివ్రాజక జీవితానుభవము )

నేడు ఆనందప్రదమైన దినము. ఆదివారము సూర్యభగవానుని ఆరాధన దినముగా పరిగణించెదము. గాని ఆయన హెచ్చుతగ్గులు లేక శాశ్వత ప్రకాశవంతుడు. ఈనాటి సమావేశమునకు కాకినాడ నుండి ఆంధ్రబ్రహ్మసమాజ భక్తులు శ్రీ తారకంగారు వచ్చుట ఆనందమైనది. ఇప్పుడు వారు చెప్పిన మంచి వాక్యములు హృదయములో పదిలపరచుకొని అభివృద్ధి చెందెదరు గాక.

ఈ సంవత్సరము శ్రీ వివేకానందస్వామి శతజయంత్యుత్సవములు జరుగు చున్నవి. అట్టి మహాపురుషుని గురించి తెలియనివారు బహు అరుదు. ఆయనను సన్యాసులకు సన్యాసి యని మహనీయులు ప్రశంసించిరి. వారి నుండి వెలువడిన ఆత్మ ప్రబోధకమగు ప్రవచనములు అమోఘమైనవి. వారి అపూర్వమైన సదాశయము లను కార్యరూపములో పెట్టుచున్నవారు ధన్యాతిధన్యులు.

స్వామి అమెరికా యాత్రవలె – నా జీవితములో కూడా శ్రీ బోధానందస్వాముల వారి పరచయముతో అట్టి సదవకాశము లభించి నా ఆశయము నెరవేరినది. శ్రీ వివేకానందస్వామి పరివ్రాజక జీవితానుభవములు చాలా అద్భుతమైనవి. ఒకసారి స్వామి పరివ్రాజకులుగా రాజపుత్రస్థానములో పర్యటించుచున్నప్పుడు, వారు పొందిన దివ్యానుభవమును గూర్చి జ్ఞప్తికి వచ్చినది.

“అది మండువేసవి. మిట్ట మధ్యాహ్నము. క్షుత్పిపాసాదులతో పయనించుచు స్వామి ‘టారీఘాటు’ అను చిన్న స్టేషనులో దిగెను. అచటి కాపలాదారుడు ఆయనను లోపల కూర్చుండనీయనందున బయటనే నేలమీద స్తంభమున కానుకొని కూర్చుం డెను. నేలపై నిప్పులు కురియుచున్నట్లుండెను. మంచినీటిని కొనుటకైనను స్వామివద్ద పైకము లేదు. స్వామితోపాటు పయనించుచుండిన పరమలోభియగు ఒక సేఠు వారి కెదురుగా కంబలి పరచుకొని కూర్చుండి, తన వద్దనున్న మధుర పదార్థములను తిని, మంచినీటిని కొని త్రావుచూ, “అన్న పానీయములు లేక మాడుటయే సన్యాసుల గతి” యని హేళన చేయనారంభించెను. కుక్కలు మొరిగినచో ఏనుగునకు అవ మానమా? స్వామి వింటూ మౌనము వహించెను. అంతలో నొక మిఠాయి వర్తకుడు దివ్యాహార పదార్థములతో, మధుర పానీయములతో చిత్రాసనమును చంకనిడుకొని పరుగు పరుగున అచటి కరుదెంచి, స్వామిచెంత చిత్రాసనమును పరచి, “స్వామీజీ రండు; యివి భుజింపుడు” అని బ్రతిమాల నారంభించెను. అంత స్వామి అతని నుద్దేశించి “మిమ్ము నేనెన్నడును జూచినదిలేదు. నన్ను చూచి ఎవరో యనుకొని పొరపడుచున్నట్లున్నారు” అని అతనిని వారించెను.

ఆ నూతన పురుషుడు మరల “బాబాజీ! నేను కొట్టుమూసి నిద్రించుచుండగా శ్రీరామచంద్రమూర్తి నన్ను నిద్రనుండి లేపి, ఈ స్టేషనులో మిమ్ము చూపి, “అదిగో

నిన్నటినుండియు అతడు నిరాహారియై యుండుట వలన నా మనస్సు తల్లడిల్లు చున్నది. వెంటనే ఆహార పానీయములను సిద్ధము చేసి యాతనికడకుగొని పొమ్ము!" అని ఆనతిచ్చినట్లు స్వప్నముగని నిద్రలేచి, ఇది స్వప్నమేగదా యనుకొని మరల పడుకొంటిని. కాని కరుణాపయోనిధియగు శ్రీరామచంద్రుడు మరల నన్ను సమీపించి నిద్రనుండి తట్టిలేపుటచే తదాజ్ఞానువర్తినై ఈ ఆహార పానీయములను వడిగా తెచ్చితిని. దయచేసి భుజింపుడు ! మీకు ఆకలియగుచుండును" అని విన్న వించెను. అపుడు స్వామి పరమేశ్వరకృపను తలంచుకొని కన్నీరు విడుచుచు-

**శ్లో॥ అనన్యా శ్చిన్తయన్తోమాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్**

ఎవరు నీవే గతియని సర్వము విడిచి నన్ను నమ్మెదరో వారి వెంటనంటి కాపాడుచుందునని అభయమిచ్చిన వాడవు" అని తలంచుకొని ఆ వర్తకునికి కృతజ్ఞత లను సూచింప "స్వామీ నన్నభినందింపకుడు, అంతయు నా శ్రీరామచంద్రుని సంకల్పము" అని అతడు వారించుచుండ ఎదురుగా నున్న మన లోభి వర్తకుడు దిగ్భ్రాంతుడై స్వామిచెంతకు వచ్చి "నా మూర్ఖపు ప్రలాపములకు నన్ను క్షమింపుడు". అని వారి పాదములపై వ్రాలి పాదధూళిని శిరమున దాల్చెనట. యిట్టి వెన్నియో స్వామి పరివ్రాజకానుభవములున్నవి.

**దీనిని బట్టి మనము నేర్వవలసినది భగవంతుని యందు భారముంచి ఒక అడుగు ముందుకు వేసినచో, ఆయన ఆత్రముతో ఎదురువచ్చి భక్తుని శ్రమను నివారింపచేయును. మనము పరమేశ్వర కృపకు అర్హులుగా నుండవలెను. భగవంతుడు సదా మిమ్ము శాంతితో బ్రోచుగాక !**

ఓం ఓం ఓం

# 3. రామనామ ప్రభావము

రామయను రెండక్షరములు పెదవులతో జపించినచో మన మనుగడకు ఈ రెండక్షరములే మహామంత్రమై, జీవితయాత్రను సుగమము చేయును. రామనామ మును బిగ్గరగా స్మరించినపుడు నాకు ఆనందము కల్గుటయేగాక, నా యొద్దనున్న మూగజంతువగు "జిమీ"కి గూడ నేర్ప ప్రయత్నించుచుందును. అది యితరులకు ఆక్షేపణీయముగా కన్పించవచ్చునుగాన, దాని కండ్లలోనికి చూచుచు శ్రీరామనామ మును బోధించుచుండ, అది రెండు కాళ్ళను ముందుకు వంచి నా పాదములకు నమస్కరించుచున్నట్లు నావైపే చూచుచూ కూర్చుండుట చూచి నా కెంతయో ఆనంద ముగా, ఉత్సాహముగా నుండును. వాటిని మనము రామునిగా చూచినచో, అవికూడ జ్ఞానులుగా మారునని నా ధృఢవిశ్వాసము. శ్రీరాముని నామసంకీర్తనలో గల ఆనందానుభవము హృదయపులోపల జొనిపికొన్నవారికే దాని ప్రభావము, రుచి తెలియును. "బ్రదరు లారెన్స్" అను ఆయన వ్రాసిన గ్రంథములో "దైవానుభవము అనునది సంత్సంగములో కూర్చున్నంత మాత్రమున లభించదు. మనస్సును మథించి ఆచరణలో నిరంతర సాధన చేసినపుడే– ఆ దివ్యానుభూతి లభించునని" వ్రాసి యున్నారు. ఇది ఎంత మహత్తర సత్యము ! ఈ అభ్యాసము అందరూ జీవితాంతము వరకు చేయవలెను.

I am in the Light – నేను ఆ దివ్యతేజస్సులో నున్నాను.

The Light is in me – ఆ దివ్యతేజస్సు నాలోనే యున్నది.

I am the Light – ఆ దివ్యతేజస్సు నేనే !

ఈ పవిత్రవాక్యములను అనుభవపూర్వకముగా మననము చేసినచో ఆత్మానుసంధానమునకు తోడ్పడుటే గాక; భగవంతుని దివ్యతేజస్సులో లీనమగు అవకాశమును గలదు. దైవచింతనాపరులకు యింతకంటె మహదవకాశము మరేమి గలదు?

**రామనామ స్మరణ ప్రభావమువలననే గదా దారి దోపిడి దొంగగా జీవించెడు బోయవాడు – వాల్మీకి మహర్షిగా రూపొంది, శ్రీమద్రామాయణ మహాకావ్యమును వ్రాసి ఆదికవిగా ప్రసిద్ధి గాంచెను. గనక మీరందరును రామనామ ప్రభావమును గుర్తించి జపించి తరించెదరు గాక !**

ఓం ఓం ఓం

# 4. రాతివలె గాక - వృక్షము వలె నుండుము

భగవంతుడు రాళ్ళలో నిద్రించి, మొక్కలలో లేచునని, ఎప్పుడో చదివియుంటిని, రాయి ఎంతకాలమైనను ఉన్నచోటుననే యుండిపోవును. అంగుళమైనను కదలజాలదు. వృక్షము ప్రతిరోజు అభివృద్ధి చెందుచు పైపైకి వెళ్ళుచుండును. గాన మనము రాళ్ళవలె నుంటిమా? అంతేగాదు. వృక్షజాతి మానవకోటికి చల్లని నీడను, ప్రాణవాయువును నిచ్చుచు, కాయలను, పండ్ల నిచ్చుచు, మానవులకేగాక, పక్షులకును జీవనాధారమైన సేవను నిస్వార్థముగా చేయుచున్నవి. వాటిది స్వార్థరహిత మౌనసేవ. ఇక మానవులమైన మనము రాళ్ళవలె స్తబ్ధులుగా వున్నచోటనే యుండి పోవుచుంటిమా ? లేక వృక్షములవలె అభివృద్ధి చెందుచుంటిమా ? యని ఎవరికి వారే పరీక్షించుకొనవలెను.

కొందరు మాటలతోనే సేవ పూర్తి చేయుచుందురు. మరికొందరు నిశ్శబ్దముగా నుండి మహత్తరమైన నిస్వార్థ సేవ చేయుచుందురు. మాటలు గులకరాళ్ళవంటివి. నిశ్శబ్దసేవ స్వచ్ఛమైన నీటి ప్రవాహము వంటిది. ఒకటి ఎంత నిరుపయోగమో రెండవది అంత పరోపకారమైనది. అది జీవకోటికి ప్రాణాధారమేగాక, భూమిని సస్యశ్యామలముగాచేయుచున్నది. గాలికి-నీటికి అవినాభావ సంబంధమున్నది. అట్లే మానవునికి భగవంతునితో అవినాభావ సంబంధమున్నది. చల్లనిగాలి తగులుటచేత నదీ ప్రవాహము అలలతో ఉప్పొంగుచు ప్రవహించును. అట్లే **మానవుడు దైవస్మృతి యను నావలో పయనించుచు ఆవలి ఒడ్డు అనగా తన జన్మకే గమ్యస్థానమైన దైవ సన్నిధికి చేరి అమృతానందమనుభవించును. గనుక నేటి సత్సంగ సందేశ సారాంశమును గ్రహించి వృక్షమువలె దినదినాభివృద్ధి గాంచుచు పలువురి శాంతి సుఖములకు తోడ్పడెదరుగాక !**

ఓం ఓం ఓం

---

సూర్యకిరణములు సూర్యునినుండి వేరై ప్రత్యేకముగా నుండునట్లే
తలంపులు, కర్మలు ఆత్మకు వేరై ప్రత్యేకముగా నుండును.
మరియు కిరణములు సూర్యుడెట్లు కాదో
అట్లే తలంపులు, కర్మలు మాత్రమే ఆత్మకాదు.

# 5. అగ్ని హోత్రము

శ్రీరామకృష్ణ పరమహంస చెప్పినట్లు " ఈ ప్రపంచమే మూడు దినములు – దానిలో మన జీవిత మొక్క క్షణమే ". వారి సందేశసారాంశమును గ్రహించినచో, ఈ జీవితముయొక్క విలువ ఎంతటిదో దానిని ఎట్లు మలచుకొనగలుగుచున్నామో అర్థమగుచున్నది. 'దీపము ఉండగనే యిల్లు చక్కబెట్టుకొనుమన్నట్లు' క్షణభంగురమైన ఈ జీవితములో అతి త్వరగా మనము పొందవలసినది ఏమిటి ? దైవీస్థితి. అయితే అది అంత సులభమా ? సులభమే గాని, దానిని వైరాగ్యమను వాడియైన కత్తిమీద నడచి పొందవలెను. దైవమును పొందుటకు వివేక వైరాగ్యములే ముఖ్య సాధనములు.

ఇప్పుడు ఆధ్యాత్మిక మెరుపులు అను పుస్తకమునందు చదివిన అధ్యాయము 'దైవమునునేనెట్లు మరువగలను."అది చదివినంతనే నాకు ఎంతయో బలము వచ్చును. ఆయన శక్తివలననే మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసము లాడుచున్నవి. ఈ పరమ సత్యమును గ్రహించినచో దైవము నెట్లు మరువగలము ? మరచుట అసంభ వము. ఈ రోజు సూర్యోదయము వేళ నేను శ్రీరామతీర్థ కళాశాలకు వెళ్ళితిని. ఆవరణలో ప్రవేశించగానే శ్రీస్వామి రామానందతీర్థులు లేనిలోటు ఎంతగానో కాన్పిం చెను. మరల "శ్రీస్వామీజీ ఆత్మశక్తి అంతటా నిండియున్న"దనెడు భావన కొంత తృప్తి నిచ్చి ఇక మీదట దీని నభివృద్ధి చేయుబాధ్యత మనయందున్నదనుకొంటిని. "జీవితము పొగకాదు, అగ్నిహోత్రము'వంటిది. మనలో ప్రవేశింపబోవు ప్రాపంచిక తలంపులను అగ్నిహోత్రములో దగ్ధము చేసినచో ఆ స్థానములో పవిత్రభావనలు తల ఎత్తి ఎంతటి మహత్కార్యముల నైనను చేయించగలవు. **అగ్నిహోత్రమును చెద పురుగులు చేరజాలనట్లు,విషయ వాసనలు దైవజ్ఞప్తి కలవారి దరిచేరజాలవు. కనుక మీరందరూ అగ్నిహోత్రము వలె దైవతేజస్సుతో ప్రకాశించుచు తేజస్సులకు మూలమైన తేజస్సుతో ప్రకాశించు దైవమును చేర ప్రయత్నింతురు గాక ! ఇది నేటి సందేశ సారము.**

ఓం ఓం ఓం

---

సమాధిని, అందలి బ్రహ్మానందానుభవమును

అందరి శ్రేయస్సుకొరకు

ఉపయోగించవలెను.

## 6. ఎండమావులు లేని ఆత్మ నిత్యసుఖి

భగవంతుని జీవిత ప్రతిబింబమైన మానవుడు తనలో నున్నసద్వస్తువును మరచి, తనివితీరని దాహముతో ఎడారిలో నీటి ప్రవాహమున్నదని భ్రమించు ఒంటెల జీవితమువలె, భగవంతునికై తనలో తప్ప, బాహ్య ప్రపంచమంతటను వెదుక ప్రయత్నించును. యిట్టి పవిత్ర సత్సంగములలో పాల్గొనినప్పుడైనను మనస్సు స్థిరముగా నుంచవలెను. ఈ మధ్య ఒక వ్యక్తి నాతో "స్వామీజీ! తమ సన్నిధిలో సత్సంగములో పాల్గొనినప్పుడు, మనస్సు స్థిరముగా నుండి సంతోషముగా నుండును. తదుపరి మనస్సు పరిపరి విధములుగా పోవుచుండును." అనెను.

దీనిని బట్టి సత్సంగము వేరు, శరీరమువేరు. మనస్సులు వేరుగా నున్నట్లే గదా! దీనికి ఒకే మార్గమున్నది. "మనస్సును శరీరములోనే బంధించి విన్న మంచి మాటలను మరల మరల మననము చేసినచో అవి మనస్సులోనికి చొచ్చుకొనిపోయి ఆత్మను ప్రవేశించును. అచ్చట మనస్సు ఆత్మవరకు వెళ్ళినపుడు మనము బాహ్యమున చూచుచున్న వన్నియు భ్రాంతిజన్యమని గ్రహించినచో, అప్పుడు ప్రాపంచిక సుఖదుఃఖములకు అతీతమైన స్థితిలో విలక్షణముగా నుండగలము. ఈ ఉత్కృష్ట భావన యొక్క సారాంశము. **"ఆత్మ నిత్యసుఖి". దానికి వృద్ధినాశనములు లేవు. ఆటుపోట్లు లేవు. అచ్చట అంతయు ఆనందమయమే.**

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః।

నచైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః॥

అని గీతాచార్యుడు ఒకే చక్కని శ్లోకములో ఆత్మయొక్క విశిష్టతను గూర్చి బోధించెను. **మీరందరు భక్తి శ్రద్ధలతో సత్సంగములో పాల్గొన్నందుకు మనస్సు అను మూల్యమునుచెల్లించి ఆత్మ పదార్థమునుపొందుడు. ఇదియే మీ అందరి ఆధ్యాత్మికాభివృద్ధిని కోరు నా ఆకాంక్ష.**

ఓం ఓం ఓం

# 7. త్యాగ ఫలితము

లోకములో ఒక వ్యక్తియొక్క (గాంధీగారివలె) త్యాగఫలితమును పలువురు అనుభవించగలరు. నేను తరచుగా దగ్గర కూర్చుని పిల్లలచే తోటపని చేయించుట చూచిన కొంతమంది భక్తులు, ఆశ్రమవాసులు కూడా "స్వామీజీ ఈ వయస్సులో కూడా యింత శ్రమపడుట ఎందుకు ?" అని తలంచుచుందురు. అప్పుడు నాకు ఈ క్రింద కథ జ్ఞాపకమునకు వచ్చుచుండును.

ఒకప్పుడు ఒక ముసలివాడు రాజమార్గము ప్రక్కగా చాలా శ్రమపడి గొయ్యి త్రవ్వి అందు ఒక మామిడిమొక్కను నాటుచుండగా ఆ త్రోవను పరివారముతో రాజు గారు వెళ్ళుచు ముసలివానిని చూచి నవ్వుతూ తమ అనుచరులతో యిట్లనిరట!

**"ఈ ముసలివాడు కడు బుద్ధిహీనుడు !**
**తానొక యువకుడనంచు పాతుచుండె;**
**ఆ తరువు ఫలము తినెడు దాక, నీ యుర్వి;**
**పై మనుదునంచు దలంచుయుండుబోలు."**

ఆ రాజు మాటలను వినిన ఆ ముసలివాడు దానికి సమాధానముగా –

"ఈ మొక్క యిచ్చుట పాతుచున్నది నా కొరకు గాదు, ఇది ముందు ముందు మహావృక్షమై ఈ మార్గమున వెళ్ళుచున్న పాంథులకు నీడ నిచ్చుటయేగాక, వారి ఆకలిని తీర్చుటకు మంచి ఫలములను కూడ యిచ్చునను ఆశయంతో ఈ మొక్కను ఈ వయస్సులో శ్రమపడియైనను నాటుచుంటిని" అని చెప్పగా రాజు వృద్ధుని సమాధానము విని, తాను హేళన చేసినందులకు సిగ్గుతో పశ్చాత్తాప పడెనట. **ఇప్పుడు చేయుచున్న కృషి ఫలితమును, భవిష్యత్తులో ఆశ్రమవాసులు, భక్తులు ఆనందముగా శాంతి ననుభవించగలరు. ఈ జీవితమునకు యింతకంటె ధన్యత ఏమున్నది? త్యాగధనులే నిజమైన ధనవంతులు.**

ఓం ఓం ఓం

## 8. గీతామందిర స్థాపన

ఇది మైత్రేయి ఆశ్రమం. యాజ్ఞవల్క్య మహర్షిభార్య జ్ఞానధన సంపన్ను రాలు, ఆ మైత్రేయి పేరున ఈ ఆశ్రమం స్త్రీల ఆధ్యాత్మికాభివృద్ధిని కోరి స్థాపించుట జరిగెను. ఇందు గీతామందిరమును స్థాపించుటకు తోడ్పడినవారు, నరసన్నపేట భక్తులు ఆదర్శ గాంధేయవాది శ్రీ పొట్నూరిస్వామి బాబుగారు, వారి భార్య శ్రీమతి వజ్రమ్మగారి పేరున ఇచ్చిన విరాళముతో ఈ మందిరం శ్రీకృష్ణకృపచే స్థాపన జరిగెను. నేడు ఆమె 7వవర్ధంతి జ్ఞాపకముగా, నేటి సత్సంగ సమావేశము యిచ్చట జరుపుకొను చుంటిమి. ఆమె ఆత్మ శాంతిని కోరుచూ ముమ్మారు ప్రణవగానము చేయుదుము గాక !

శాంతి ఆశ్రమం దైవమిచ్చిన అమూల్యనిధి. అందులో భాగమైన ఈ స్థలము ఆశ్రమ భక్తురాలు, ముఖ్య సేవకురాలు అయిన శేషమ్మగారి దగుట ఆనందము. మైత్రేయి ఆశ్రమం స్థాపించిన తర్వాత భక్తురాలు అయిన వజ్రమ్మగారి పేరున మందిర నిర్మాణము కూడ జరుగుటఆనందము. ఏకారణముచేత ఎవరు ఏవిధమైన దానము లేదా విరాళ మిచ్చినను అది ఈ విధముగా సద్వినియోగమగుటచే వారి వారి జీవితములు ధన్యవంతములు.

నేను యిచ్చటకు రాగానే శ్రీకృష్ణ విగ్రహము చెంతకూర్చునియుండగా జ్ఞానేశ్వరి కూడా వచ్చి నావద్ద కూర్చుండెను. ఆమెతో యిట్లు చెప్పితిని.

“మనము శ్రీకృష్ణుని కృపకు పాత్రులము కావలయునన్న మన మనస్సులలోని చింతలన్నియు పూర్తిగా విడిచిపెట్టి ఆయన మురళివలె అతిపవిత్రముగా చేసి, తుపాకిలో మందుకూరినట్లు భక్తియను మందును కూరవలయును. అపుడు మనము సులభముగా ఆయన కృపకు పాత్రులము కాగలము. అంతేకాదు. ఆయన మన హృదయములో శాశ్వతనివాస మేర్పరచుకొనును.” యింతకంటె అదృష్టమేమున్నది. **శ్రీరామకృష్ణులు శలవిచ్చినట్లు గీతా గీతా అని స్మరింపగా స్మరింపగా, త్యాగీ త్యాగీ అను పదముగా మారిపోవును. కనుక నేటి సత్సంగ సారాంశముగా మీరందరూ త్యాగమయ జీవితముల నలవర్చుకొని ధన్యులగుదురు గాక !**

ఓం ఓం ఓం

# 9. ఆధ్యాత్మిక సంపద

సమావేశములు అనేక విధములుగా జరుగుచుండును. దైవము పేరున సమా వేశము సత్సంగముగా పేర్కొనబడుచున్నది. "ఎచ్చట భక్తులు పలువురుచేరి నా నామమును గానము చేసెదరో, అచ్చట నేనుందును" అని భగవానుడు శెలవిచ్చెను. మీరందరును, భక్తితో నామసంకీర్తన చేయు చుండ ఆయన అగోచరముగా మన చెంతనే యుండును. సంగీతమును మధురముగా వినినప్పుడు దైవముతో మనకు ఏకత్వము ననుభవించగల అవకాశమున్నది గాని ఆ దివ్యానందము అట్టి గాన కళానిపుణులదే అనుకొనవలదు.

ఏకాంతముగా నిర్జన ప్రదేశములో కూర్చుని శ్రీరాం–జయరాం అను మంత్ర మును తదేకముగా నామసంకీర్తనగానము చేసినపుడు లభించు ఆనందము వర్ణనా తీతమైనది. అచట మన ఉనికిని మనమే మరచిపోవు దివ్యస్థితి లభించును. **ప్రతివారు అట్లు ఏకాంతమగు నామసంకీర్తన చేయు అభ్యాసము చేసి కృతార్థులు కావలయును.** బాహ్య ప్రపంచములో మనకు లభించు ఆనందము పరిమితమైన సుఖదుఃఖ సమ్మిళిత మైనది. సీతారామాంజనేయ సంవాదములో ఈ క్రింది పద్యము సాధానాపరుల కెంతగానో ఉపకరించును.

**చెలువుగ పువ్వులు చీరుటకంటెన్**
**బొలుపుగ కన్గవ మూయుట కంటెన్**
**నలువగు నీ యమనస్క పదము**
**సులభము – సౌఖ్యము, సూక్ష్మము వత్సా !**

వాటిని మననము చేసికొన్నచో ముక్తిని పొందుటెంత సులభమో చక్కగా వివరింపబడెను.

"ధనంమూలమిదం జగత్" ఈ ప్రపంచములో బాధలన్నింటికిని ధనమే మూల కారణమగుచున్నది. ఒకచోట చెప్పులు కుట్టుకొని జీవించువాడొకడు హాయిగా భక్తి గానము చేసికొనుచు ఆనందతన్మయత్వముతో పనిచేసుకొనుచుండెను. ఆ దారిని వెళ్లుచున్న ధనికుడొకడు, ఆ పాట విని ఎంతయో ఆనందించి 50 రూ. యిచ్చుటతో అతనిలో చిన్న అహం ప్రవేశించి ఆ బీదవాని ఆనందము అంతరించెను.

యక్షుడు ధర్మరాజును ఈ ప్రపంచములో మిగుల ధనవంతుడెవడని ప్రశ్నించగా– "తనకు లభించిన దానితో తృప్తి చెందువాడు" అని ధర్మరాజు జవాబు చెప్పెనట. **మన ఆనందమంతయు సంతృప్తిలో యిమిడియున్నదని గ్రహించవలెను.**

ఓం ఓం ఓం

## 10. ఆశ్రమ జీవితము

ఆశ్రమ జీవితము నీటిలో నివసించు మత్స్యముల జీవితము వంటిది. బయటి ప్రపంచములోని జీవితములు పొడి నేలమీద పడి విలవిలలాడు మత్స్య జీవితములు వంటివి.

ఈనాడు ఆశ్రమవాసులు కొందరు, కాకినాడ వెళ్ళి ఎండలో తిరిగి తిరిగి అలసిపోయి వచ్చిరి. సముద్రములో అనేక నౌకలు ప్రయాణము చేయునపుడు తెర చాపకొయ్యపై చేరిన పక్షి ఆకాశములో తిరిగి తిరిగి విసిగి వేసారి మరల ఆ కొయ్యనే ఆశ్రయించునట్లు **మానవులు జీవిత మహాసముద్రములో ఈది ఈది, అలసటపడి, తమ నిజస్థితిని తెలిసికొన కోరినపుడు యిట్టి ఆశ్రమములో చేరి విశ్రాంతిని పొందు చుందురు.** ప్రాపంచిక జీవితములో శత్రువులు, మిత్రులు కష్టసుఖములు తప్పవు. అట్టి కష్టముల నెదుర్కొనవలసి వచ్చినపుడు-మన పురాతన గ్రంథములు ఎన్నియో మహోత్కృష్టమైన మార్గములను సూచించినవి. కష్టములో సుఖమును, విరోధిలో మిత్రుని చూడగలము. తెలిసిగాని తెలియకగాని మనకు ఎవరు బాధ కల్గించినను, మనము తిరిగి వారి శ్రేయస్సునే కోరుచుండవలెను. ఇది మహోన్నతాదర్శము. అంత కంటె ముఖ్యమైనది; వారు మనకు కలిగించిన హానిని పూర్తిగా మరచి వారిని దైవస్వరూపులుగా భావించి, ఆరాధింపగల్గుట గొప్ప సాధనయైయున్నది. మనము ప్రపంచములో ప్రతివారిని సంతృప్తి పరచజాలము. గాని **మనము సంతృప్తిగా గడుపుటకు ఒకే మార్గమున్నది. ఏదైనను సమస్యల నెదుర్కొనవలసివచ్చినపుడు, తాబేలు ఆపద వచ్చినపుడు తన అవయవములను లోనికి ముడుచుకొనునట్లు మన మనస్సులను, ఆంతర్యమునకు మరల్చి దైవతేజస్సులో విలీనము చేసినచో, బాహ్య స్థితిని పూర్తిగా మరచి సుస్థిరశాంతిని పొందగలము.**

యదా సంహరతే చాయం కూర్మోఽ ఙ్గానీవ సర్వశః।
యింద్రియాణీంద్రి యార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

ఓం ఓం ఓం

# 11. అర్హతగలిగి యుండుము

"కలిలో హరిస్మరణ మొకటియే" అను కీర్తన వినినపుడు నా కెంతయో ఆనంద ముగా నుండేది. ఆశ్రమములో నిత్యము జరుగుచున్న హరినామసంకీర్తన ఆశ్రమాభి వృద్ధికే గాక, లోకశాంతికి, క్షేమమునకు తోడ్పడును. కాని ఆశ్రమవాసులు గాని సందర్శకులుగాని హరినామసంకీర్తన చేయుట నన్ను తృప్తిపరచుటకు గాదు. సంకీర్తన చేయునపుడు హృదయము పరవశించి ఆనందబాష్పములు కార్చువారే ధన్యులు. సంకీర్తనలలో భగవదానందము అంతగా యిమిడియున్నది.

శ్రీరామకృష్ణులు చెప్పినట్లు "ప్రాపంచిక మానవులు ధనము కొరకు, భార్యా బిడ్డలకొరకు ఏడ్చువారే గాని భగవంతుని కొరకు ఆర్తితో కన్నీరు కార్చువారెందరు గలరు ?

**మన హృదయనివాసియగు భగవంతుని అస్తిత్వమును గుర్తించి శాంతి, ఆనందములను పొందుటే మన లక్ష్యముగా నుండవలెను.** ఈమధ్య ఆశ్రమ మేనేజరు నావద్దకువచ్చి, ఆశ్రమంలో డబ్బులేదు. 200రూ. అవసరముగా కావలెనని చెప్పగా– నేను "మీరు దైవమునందు భారముంచి, హృదయపూర్వకముగా ప్రార్థించినచో, మీకు అవసరమైన 200రూ.లే గాదు 2000రూ. కూడ లభించు"నని ధైర్యము చెప్పితిని.

నీ జీవితములో ఇది నిత్య సత్య అనుభవైకవేద్యము. **భగవంతునికి మనము సర్వము అర్పించి ఆయనమీద భారమునుంచి అర్హతగానున్నచో ఆయన మనలను ఎట్లు తప్పించుకొనగలడు** ? ఆయన

శ్లో॥ అనన్యా శ్చిన్తయన్తో మాం, యేజనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥
(గీత 9అ –22శ్లో)

అని తన భక్తులకు హామీ యిచ్చి యున్నాడు. గాని మనము అన్నిరకముల చింతలను పూర్తిగా వదలివేసి, ఆయన తప్ప వేరే గతిలేదని అంటున్నామా ? యిది ఎవరికి వారు ప్రశ్నించుకోవలెను. ఒక చెట్టుమీద ఎన్నిపక్షులున్నను చెట్టుక్రింద నిలచి చప్పట్లు చరిచినచో, చెట్టుపై నున్న పక్షులన్నియు ఎగిరిపోవునట్లు హరినామ సంకీర్తనతో హృదయములో నివసించుచున్న పాపపు తలంపులన్నియు, భయముతో బయటికి పారిపోవును. నేడు గాంధీమహాత్ముని వర్ధంతి. ఆయన ప్రార్థన యొక్క మహిమను ఎంతగానో ప్రశంసించెడివారు. అట్టి మహనీయులు ఎప్పుడును అమర జీవులే ! వారి ఆత్మశాంతిని కోరుచూ ప్రణవగానము చేయుదము గాక !

ఓం ఓం ఓం

# 12. స్వర్గారోహణము

ఈ సత్సంగములో పాల్గొనుటకు వచ్చిన భక్తులకు దైవసన్నిధికి స్వాగతము. కాకినాడనుండి ఆశ్రమ పురాతనభక్తులు శ్రీ పైడా శ్రీరామకృష్ణయ్యగారు, వారి ధర్మపత్ని శ్రీమతి చంద్రమతీదేవి ఆశ్రమం వచ్చినందుకు ఆనందము.

"ఎన్నో నోములు నోచినగాని దొరకదు యీ నరజన్మము" అను కీర్తన పాడ మని చంద్రమతి దేవిని కోరుచుందును. దుర్లభమైన మానవజన్మ లభించినందుకు దీనిని సద్వినియోగము చేయవలెను. **ఆశ్రమమునకు ఎవరు ఏ అభిప్రాయముతో వచ్చినను - యిచ్చట నున్నంత కాలమైనను, భగవంతుని జ్ఞప్తిలో నడుచుచు, నామ సంకీర్తనలో పాల్గొనమని కోరుచుందును.** ఆశ్రమములో పలుతావుల యందు, ఆదర్శవంతమైన జీవిత సత్యమును గ్రహింపచేయు సూక్తులు వ్రాయబడిన బోర్డు లున్నవి. వచ్చిన ప్రతివారు వాటిని చదివి, మననము చేసుకొని అభివృద్ధిచెందవలయు నని నా ఆశయము.

భగవంతుని దర్శించుటకు సప్తప్రాకారములు దాటి గర్భాలయము దరిచేరి నపుడే తనివితీర ఆయన మూర్తిని దర్శింపగలము. అచ్చట మాటలు రావు. ఏలనన ఆయన నిశ్శబ్ద స్వరూపుడు. ఈరోజు కొంత సమయము శరీర స్పృహలేకుండనుండి, నిశ్శబ్దముతో ఆంతరజ్యోతిని దర్శించి బ్రహ్మానందము ననుభవించగల్గితిని. ప్రపంచ ములో కోటానుకోట్లు జనులుండగా బహుకొద్ది మంది మాత్రమే ఆశ్రమమునకు రాగలుగుచున్నారు. కారణం వారి వారి జన్మల సుకృతఫలమే. ఈ చిన్ని టామీ ఎల్లవేళలా నా వెంటనంటి తిరుగుచుండ ధర్మరాజు స్వర్గారోహణము జ్ఞాపకం వచ్చుచుండును. ధర్మరాజు సోదరులతో భార్యతో స్వర్గారోహణము చేయునపుడు ఒక కుక్క ఆయనను వెంబడించెనట. త్రోవలో సోదరులు నలుగురు ద్రౌపదియును పడిపోవుచుండగా, చివరకు కుక్క మాత్రము ఆయనను వెంబడించిన ఘట్టము జ్ఞాపకము వచ్చెను. మానవులేగాక, మూగజంతువులకు కూడ జన్మకర్మల ప్రారబ్ధము ననుసరించి వానికి మరుజన్మ లభించును. కనుక **మానవులముగా జన్మించినందు లకైనను నిరంతర దైవజ్ఞప్తితో నిండిన స్వర్గసుఖమును భూమియందే అనుభవించ ప్రయత్నించి సఫలత నొందుదురుగాక !** ఇది నేటి సందేశ సారాంశము.

ఓం ఓం ఓం

# 13. అన్వేషణ

భగవంతుని సన్నిధి ననుభవించుటకు అందరకూ హృదయపూర్వక స్వాగతము. యిప్పుడు "చింతించుచున్నాడే యముడా" అను మంచి కీర్తనను పాడగా వినిన నాకు కలిగిన భావనను విశదపరచుచున్నాను. "అసలు యముడు ఎందుకు చింతించుచున్నాడు? భూలోకములోని మానవులు హెచ్చుమంది విష్ణు సహస్ర నామము చేయుచు తమను తాము భగవంతునికి అర్పించుకొనినప్పుడే కదా !" శరీరమును విడిచిన జీవులు నరకలోకమునకు వెళ్ళనవసరములేకుండా అనగా యమయాతనలు పడకుండా తప్పించుకొని స్వర్గలోకము అనగా విష్ణు సాన్నిధ్యమును చేరుకొందురు. ఇదియే కృతి అర్థము. ఎంత ఆశ్చర్యము !

మానవులుగా జన్మించినవారు తమ గమ్యస్థాన మేదియో మరచి భక్తిశూన్యులై పెడమార్గములను పట్టినడుచునప్పుడేగదా నరకలోకప్రాప్తి కలిగి యముడు శిక్షించుట జరుగును. గనుక భక్తులైనవారు తమ మనస్సులను తాము పరీక్షించుకొని యముడు శిక్షించకుండా యుండు మార్గమును అన్వేషించుకొనుచుండిరో లేక స్వర్గమార్గమును, భక్తి శ్రద్ధలతో అన్వేషించుకొనుచుండిరో ఎవరికివారే తెలుసుకొనవలయును. మన మనస్సులను బట్టియే మార్గాన్వేషణ సులభమగును. మానవులలో మూడురకముల హృదయముగలవారుందురు.

మొదటిరకము వారు వెన్నవంటి ప్రేమహృదయులు. అట్టివారు హరినామ సంకీర్తనానందములో, వేడి తగిలిన వెన్నవలె సులభముగా కరిగి లీనమైపోవుచుం దురు.

రెండవరకమువారు దూది వంటి హృదయులు అనగా దూది నీరు పీల్చి మరల ఎండిపోవునట్లు, తాము విన్న సంకీర్తనను గ్రహించి, వెంటనే మరచిపోవు చుందురు.

ఇక మూడవరకమువారు రాజసిక స్వభావులు. అనగా ఇనుము వంటి హృదయము గలవారు. అట్టి స్వభావముగలవారు, ఎన్ని మంచి విషయములు విన్నను, కండ్లతో చూచినను మనస్సు కదలదు, కరుగదు. ఈ మూడు రకములవారు వారి స్వభావములను, పూర్వజన్మ సుకృత, దుష్కృతములను బట్టి వారి వారి మార్గ ములను అన్వేషించుకొనుచుందురు.

కొందరు ఇతరుల తప్పులనే ఎంచుచు, తమ మనస్సులు వెన్నవంటివని భ్రమలో నుందురు. అట్టిభ్రమ వట్టి రెల్లుపుల్ల వంటిది. దైవమార్గాన్వేషకులైన వారు ఎప్పటికప్పుడు తమలోని తప్పులను గ్రహించుకొని సరిదిద్దుకొన ప్రయత్నింతురు. అట్టివారు ధన్యులు. భగవద్భక్తులు. ఆత్మవిదులు ఆత్మావలోకనములో నిత్యానందము ననుభవించుచుండిరి. అట్టివారిని గూర్చి యముడు ఆలోచింపడు. సరిగదా దూరము

నుండియే పాదాభివందనము చేయును. భక్తులైనవారికి ఒక మంచి మాట చాలును. **మీరందరును దైవ మార్గాన్వేషకులుగా యుండవలయుననియే నా ఆకాంక్ష దైవము మిమ్ము శాంతితో బ్రోచుగాక !**

ఓం ఓం ఓం

## 14. ఆదర్శ జీవులు

ఆదర్శముగా జీవింపగోరువారు, ఆధ్యాత్మిక సంపదకు వారసులుగా నుందురు. అట్టివారి జీవితములలో సంభవించు తాత్కాలిక కష్ట నష్టములు మబ్బులవలె ఎప్పటి కప్పుడు చెదరి పోవుచుండును.

ఏసుక్రీస్తు ఎన్ని కష్టనష్టముల నెదుర్కొనవలసి వచ్చినను ఆయన మనో నిశ్చలత వలన నేటికిని మహనీయునిగానే పరిగణించుచున్నాము.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వగైరా అవతారపురుషులు కూడ కొన్ని సమయముల యందు కష్టములకు లోనుకావలసివచ్చెను గదా ! ఈ మానవ శరీరములలో ఒడిదుడుకుల నెదుర్కొనుట ఎంతటి మహనీయులకైనను తప్పదు. ఇక సామాన్యుల సంగతి చెప్పనేల ? కాని మానవుడు తన మార్గమును సుగమముగా చేసుకొనుటకు తాము పయనించు మార్గమును రాళ్ళు, రప్పలు, తుప్పలు అడ్డురాకుండా శుభ్రముగా చేసుకొనవలెను. దైవభక్తి, దైవపరితాపన యున్నవారు తమలో దాగియున్న అహం కారము, అసూయ, ద్వేషము మున్నగు యితరులకు హానికలుగజేయు దోష గుణము లను బలవంతముగా బయటకు పారద్రోలవలయును. అట్టి వారే ఆదర్శజీవులుగా పరిగణింపబడుదురు.

ఆశ్రమములో శ్రీరామారావుగారి ఆదర్శజీవితము నుండి ఆశ్రమ వాసు లందరూ నేర్చుకోవలసిన వెన్నియో యున్నవి. ఆరోగ్యానారోగ్యమును లక్ష్యపెట్ట కుండా వారి పనులన్నియు వారే స్వయముగా చేసుకొనుచుందురు. అన్ని కాలముల లోను వారే స్వయముగా నూతినుండి నీళ్ళు తోడుకొని స్నానము చేయుదురు. **అట్టి ఆదర్శనీయులు నివసించబట్టియే ఈ ఆశ్రమము దినదినాభివృద్ధి గాంచుచున్నది. వారు ఇతరుల క్షేమమునే సదా కోరుచుందురు. అట్టి ఆదర్శనీయుల జీవితములు స్వర్గమునకు బాటలు వేయుచున్నవి. కనుక మీరందరూ వారివలె ఆదర్శముగా జీవింపయత్నించెదరుగాక.**

లోకాస్సమస్తా స్సుఖినోభవంతుః

ఓం ఓం ఓం

# 15. మౌన ప్రార్థన

వెలుతురున్నచోట, చీకటికి తావు లేనట్లు, దైవనిలయములలో దెయ్యములు ప్రవేశింప వీలగునా ? మన మనస్సులను ఎప్పుడు తనవైపు మళ్లింతుమా యని, భగవంతుడు సర్వదా నిరీక్షించుచుండునట. నేను లోపల గదిలోనుండి యిప్పుడు చక్కని మధురమైన సంగీతమును విని చాలా ఆనందించితిని. సంగీత, సంకీర్తనా ప్రభావము దైవాధీనమైనది. మౌన ప్రార్థనలో కూడ అట్టి ఆనందము లభించును. గాని దాని రుచిని గ్రహించువారు చాలా అరుదుగా నుందురు.

ఒక గురువు గారిని ఒక శిష్యుడు ఆధ్యాత్మిక ఔన్నత్యమును గూర్చి చెప్పమని కోరగా గురువుగారు మౌనము నవలంభించుట చూచి – శిష్యుడు ఆశ్చర్యపడి – మరల ప్రశ్నించగా గురువుగారు – భగవంతుడు నిశ్శబ్ద స్వరూపుడు. మౌనములో భగవదౌన్నత్యము ననుభవింపవలయునే గాని ఆ స్థితి మాటలతో చెప్పనలవి గాదు. అని మౌనము వహించెనట. **ఆధ్యాత్మిక విషయములను ఇతరులకు బోధించుట చాలా సులభము. గాని స్వయముగా ఆచరించి అనుభవించుట కష్టము. అందుచే మాటలు కట్టిపెట్టినచో, మౌన సుఖమును మనము సులభముగా అనుభవించగలము.**

మన ఆశ్రమములో ఒక బోర్డు మీద – “భగవంతుని చేరుటకు నిర్మలభక్తితో చేయు ప్రార్థన యొక్కటే సులభమైన మార్గము” అని వ్రాయబడియున్నది. అట్లే మన లోకశాంతి ప్రార్థన చేయునపుడు మన యింద్రియము లన్నింటియందు భగవంతుని ఉనికిని గుర్తించుచు ప్రార్థించినచో దైవముతో తాదాత్మ్యమును పొందగలము. నేటి ఉదయము (దైవప్రార్థనతో) ఆధ్యాత్మికముగ – రోగ నివారణా కేంద్రమునకు వెళ్ళి అచట లోకశాంతి ప్రార్థన ద్వారా ప్రజల క్షేమము కోరుచు ప్రార్థించుటతో మనస్సునకెంతయో తృప్తి నిచ్చెను. లోకశాంతియే మన శాంతిగా భావించి తరింతము గాక !

ఓం ఓం ఓం

---

యోగ మనబడు చిత్తవృత్తి నిరోధ స్థితి యందు గల
అమాయకమైన పసిబిడ్డల వంటి వారికే
పరలోక ప్రాప్తి కలుగును.

# 16. ఋణానుబంధము

"అంతా రామమయం ఈ జగమంతా రామమయం" అను కీర్తన యిప్పుడు చక్కగా పాడితిరి. నోటితో పాడుట చాలా సులభము గాని ఆచరణయుక్తముగా అనగా సృష్టిలోని ప్రతి జీవిని, మూగ జంతువులను కూడ దైవస్వరూపముగా భావించి ప్రేమతో సేవచేయగల్గినపుడే, ఈకీర్తనయొక్క భావమును అర్థము చేసుకొనగలవారమై జీవితమును సార్థకము చేసికొన్నవారమగుదము.

సాధువైనను, సంసారియైనను, వస్త్రధారణములో భేదముండునుగాని, ఎవరి హృదయములు భక్తిప్రేమలతో నిండియుండునో, అట్టి పవిత్రహృదయములే భగవంతునికి నివాసయోగ్యము గా నుండును. "సత్యం వద-ధర్మం చర" సత్యమను బాటలో నడచుచు, ధర్మయుతముగా జీవించెడివారి హృదయము స్వర్గధామము. మనస్సున్నచోట మనిషి మనగలడు గాని, శరీరమున్నచోట మనిషి మనలేడు. ఈ శరీరము పవిత్ర దేవాలయమువంటిది. ఈ సత్యమును గ్రహింపలేక ఈ శరీరమే నేనను భ్రాంతిలో, మానవుడు సుఖ,దుఃఖముల పరిధిలో జీవించుచున్నాడు. జ్ఞాని మాత్రము తన శరీరములో నున్నది ఆత్మస్వరూపమైన పరమాత్మ యని గ్రహించి కష్టసుఖములకు అతీతముగా నుండ ప్రయత్నించును.

ఒక నదీతీరసమీపమున ఒక జ్ఞానియైన సాధువు నివసించుచుండెను. ఆ సమీప గ్రామములో ఊరిచివర ఒక మాదిగవాడు చెప్పులు కుట్టుకొనుచు కుటుంబమును పోషించుకొనుచుండెను.

ఈ సాధువుగారు ఆ త్రోవనే ప్రతిదినము నదికి వెళ్ళి స్నానధ్యానాదులు పూర్తి చేసుకొని తిరిగి ఎండలో వచ్చుచుండుట ఆ మాదిగవాడు చూచుచుండెను. ఒకనాడు ఆ సాధువుగారి పాదములకు సరిపడునట్లు ఒక చెప్పుల జత సమకూర్చి ఆ సాధువు గారితో "బాబూ! తమరు ఎండలో వేడి యిసుకలో నడుచుచుండుట చూచి ఈ చెప్పుల జతను తమకొరకు తయారుచేసితిని వాటిని ధరింపుడని" ప్రార్థించెను.

"ఋణానుబంధరూపేణ, పశుపత్నీ సుతాలయాః" అను రహస్యమును తెలిసిన జ్ఞాని కనుక ఆయన వాటిని ధరింప నిరాకరించి ఎండలో నడిచియే వెళ్ళుచుండెను.

అది మండువేసవి కాలమగుటచే వేడి మిక్కుటముగా నుండెను. ఆ సాధువు వేకువ ఝాముననే యథావిధిగా నదికి వెళ్ళెను. ఆయన వెళ్ళుట చూచిన మాదిగ తాను కుట్టిన చెప్పులను తీసుకొని చాటుగా వెళ్ళి, నదికి కొంత దూరమున ఇసుకలో పెట్టిపోయెను. సాధువుగారు తమ నిత్యవిధులను పూర్తిచేసుకొని తిరిగి ఎండకు కాలిన యిసుకలో నడచి వెళ్ళుచుండ-త్రోవలో క్రొత్త చెప్పుల జత ఉండుట చూచి, వేడి బాధ భరించలేక అప్రయత్నముగా ఆ చెప్పులను వేసుకొని వచ్చుచు, త్రోవలో మాదిగ వానిని చూడగానే- విషయము గ్రహించి, చప్పున తన పాదములనున్న చెప్పులను విడిచి తాము చేసిన పొరపాటును వ్యధితహృదయుడై ఈ ఋణమునుండి

విముక్తి పొందుట ఎట్లను చింతతోనే మరణించుట ఆ ఋణ విముక్తికి మరుజన్మలో ఆ మాదిగ వానియింట పుట్టుట యను కథ మీలో చాలామందికి తెలిసియుండును. ఈ క్రింది శ్లోకములలోని సారంశమే ఆ సాధువుగారి ఋణానుబంధము కథ.

ఓం ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్య వరా న్నిబోధ

**శ్లో॥ కామః క్రోధశ్చ, దేహే తిష్ఠన్తి తస్కరాః**
**జ్ఞానరత్నాపహారాయ, తస్మాత్ జాగ్రత జాగ్రత ॥ 1**

**శ్లో॥ జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునః పునః**
**సంసార సాగరం దుఃఖం,తస్మాత్ జాగ్రత జాగ్రత ॥ 2**

**శ్లో॥ మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధుః సహోదరః**
**అర్థం నాస్తి గృహం నాస్తి, తస్మాత్ జాగ్రత జాగ్రత॥ 3**

**శ్లో॥ ఆశయా బధ్యతే లోకః కర్మణా బహు చిన్తయా**
**ఆయుఃక్షీణం న జానాతి, తస్మాత్ జాగ్రత జాగ్రత॥ 4**

మానవుని జీవితం ఆశా నిరాశల మధ్య – జ్ఞప్తి మరపుల మధ్య చిక్కుకొని కొట్టు మిట్టాడుచున్నది. కనుక మీ భక్తి హృదయములలో పై నాలుగు శ్లోకముల సారంశమును మరల మరల మననము చేయుచు **సంసారములో నున్నవారైనను సరే స్వధర్మనిర్వహణ చేయుచు–అందు లభించు మంచి చెడులకు విలక్షణముగా నుండి నిరంతర దైవజ్ఞప్తితో అమృతత్త్వము నొందెదరు గాక !**

ఇది నేటి సత్సంగ సందేశ సారాంశము

ఓం ఓం ఓం

---

ఆత్మ సూర్యునిఉదయం వంటి ఆనందము, సహృదయత్వము, మాధుర్యములను పంటలను వృద్ధి చేయును.

# 17. దివ్యానుభవము

మీరందరూ భక్తి శ్రద్ధలతో సత్సంగములో పాల్గొనుటకు వచ్చినందుకు ఆనందము. ఇప్పుడు ఇచ్చట మీకు లభించునది ఆధ్యాత్మికాహారము. నా స్వానుభవ ములను మీతో పంచుకొనకోరుచుందును. నా ధ్యానపు గదిలో నేను పొందిన దివ్యానందస్థితిని మీకు ఈ చిన్ని మాటలతో ఎట్లు చెప్పగలను ? అట్టి అనుభవము మాటలకు అతీతమైనది. అతిశయానందమైన స్థితి.

**"యతోవాచో నివర్తంతే – అప్రాప్య మనసాసహ"**

అది స్వానుభవైక వేద్యము. ఏకమేవాద్వితీయమైన స్థితి; ఇక మాటలు, గ్రంథ పఠనము లేల ? నీ జీవితమే ఒక గ్రంథమైయుండ ఇక దేనిని చదవవలెను? ప్రతి సంవత్సరము 364 అధ్యాయములతో మన జీవిత గ్రంథములు తయారగుచున్నవి. అనిత్యమైన జీవితగ్రంథముల పఠనములతోనే జీవితములు ముగియుచుండ–వాటికి అతీతముగా నుండుటెపుడు ? **దైవము మనకు లభించనంత దూరములోలేదు. అహం నశించి, మమతయను మాయను జయించిన వారి హృదయములలో ప్రవే శించుటకు, ఆయన ఆతృత చెందుచుండును.** అందుచే మన హృదయములనే బృందావనములుగా మార్చుకొని అర్హులముగా నున్నచో, ఆయన మనతో కలిసి పాడుచు నృత్యము చేయును. ముఖ్యముగా కావలసినది అర్హత. **నా భావములను మీరందరూ గ్రహించి, సాధన తీవ్రముగా చేసినచో నేను పొందన దివ్యానుభవమును మీరును పొందగలరు. దైవపిపాస, పట్టుదల యున్నచో మానవుడు సాధించలేనిదే మున్నది? మనకు లభించినది మనము సద్వినియోగము చేసినచో అది దినదినాభి వృద్ధిచెంది ఉన్నత స్థితికి చేర్చును. మీ అందరి తరింపే నా తరింపుగా భావించి యింతగా చెప్పుట జరుగుచున్నది.** ఇపుడు రఘుపతి రాఘవరాజారాం గానముచేసి శాంతి ప్రార్థనతో నేటి సత్సగమును పూర్తి చేయుదము గాక !

ఓం ఓం ఓం

---

ఆత్మయే అమూల్యమగు నిధి. దాని వలననే సమస్తము కనుగొందుము.
మరియు సమస్తము దాని కొరకే కోరబడుచున్నది.

# 18. గీతా జయంతి

ఈ రోజు అతి పవిత్రమైన దినము. శ్రీకృష్ణభగవానుడు అర్జుననకు – భగవద్గీ తను బోధించిన దినముగాన దీనిని మనము గీతాజయంతి దినముగా జరుపుకొను చుంటిమి. ఆయన అర్జునుని నిమిత్తమాత్రునిగా చేసి, ప్రపంచమునకే జ్ఞానబోధ చేసెను. భగవద్గీత జ్ఞాన, వైరాగ్య, భక్తి తత్త్వములను వివరించిన గ్రంథముగా దేశ విదేశములలో గౌరవింపబడుచున్నది.

ఈ రోజు తెల్లవారుఝామునలేచి నా విధులను నిర్వర్తించుకొని, అరుణోద యము వేళ మైత్రేయి ఆశ్రమమునకు వెళ్ళి – అచ్చటనున్న, శ్రీకృష్ణ విగ్రహముచెంత కూర్చుని, "కృష్ణా! నీ మురళి ఏది ?" అని ప్రశ్నించితిని. ఆయన మౌనములో నిశ్శబ్దముగా నున్నట్లనిపించెను. అనగా ఆయన నాకు ఇచ్చిన మౌనసందేశమును గ్రహించితిని.

**మురళి ఖాళీగొట్టము కనుక అది ఆయనకు ప్రీతిపాత్రమైనదట. అటులనే మనలోనున్న అహంకార, మమకారాది అరిషడ్వర్గములను జయించి, ఖాళీగొట్టముగా నున్న మురళీవలె కాగల్గినచో, ఆయన కృపకు పాత్రులము అగుదుము అనునదే శ్రీకృష్ణ మౌన సందేశ సారాంశము.**

కృష్ణ విగ్రహము వద్దనున్న కాశీరత్నమను పూలమొక్క పెరిగి,పెరిగి ఆయనను చుట్టుకొని ఎర్రని చిన్ని పూలతో నిండి–భగవంతునికి తనను తానే అర్పించుకొనుట చూచి "అది ఎంత ధన్యజీవియో" అనుకొంటిని.

నన్ను ఎవరో ప్రశ్నించిరి. "మీకు మాకు మధ్య ఎంతదూరమున్నదని" నేను మనము అనుకున్నంత దూరములో ఉంటిమి అని సమాధానము చెప్పితిని. **మానవు లైనను, జంతువులైనను, ఎదుట వారి పవిత్రప్రేమ హృదయములను బట్టియే, దగ్గర దూరమును భేదము గాన వచ్చును.**

దానిమ్మ, సీతాఫలములను విప్పి చూడుడు ! వాటి ఐక్యతా సంధానము– భగవంతుని సృష్టి విలాసము ఎంత చక్కగా కనుగొనగలమో ? భగవంతుడు మనకు నేత్రము లిచ్చినందుకు,మానవులందరి మంచిని, ఫల,పుష్ప,వృక్ష జాతులందలి ఆనందమును గ్రహించుచు వాటి వృద్ధి, త్యాగములను చూచుచు, భగవంతుని సన్నిధి ననుభవింపవలెను. నేడు గీతాజయంతి జ్ఞాపకముగా మీరందరూ ఆ శ్రీకృష్ణుని దివ్య సన్నిధిని అనుభవించెదరు గాక !

ఓం ఓం ఓం

# 19. బ్రహ్మ సత్యం - జగత్తు మిథ్య

మహర్షులు, సన్యాసులు అనగా సర్వసంగపరిత్యాగులు. బ్రహ్మసత్యం, జగత్తు మిథ్య అను సత్యమును తమ ఆత్మావలోకనానుభవముతో నుడివి యుండిరి. ఈ దృశ్య ప్రపంచము – దీనిలో సర్వజీవకోట్లు పుట్టుచు, నశించుచున్నందున జగత్తు మిథ్య – అనగా అనిత్యము అనియు – తరుగు పెరగులులేని సత్యవస్తువు – శాశ్వతమైనది బ్రహ్మ యను మూలశక్తి ఒక్కటియే గాన దానిని "బ్రహ్మ నిత్యం" అనియు అనుభవముగా నుడివియుండిరి.

కాని మనము మాయాప్రభావముచే అసలు వస్తువును మరచి తాత్కాలిక సుఖసంపదలలో మునిగి, క్షణభంగురమైన ఆనందమును పొంద ప్రయత్నించుట ఎంత విచారము? స్వర్గ–నరకములను వానిని మానవులు తమ మంచి, చెడు ఆలోచనలలోనే సృష్టించుకొనుచుండిరి. "జంతూనాం నరజన్మ దుర్లభం" అన్నారు మహనీయులు. **మంచి నడవడికచేతనే మానవుడు – తన నరజన్మను సార్థకము చేసుకొనగల్గుచున్నాడు.**

నిత్యము నేను దైవజ్ఞప్తితో స్నానము చేయునపుడు అపుడే జన్మించినట్లు భావించి నూతన శక్తితో ఆనందానుభూతిని పొందుచుందును. ఒక ప్రకృతివైద్యుడు శరీరమునకు "మసాజ్" చేయించుకొనుట మంచిదని చెప్పెను. ఆ సమయములో నాకు శరీరమే లేనట్లుగా గాలిలో తేలిపోవుచున్నంత సుఖముగానుందును. నేను అమెరికాలో మంచుమీద కాలుజారి పడినపుడు–ఒక డాక్టరు ప్రతిదినము 25 మైళ్ళు దూరము నుండి వచ్చి ఈ శరీరమునకు "మసాజ్" చేయుట నా కింకను జ్ఞాపకమున్నది. మనస్సు మంచి ఆలోచనలు చేసినచో, శరీరమునకు కూడా మంచి శక్తి లభించును. **శరీరారోగ్యమునకు అసలైన మందు ఆధ్యాత్మిక చింతనయే ! దానిని మరచుటయే అనారోగ్యమునకు ముఖ్యకారణమగుచున్నది.**

"మనిషి తన ఆలోచనలచేతనే పాప పుణ్యములను ఆపాదించుకొని, ఆవేదన చెందుట జరుగుచున్న"దని శ్రీ వివేకానందులు శలవిచ్చిరి. ఒక ఉదాహరణము.

అమెరికాలో ఒక చర్చికి అధిపతియైనవారు – తన పళ్ళు తీయించుకొని క్రొత్త పళ్ళు కట్టించుకొని ఒకనాటి రాత్రి నిద్రలో ఆపళ్ళను మ్రింగివేసినట్లు కలగని కడుపునొప్పితో చాలా బాధపడుచు ఆసుపత్రికి వెళ్ళెనట. అచట డాక్టరు నీవు పళ్ళు మ్రింగలేదని ఎంత చెప్పినా వినక తన కడుపు పరీక్ష చేయించుకొనుచుండెను. ఇంతలో అతని భార్య కట్టుడు పళ్ళు అతనిదిండు క్రిందనే యున్నట్లు ఫోను చేయగా ఆ వార్త విని అతడెంతయో సిగ్గుపడి ఆసుపత్రి బిల్లు చెల్లించి యిల్లు చేరెనట. "యద్భావం తద్భవతి" అను విధమున ఎవరి ఊహాఫలితమును వారే అనుభవించుచు అవస్థపడుట జరుగుచున్నది. కనుక **మన ఊహలు సదా యితరుల మేలు కొరకే చేయుచు జీవిత మార్గమును సుఖముగా మలచుకోవలయును.** అందుకే మన

పూర్వపు ఋషులు అసలు ఊహలే రానీయకుండా మనస్సును అరికట్టుమని బోధించిరి. కనుక మీరందరూ సత్సంగములో పాల్గొనిన జ్ఞాపకార్థముగా మీలోని ప్రతి కదలిక ఒక మహాశక్తి యొక్క ప్రభావమే యను జ్ఞప్తితో జీవించుచు – సత్యమైన బ్రహ్మమును చేరప్రయత్నింతురు గాక ! ఇది నేటి సందేశ సారాంశము.

ఓం ఓం ఓం

## ౨౦. ప్యూకహా - ప్రభు వెక్కడ ?

భగవంతుడు మనకు మరియొకరోజును ప్రసాదించినందుకు ఆయనకు కృతజ్ఞులమై యుందుముగాక ! ఆ దివ్యసన్నిధిని యిపుడు అనుభవించలేనిచో మరుక్షణము మనదని ఎట్లు చెప్పగలము ? **ప్రస్తుత క్షణమునుండే మీ మనస్సులను దైవము వైపు మళ్ళించవలెను. దైవార్తి కావలెను.**

మన ఆశ్రమమునకు “పిప్పిహా” పక్షులనునవి ఒక జాతి పక్షులు రెండు ప్రతి సంవత్సరము ఎచ్చటి నుండియో వచ్చి కొన్ని మాసములు యిచ్చట నివసించి వెళ్ళుచుండును. వాటి నిరంతర గానము ప్యూకహా – ప్యూకహా అని వీలనులవిందుగా మనోరంజకముగా వినిపించుచుండును.

ఒకప్పుడు హిమాలయమునుండి వచ్చిన ఒక సాధువు (ఆయనకు పక్షిభాష తెలియునట) ఆ పక్షుల అరుపు విని వాటి అర్థము చెప్పెను. ప్యూకహా ప్రియుడెక్కడ? లేదా ప్రభువెక్కడ ? అర్థము విని నా కెంతయో ఆనందమయ్యెను. ఆహా ! వాటి జీవితము లెంత ధన్యవంతమైనవి ? సృష్టికర్తయగు ప్రభు వెక్కడున్నాడను పరితాపనతో, అన్ని తావుల యందు వెదకుచు, విసుగు విరామములెరుంగక “ప్యూకహా” అని ఆర్తితో పిలుచుచున్నవే ! ఆ పక్షులవలె మానవులలో ఎంతమంది దైవాన్వేషణాపరులై పరితపించుచుండిరి ? అసలు భగవంతుని గురించి ఆలోచించెడి వారే అరుదుగా కనిపించుచుండ – ఇక అన్వేషణాపరులనెక్కడ చూడగలము? గతం నాస్తిగా భావించి – భక్తులైన మీరందరూ ఆ పిప్పిహా పక్షులనైనను ఆదర్శముగా తీసుకొని, మానవజన్మ గమ్యస్థానమగు దైవసన్నిధిని చేర ప్రయత్నించెదరు గాక !

ఇట్టి అపూర్వ స్వానుభవములను మీ అందరితో పంచుకొనుటకే నా మనస్సు సదా కోరుచుండును. ఇప్పుడు ముమ్మారు ప్రణవగానముతో మన సత్సంగమును ముగించుచుంటిమి.

ఓం ఓం ఓం

---

శాంతిని ఆపేక్షించు వ్యక్తి మొదట తన అంతరంగమందు మార్పును, దిద్దుబాటును చేసికొనవలయును.

# 21. దైవాజ్ఞ

మైసూరునుండి వచ్చిన శ్రీ మంజునాధయ్యగారు, మరియొక సోదరునితో ఆశ్రము నకు వచ్చి సత్సంగములో పాల్గొనుట ఆనందము. ఎంతయో దూరము నుండి యిట్టి వృద్ధులైన భక్తులు, శ్రమపడి వచ్చి యిచ్చట శాంతి ననుభవించుచు ఆనందించుట దైవాజ్ఞయే కదా ! శాంతిఆశ్రమం బయటి ప్రపంచమునకు దూరముగా నుండి ఆధ్యాత్మికచింతనాపరులకు అనువుగా నున్నందున, నానా దేశముల పలు ప్రాంతముల నుండి శ్రమ కోర్చుకొని వచ్చుచుండుట చూచి ఈ ఆశ్రమ నిర్మాణము వృధా కాలేదు కదా యని తృప్తి పడుచుందును.

భగవంతుని సంకల్పమాత్రమున ఈ సృష్టిజాలమంతయు ఉద్భవించినట్లు ఒకప్పుడు మహారణ్యముగా నుండిన ఈ స్థలములో ఈ విశాలమైన ఆశ్రమమును దైవమే ఈ మనస్సులో సంకల్పింపచేసి ఈ చేతులతో నిర్మాణము చేయించెను. నేను కేవలము ఆయన చేతిలోని పనిముట్టుగా నుండుట జరిగినది. భగవంతుడు నాకు ప్రసాదించిన మరియొక వరము “లోకశాంతి ప్రార్థన” అది అన్ని దేశముల వారికి, అన్ని మతములవారికి అనువుగా నుండునట్లు ప్రసాదించెను. ఈ ప్రార్థన మన పరివారమునందలి ప్రతి అణువును దైవ ఉనికిని గుర్తింపచేయగల శక్తిగలది. ఈ ఆశ్రమము నా కల్పిత బిడ్డ వంటిది. ఈ ప్రార్థన నా ఆరవ ప్రాణము. ఇందు మానవులే గాక, పశు, పక్షి జాతులేవి అభివృద్ధి చెందినా అది నా అభివృద్ధిగానే భావించి ఆనందించుచుందును. సూర్యోదయముతో సర్వజీవరాసులు మేల్కొనినట్లు **శాంతి ప్రార్థన పఠనముతో భక్తులందరును – తమస్సనెడు నిద్రనుండి మేల్కొని, దైవతేజస్సును లోపల, వెలుపల చుట్టును అనుభవించెదరు గాక ! భగవంతుడు మిమ్ములనందరిని శాంతితో బ్రోచుగాక.**

ఓం ఓం ఓం

---

నీవు వెలుపల వెదుకుచున్న శాంతి నీలోనే యున్నది.
ఆ శాంతిని చూడగలిగిననాడు అన్ని దిక్కుల నుండి వచ్చు
శాంతి ప్రవాహమునందుండగలవు.

# 22. వ్యక్తి శాంతియే - లోకశాంతి

దైవాజ్ఞ లేనిదే గడ్డిపరకయైనను కదలదను వాక్యము ఎంత సత్యమైనది ? ఆయన ఆజ్ఞవల్లనే మన మిట సమావేశమైతిమి. నేను వేకువఝామునలేచి అడుగు వేయునపుడు నా ప్రతిఅడుగు సర్వవ్యాపి అయిన భగవంతుని వైపునకే అనెడి భావన జ్ఞప్తి నన్నెంతయో ఉత్సాహపరుచును. **ఆయన సర్వశక్తియుతుడు గావుననే చదువుట, వ్రాయుట మొదలగువార్తలకు నాకు శక్తి కలుగుచున్నది. ఆయన సర్వజ్ఞుడు కనుక నాలోని ప్రతిభావనను ఆయనకే అర్పించుచుందును.**

నా 76 సం॥ జీవితములో 50 సంవత్సరముల ఆశ్రమ నిర్వహణలోను, “నా యిష్టమేమున్నది? నీ యిష్టమే నెరవేరనిమ్ము” అనునదే నా జీవితధ్యేయము. అందుచేతనే మీ అందరికీ నేను చెప్పుచున్నది ఒక్కటే !

“మీరు నా మీదను ఆధారపడవలదు, ఇతరుల మీదను ఆధారపడవలదు.”

మీలో చాలామందికి ఈ ప్రశ్న రావచ్చును. “అయినచో మేము ఎవరిమీద ఆధారపడవలయునని” నా సలహా యేమనగా, **మన అంతర్ జ్యోతియగు భగవంతుని మీదనే మనము ఆధారపడి జీవించుటలవరచుకొన్నచో, మీ ఆత్మవిశ్వాసము, ధైర్యము దినదినాభివృద్ధి గాంచుచు, మీలో దాగియున్న స్వశక్తి అనగా దైవశక్తి బహిర్గత మగును. అది మీ స్వంత అభివృద్ధికే గాక యితరుల అభివృద్ధికిని మార్గము చూపును. అపుడు మీ జీవితములే చరితార్థమగును.**

**ప్రపంచమునకే ఆదర్శముగా నుండవలసిన సాధుపుంగవుని తలంపులు స్వార్థ రహితముగా నిరాడంబరయుతముగా నుండవలయును. అట్టివారు నివసించు స్థల ములు పవిత్రమగును. అట్టి తావులలో కలహములకు కక్షలకు తావుండరాదు. అపుడే వారు నిర్వహించు ఆశ్రమములు పలువురు భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడును.** బైబిలులోని ఒక సూక్తి “దేవుడు దయ్యము ఒకే స్థానములో మనజాలవు. ఒక వ్యక్తి ప్రేమ త్యాగములే ప్రపంచ శాంతికి మూలము – గాంధీగారి సిద్ధాంతము – “పాపము దానిని చేయు వ్యక్తి ఒకటి కాదు. పాపి కూడ మంచిని మాత్రము చూచి పాపమును విడిచిపెట్టును.”

ఇపుడు మీరు చదివిన అధ్యాయములో “ఎన్నడు ఫిర్యాదు చేయకుము” ఇది ఎంత మహత్తరమైన వాక్యము ? అందరిలో ఒకే దైవశక్తి నిండియుండ, “నీవు ఎవరిపై ఫిర్యాదు చేయుదువు ? ప్రపంచములో కక్షలు కలహములే కదా యుద్ధము లకు దారి తీయుచున్నవి ! అందుచే **యిట్టి పవిత్ర ఆశ్రమములో నివసించువారు ఆచరణలో పెట్టవలసినది ఒకరిపట్ల ఒకరు నిర్మల ప్రేమతో నిండిన హృదయములతో సదా అందరి సుఖశాంతులకు సహకరించుచు ఆదర్శముగా నుండవలెను. వ్యక్తి శాంతియే లోకశాంతికి మార్గము గాన అందుకు మనందరము అర్హులుగా నుందుము గాక !** ఇది నేటి నా సందేశము.

ఓం ఓం ఓం

## 23. శాంతి వృక్షము

ప్రియ ఆత్మీయ భక్తులకు – హృదయపూర్వక స్వాగతము. నేను ప్రతి దినము చెప్పుచున్న స్వాగతవాక్యములు, సర్వాంతరాత్మయగు భగవంతుని సన్నిధికి.

నేడు అమావాస్య, ఎల్లెడల చీకటి ఆవరించియున్నది. దీనిని స్వచ్ఛమైన ప్రకాశ వంతమైన వెలుతురుగా మార్చుటెట్లు? నా స్వానుభవముతో, నాలో నిరంతరము ప్రకాశించుచున్న జ్యోతిని బహిర్గతపరచినచో, ఈ అంధకారయుతమైన చీకటిని తృటిలో వెలుతురుగా మార్చవచ్చును. ఆ మహిమ అంతయు అంతరాత్మ ప్రభావ ములో రహస్యముగా దాగియున్నది.

నేడు శ్రీ యోగానందస్వాములవారు చేసిన ప్రబోధము అమూల్యమైనది. దానిని ప్రతి ఆశ్రమవాసియు గ్రహించి ఆచరణలో పెట్టినచో శాంతి ఆశ్రమము స్వర్గధామ మగును. ఇందు ఒక భక్తురాలు నుడివిన సత్యము ఒక శిఖరాగ్రమునగల వృక్షము నుండి పక్షులు క్రిందపడవేసిన ఫలములను భక్షించుటకు అనేక వేల చీమలు అచట చేరును. ఈ భావన చాలా విశిష్టమైనది. ఈ ఆశ్రమస్థాపనలో నా జీవిత లక్ష్యము ఒక్కటియే ? వివిధ భావములు గలవారినందరిని దైవాత్మ స్వరూపులుగా భావించి, ఈఆశ్రమమును శాంతివృక్షపు నీడలో అధిక ప్రేమతో వేలవేల జనులను భక్తిఫలములతో ఆదరించి తృప్తి పరచవలయుననునదే నా నిరంతర ఆకాంక్ష. ఎవ్వరైనను ఆలయమును సంకుచిత దృష్టితో నిందించినను, మంచి దృష్టితో స్తుతించి నను నాకు సమానముగానే యుండును. ఏలననగా **ఆత్మస్వరూపుడైన భగవంతుడు నిందాస్తుతులకు అతీతుడు. ప్రవృత్తిపరులు నిందించిన నిందించెదరు గాక ! నివృత్తి పరులు నిజమును గ్రహించి ఈ శాంతివృక్షము దరిచేరి శాంతిని అనుభవించెదరు గాక !**

ఓం ఓం ఓం

---

ప్రపంచమంతయు బ్రహ్మమే.
పాపులందు, పవిత్రహృదయులందు సమస్త వస్తువుల యందు
భగవంతుని చూడగలుగుటయే మిగుల ఉచ్చస్థితి.

# 24. భగవంతుడు కాలస్వరూపుడు

సత్సంగములో పాల్గొన్నవారందరిని దైవసన్నిధికి ఆహ్వానించుచుంటిని. నా ప్రతి మాటయు పలువుర ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడవలయునని కోరుచుందును. నా స్వప్నములో కూడ, భక్తులందరిని దైవప్రపంచములో విహరింప చేయకోరు చుందును.

మాటలతో కంటె, మౌనధ్యానములతో మానవకోటిని ఐక్యసంధానము చేయగలము. నిశ్శబ్దరూపుడైన దైవముతో మన మనస్సులను విలీనము చేయుదుము గాక ! అట్టి అవకాశమును ఈ ప్రస్తుతక్షణములోనే వినియోగించుకొందము గాక! జ్ఞప్తియున్నచోట మరపునకు తావులేదు. దైవపరితాపపరులకు పనులెప్పుడును అడ్డురావు. **"నీ ప్రతి అడుగును దైవము వైపునకే. నీ ప్రతి మాటయు ఆయన మహిమను గూర్చియే ! నీ ప్రతి పనియు ఆయన ఆరాధనయే. అపుడు మరపునకు తావెక్కడ ?"**

"కాలమనెడి సర్పము మృత్యువనెడి నోటిని తెరిచి స్వార్థపరులను, సోమరులను మ్రింగుటకు వేచియున్నది. "కాలాత్మక పరమేశ్వరామ్" పరమేశ్వరుడు కాలస్వరూపుడు అను సత్యమును జ్ఞప్తియందుంచుకొని, మీకు లభించిన మానవజన్మను, వ్యర్థపు మాటలతో, వ్యర్థపు పనులతో వృథా చేయక, కాలము యొక్క విలువను గ్రహించి నిరంతర దైవజ్ఞప్తితో, పరోపకారయుత, సత్కార్యములలో వినియోగించి తరించెదరు గాక! అట్టి పవిత్ర జీవితములే అమృతములైనవి. అట్టివారు భౌతికముగా లేకున్నను, వారి భక్తిమయ, పవిత్రకార్యములు చిరకాలము కీర్తింపబడును. **భౌతిక కాయములు ఎప్పటికైనను నశించునవి. కీర్తికాయము నశించనిది. భగవంతుని లీలలను కీర్తించుట వలననే నీ ఇంద్రియములు అనగా నీ నోరు పవిత్రత నొందుచున్నది. కాలము సద్వినియోగమగుచున్నది. కాలము నీ వశములో నుండదు నీవు కాలము నకు వశుడవై, దాని విలువను గుర్తించి తరించుటే ముక్తికి మార్గము.**

ఓం ఓం ఓం

---

అహంకారము తనలో నున్న కొండవంటి దోషములను గమనింపనివ్వక, ఇతరులలో నున్న చిన్న నలుసులనే గోచరింపజేయును.

# 25. భీష్మ ఏకాదశి

నేడు భీష్మ ఏకాదశి. ఈ పవిత్రదినమున మన ప్రార్థనాలయమున ఏకాహము జరుగుచున్నది. మహాభారతములో భీష్ముని పాత్ర మహోన్నతమైనది. ఆయన ఆరాధ్య దైవము శ్రీకృష్ణుడు. ఈ ఏకాదశి పవిత్రఘడియలలో సత్సంగభక్తులకు గీతాచార్యుని సన్నిధి ననుభవించుటకు స్వాగతము పలుకుట నా కానందముగా నున్నది. ఏకాదశి యనగా భగవంతునితో ఏకము కావలసిన పవిత్రదినం.

విష్ణుమాయ విచిత్రమైనది. ఏకాంతములో దైవమువైపు మనస్సును మరలించి తాదాత్మ్యం చెందుటకు బదులు ఈ ఉపవాసదినము ఎట్లు గడుచునా ! యని భగవన్నామ సంకీర్తనలు పూర్తిగా మనస్సులలో నిలుపలేక, ప్రాపంచిక విషయము లతో కాలక్షేపము చేయువారు ఉండవచ్చును.

ఈ రోజున నా నోరుపూసినందున సరిగా మాట్లాడలేక పోవుటయు అంతయు మన మంచికే అనిపించెను.

శ్రీరామకృష్ణులు గొంతులో వ్రణముచే బాధపడుచు కూడ తమ వద్దకు వచ్చిన భక్తుల శ్రేయస్సును కోరుచు ఎంతయో కష్టపడుతూ మాట్లాడుచుండెడివారట. వారు దేహముక్తులు. వారి మనోవాక్కాయ కర్మలలో పసిబిడ్డ చేష్టలవలె శరీర స్మృతిలేకనే జీవించిన ముక్త పురుషులు.

ఇపుడు "ఇంతపరాకా" అను సంకీర్తన వింటిమి. దేనినైనను మరువవచ్చును. పరాకు రావచ్చును. గాని దైవము లేని తావు సూదిమొన మోపునంత స్థలమైనను లేనపుడు మనకు ఇంతపరాకు ఎట్లు వచ్చుచున్నది. దైవము సర్వాంతర్యామి యని గ్రహింపలేకపోవుటచేతనే ఈ పరాకు లేదా మరపు సంభవించుచున్నది. శరీరజ్ఞప్తి యున్నవారికి సుఖముకంటె కష్టమే ఎక్కువగా నుండును. భీష్ములవారు కఠినమైన అంపశయ్య యందుండియు శరీర జ్ఞప్తిని మరచి శ్రీకృష్ణ భగవానుని రూపగుణము లనే ధ్యానించుచు, పరవశించుచు ఈ పవిత్రదినమున శరీరమును వదలి తమనిజ స్థానమగు పరమాత్మలో లీనమయిన పుణ్యదినమిది. మన మనస్సులను భగవంతు నిలో లీనము చేయుదుము గాక !

ఓం ఓం ఓం

---

కూజా యందు గల ఆకాశము, ఆ కూజా పగిలినపుడు దానికి వెలుపల గల మహా ఆకాశమందెట్లు కలియునో అట్లే శరీరమును విడిచిన ఆత్మ, తన సర్వ వ్యాపకత్వ, సర్వ శక్తిత్వ, సర్వజ్ఞత్వములందు నిమగ్నమైపోవును.

## 26. ఆత్మానుభవము

సత్సంగ భక్తులకు స్వాగతము. నేను ప్రతివారినుండియు ఏదో ఒక మంచి విషయము విని నేర్చుకొనుటకే ప్రయత్నించుచుందును. ఇప్పుడు శ్రీ చైతన్యస్వాములు వారు చెప్పిన ప్రబోధసారాంశమును మీరు మరువకుండునట్లు తోడ్పడగలను. వారి ద్వారా నేనే మాట్లాడితినని చెప్పగలను. ఏలన భగవంతుడు సర్వశక్తియుతుడు. ఆ శక్తియే అందరిలోను ప్రస్ఫుటమగుచున్నది. ఇప్పుడు "నిధి చాలా సుఖమా! రాముని సన్నిధి చాలా సుఖమా" అను కీర్తన వింటిమి. ఈ కీర్తన వ్రాసిన త్యాగయ్య గారు ఎంత ధన్యులు ! రాముని సన్నిధిని అనుభవించుటలో గల సుఖమును వారు చక్కగా గ్రహించిరి. ఈ రాబోయెడి జన్మదిన కానుకగా శ్రీ తిరుపతిరాజుగారు వగైరా భక్తులు ఆశ్రమ మూలధనముగా 1 లక్ష రూ. అర్పించ ప్రయత్నించుచుండిరి. అది వినినప్పుడు నాకు నిధి చాలా సుఖమా ! అను కీర్తన జ్ఞాపకము వచ్చినది. రామనామస్మరణ మాధుర్యము ననుభవించు సాధువులకు ఈ మూలధనములు శాంతి, సుఖముల నొసంగునా ? ఇట్టి ఉత్కృష్ట భావములు ప్రవృత్తిపరులకు రుచించకపోవచ్చును. పందుల ముందు ముత్యములు పోసినట్లు నా భావనలు వ్యక్తపరచుట కూడా వృథాయని తలంచుచుందును.

నేటి ఉదయము విశ్వనాథాలయమువైపు రామనామము జపించుచు వెళ్ళి అపుడే ఉదయభానుని లేత కిరణములను తదేకముగా వీక్షించుచు అచట కూర్చుంటిని. ఆ తేజస్సు నాలో ప్రవేశించి తన్మయావస్థలో నున్నపుడు నాలోని భావన తేజస్సులకు మూలమైన తేజస్సు నీ లోపలనే ప్రకాశించుచుండ ఇక ఈ బాహ్య తేజస్సుల నేల చూడగోరుచుంటిననిపించెను. అంత్య ప్రబోధములో చక్కని ఆత్మానుభవమును పొందితిని. **లోపల వెలుపల ప్రకాశించుచున్న ఆ దివ్య తేజస్సునకే అన్ని ప్రణామములు.** ఓం తత్సత్ ఓం.

ఓం ఓం ఓం

---

మార్పుల మధ్య మార్పులేని ఆ 'విశ్వశక్తి'ని గుర్తింపవలయును.
అప్పుడే శాంతిని, సమిష్టిని, సంతుష్టిని పొందగలము.

# 27. హృదయపుష్పము

మనము సత్సంగ రూపమున సమావేశమగుటకు అవకాశమిచ్చి భగవంతుడు మరియొక రోజు ప్రసాదించినందుకు కృతజ్ఞులమై యుండవలెను. కృతజ్ఞత తెల్పుట నగా, పుష్పములు, పండ్లు వగైరా బాహ్యావస్తువులతో చేయు పూజకాదు. ఆయన మనలనుండి కోరునది హృదయనైర్మల్యము అనెడి పవిత్ర పుష్పము.

**అహింసా ప్రథమం పుష్పం పుష్ప మింద్రియ నిగ్రహః**

**సర్వభూతదయాపుష్పం-క్షమాపుష్పం-విశేషతః**

**తపః పుష్పం, శాంతిపుష్పం, ధ్యానపుష్పం, తథైవచ**

**సత్య మష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్ ॥**

ఎవరో మహానుభావులు - భగవంతునికి యిట్టి పుష్పములు ప్రీతికరమైనవని వ్రాసినవి చదివి ఆనందించుటతో లాభంలేదు. మన ఆకలి తీరవలెననిన మనము భుజింపవలయునుగాని, ఇతరులు భుజించిన మన ఆకలి తీరదుకదా ?

అట్లే ఎవరు స్వార్థరహిత ఉత్తమజీవితములను గడుపుచు పై నుదాహరించిన పుష్పములలో కొన్నింటినైనను సాధనచేసి సేకరించి భగవంతునికి అర్పించినచో ఆయన తృప్తి చెందును. మన పరితాపము ఫలించును. ఒక పర్యాయము శ్రీ రమాణాశ్రమమునందలి యొక భక్తుడు వారితో నిట్లనెను. “మీరు నిరంతరము మా మేలును కోరుచు ఎన్నియో మంచి బోధనలు గావించుచుందురు. మేము మీ ఋణము ఎట్లు తీర్చుకొనగలము ? మా కృతజ్ఞతనెట్లు చెప్పగలము?” అందుకు శ్రీరమణ మహర్షి, “మీరు నిరంతరము భగవంతుని, మనోవాక్కాయ కర్మలలో జ్ఞప్తియందుంచుకొని అభివృద్ధి చెందుటయే మాకు చేయు ఉపకారము” అని శెలవిచ్చిరి.

అట్లే నేను కూడ ఏబది సంవత్సరములాదిగా, ఆశ్రమ సందర్శకులను, భక్తులను విసుగు విరామము లేకుండగా **“మీరు దైవములో నివసించుచు, ఇతరులు కూడా దైవములో నివసించునట్లు చేయుటే నాకు మీరు చేయు ఉపకారమనియు, అదియే శాంతి ఆశ్రమ స్థాపనా సాఫల్యమనియు చెప్పుచుందును.** ఈ శరీరము నేను కాదు. ఇదియొక పవిత్ర దేవాలయము. ఇందు అనంత తేజోమయుడగు భగవంతుని దర్శింపవలెను అను భావన తలచినపుడు ఈ శరీరము సార్థకమగును. ఎండిన ఆకువలె పండిన పండువలె అనుక్షణము, శిథిలావస్థ చెందుచున్న ఈ శరీరము ఏదో ఒకనాడు కాలగర్భములో కలసి పోవలసినదే గదా ! ఇందులో ఎట్టి రహస్య మును లేదు. వార్ధక్యములో అవయవములు పట్లు తప్పుచున్నను, మనలను ఏ వైద్యుడు రక్షించునో, ఏ మందు ఈ శరీరమును కాపాడునో, అనుభ్రాంతినుండి, మనస్సును మరల్చి దైవమునందు సుస్థిరమొనర్చుకొనినచో, ఆ సుఖానుభూతిలో బాధలు మరచుటయే గాక జీవితము సుఖాంతమగును.

మన ఆదర్శ జీవితమే మన హృదయ నిర్మలతయే మధురసౌరభములీను వికసిత పుష్పమువలె భగవదర్పితమగును. అందుచే **మీ హృదయములను నేటి నుండియైన దైవ పూజార్హ పుష్పములుగా మార్చుకొని తరింపుడని కోరుటయే నేటి సందేశ సారాంశము.**

ఓం ఓం ఓం

## 28. ఇది కూడ వెడలి పోవలసినదే

కొందరు ఆదర్శవంతమైన జీవితములను గడుపుచుందురు. దానికి కారణము వారి మనస్సులను కేంద్రమగు ఆత్మయందే యుంచుకొందరు. అట్టివారు ధన్యజీవులు. వారు బాహ్యమున తోటిమానవులకు సామాన్యులవలె కాన్పించెదరు. కాని వారి మనస్సు సదా ఆత్మయందే కేంద్రీకృతమై యుండును.

సూర్యభగవానుని, తాత్కాలిక మేఘములు మరుగుపరచజాలవు. ఆ మేఘముల వెనుక ఆయన ప్రకాశించుచునే యున్నారు. ఈ నా భావనలు వినుటకు సులభముగా ఉన్నట్లే గానవచ్చునుగాని, ఆచరణయుక్తముగా అనుభవించుట చాలా కష్టము.

“ఇది కూడ వెడలి పోవలసినదే” యను తలంపే నాకు యెంతయో శక్తి నిచ్చును. సుఖము కానిండు; కష్టము కానిండు అన్నియు గతించిపోవుచునే యున్నవి. ఈ సందర్భమున చక్కని కథ యొకటి జ్ఞాపకము వచ్చుచున్నది.

పూర్వము ఒక మహారాజుండెడివాడు. అతడు అత్యంత ధార్మికుడు. అతడు ఒకనాడు తన గురువుగారిని దర్శించి, “తనకు ఏదైనను మంత్రము నుపదేశించ మనియు, అది మరచిపోకుండా సదా గుర్తు చేయునదిగా నుండవలయుననియు ప్రాధేయపడెను. అప్పుడా గురువుగారు ఆలోచించి “ఇది కూడ ఎప్పటికైనను నశించి పోవును.” అను అర్థమును సూచించు వాక్యమును ఒక ఉంగరముపై చెక్కించి రాజు గారి చేతి వ్రేలునకు పెట్టించి “ఈ ఉంగరము చూచినతోడనే ఇది జ్ఞాపకము వచ్చును. కావున మరచిపోవుటకు అవకాశమే లేదని చెప్పెను. ఆ రాజు దానిని ధరించి ప్రతిరోజువలె నిద్రలేవగానే వందిమాగధులు చేయు స్తుతులను వినుచు, తన దృష్టి వ్రేలిపైన ఉంగరముపై బడినందున అతడిట్లు తలంచెను.” ఈ స్తోత్రములు, ఈ వైభవములు మూడునాళ్ళ ముచ్చటయే.” ఇవి కూడా నశించిపోవలసినదే అని తలంచి ఆనాటి నుండి అతడు స్తుతులకు ప్రభావితుడు గాకుండెను. కొంతకాల మిట్లు గడిచెను. అనేకమంది సామంతరాజులు తాము జయించిన రాజ్యముల నుండి లభించిన సువర్ణాభరణములను తెచ్చి మహారాజునకు కానుకగా అర్పించిరి. అతడు వాటిని చూచి మహదానందమునందుచుండ, అప్రయత్నముగా అతని దృష్టి తన ఉంగరముపై బడెను. ఈ రత్నరాశులను చూచి మురిసిపోకూడదు. “ఇది

కూడ నశించిపోవలసినదే గదా!" ఈ సిరిసంపదలు ఏనుగు తినిన వెలగపండును బోలి యుండును. ఈనాటి లక్షాధికారి విధివశమున భిక్షాధికారి యగును. ఇట్టి చంచలమైన సంపదలందు మమత్వ మేల అని లోలోన తలంచుకొని ఆ సంపదల యందు నిర్లిప్తుడయి యుండెను.

మరి కొంత కాలమునకు అతనికి వివాహమయ్యెను. వధూవరులను నవరత్న ఖచిత పల్లకీలో మహావైభవముగా ఊరేగించుచుండిరి. నృత్యములు, మధుర గీతా గానములతో మేళతాళ వాద్యములతో, ఆ ఊరేగింపుటుత్సవము కనుల విందుగా నుండెను. రాజునకు ఎదురుగా బంగారు బొమ్మవలె ఆ వధువు కడు సౌందర్యమున నొప్పు చుండెను. ఈ ఆనందాతిరేకసమయమున రాజు దృష్టి తాత్కాలికముగా తన వ్రేలి ఉంగరముపై బడెను. "ఇది కూడ ఎప్పటికైనను నశించిపోవునదే గదా !" యను తలంపుతో "నా ఎదురుగా కూర్చునియున్న ఈ పెండ్లికూతురు, ఒకనాటికి కాలగర్భములో కలసిపోవు ఒక పదార్థము మాత్రమే ! ఇది రక్తమాంసములతో కూడిన తోలుబొమ్మయే ! పంచ భూత సమ్మేళనమువలన ఏర్పడిన ఆకృతి మాత్రమే" అని తలంచి లోలోన విరాగము నొందెను. అప్పటి నుండియు రాజ్య వ్యవహారములు నిర్వహించుచున్నట్లు పైకి కనిపించినను లోలోన ఈ నశ్వరమగు బాహ్య జగత్తునకు విలక్షణముగా నుండి, విరక్తిగలిగి నీ వాస్తవమును గ్రహించినవాడగుటచే తనలో నున్న సద్వస్తువును దర్శించి నిరతిశయానందయుతశాంతిని బొందెను.

కనుక "యద్ధృశ్యం-తన్నశ్యతి" **ఈ కానవచ్చుచున్నదంతయు నశించునది యను సత్యమును గ్రహించి అవినాశియగు దానిని, ఎంత త్వరలో గుర్తించగలిగిన అంత వేగిరముగా "ఇది ఎప్పటికైననూ నశించునదే" అను భావనను మరపులేని జ్ఞప్తితో స్మరించుచు, శాశ్వత సత్య స్వరూపుడగు పరమాత్మను ధ్యానించుచు తరించెదరు గాక!** ఇదియే నేటి నా సందేశ సారాంశము.

ఓం ఓం ఓం

---

సాధనా పరంపరలో చిట్టచివరది సహజసమాధి.
ఇట్టి స్థితి యందు సాధకుడు ఎండుకొబ్బరి నుండి వేరుపడిన
కురిడీవలె అన్ని విషయములకు దూరమగును.

## 29. ప్రతిబింబము

శాంతి ప్రతి మానవుని జన్మహక్కు. గాని అశాంతి అన్నివైపుల నుండి మానవులను చుట్టుముట్టుచున్నది. నిజముగా శాంతిని పొందవలయునన్నచో మనస్సును నిశ్చలముగా నుంచుకొన ప్రయత్నించవలెను. నిశ్చలముగా, నిష్కళంకముగా నున్న మనస్సును మాలిన్యము అంటజాలదు. అపుడు అచ్చట శాంతి ప్రత్యక్షమగును. ఇంత సులభమైన మార్గమును విడిచి, **చాలమంది శాంతిలేదు అనుకొనుచు ఎచ్చటెచ్చటికో వెళ్ళి దానిని పొంద ప్రయత్నించుట వెర్రితనము. శాంతి అనునది దూరముగా, అన్యముగా ఎచ్చటనో లేదు. అది మీరున్నచోట మీలోనే యున్నది. దానిని పొంద ప్రయత్నించువారు మొదట హృదయమును పరిశుద్ధమొనర్చుకొనవలెను.**

ఈ భౌతికశరీరము ఒక పాత్ర వంటిది. పాత్ర యందలి నీరు స్వచ్ఛముగా, నిశ్చలముగా నున్నచో, అందు సూర్యబింబము చక్కగా ప్రతిఫలించును. పాత్ర ఎట్టిదైన నేమి ? అది బంగారుదైనను, వజ్ర స్థాపితమైనదైనను, కడకు మృణ్మయ పాత్రయైనను, అందుగల నీరు నిశ్చలముగా నిర్మలముగా లేనిచో అందు సూర్యుడు ప్రతిఫలింపడు గదా ! అట్లే ఈ ఉపాధి ఎట్టిదైనను అందలి హృదయ నైర్మల్యము ముఖ్యము. అపుడు మాత్రమే కోటిసూర్య ప్రభలతో భగవంతుడు అందు ప్రకాశించును. ఆ ప్రకాశమును గుర్తించువారికి అంతయు శాంతిమయముగానే కనిపించును. “గతం గతః” **వలికిపోయిన పాలకై విచారించక యికముందైనను స్వచ్ఛమైన తెల్లని పాలను నేలపాలు చేసికొనక, హృదయములకు ఇది వరకు అంటిన మాలిన్యమును కడిగేసుకొని పరిశుద్ధమైన అద్దములో కనబడు ప్రతిబింబమువలె, మీ స్వచ్ఛ హృదయములో దైవజ్యోతిని గాంచి తరించుటకు ఈ ప్రస్తుత క్షణమునుండియైనను ప్రయత్నించి సఫలీకృతులగుదురుగాక !**

ఓం ఓం ఓం

---

మనము చేయ ప్రతి కార్యమునందును
పరమాత్మయే స్వయం వ్యక్తమగుచుండునని గ్రహించినచో
అహంకార మమకారములను మరవగలము.

# ౩౦. అహింసయే శ్రేయో మార్గము

నేడు గాంధీ మహాత్ముని జన్మదినము. ఎందరో మహానుభావులు, కాలగర్భములో కలసిపోవుచుండిరి. కాని కొంతమంది మహనీయులు సర్వకాలములలోను మన హృదయములలో నిత్య ప్రదీప్తులుగా వెలుంగుచు మంచికి మార్గమును చూపుచుం దురు. నేడు దేశములో ఎంతమందియో ఆయనను శ్లాఘించు చుందురు. నిజముగా వారి ఆత్మ కోరుచున్నది. పొగడ్తలు, పూలమాలలు గాదు. మానవునిగా జన్మించిన ప్రతి వ్యక్తీ సత్య అహింసావలంబకు లైనపుడే, భారతదేశము ప్రపంచముననే ఆదర్శ దేశముగా నిలుచునని నొక్కి వక్కాణించి, ఆచరించి చూపిన మహనీయుడు. సత్యమే దైవము. సత్యమును ఆరాధించుటే దైవమును ఆరాధించుట యని చాటి చెప్పిన దృఢవిశ్వాసి ఆయన. కాని ప్రస్తుత కాలములో ఊహాగానములు ఉపన్యాసములతోనే అహింసా మార్గము అగమ్యగోచర మగుచున్నది.

ప్రతివారు ఊహావలయములో చుట్టుకొనియుందురు. అవి ఒక్కొక్కసారి మంచి ఫలితము నీయవచ్చును. మరియొకసారి ప్రతికూలముగాను పరిణమించవచ్చును. అది మొదట చిన్న తలవెంట్రుకవలె బయలుదేరి వామనమూర్తిలా వృద్ధి చెంది పోతుంది. “ఇంతింతై వటుడింతై బ్రహ్మాండాంత సంవర్ధియై” అంటాడు భాగవతమును వ్రాసిన పోతన. ఈ విశ్వమంతా తానే ఆక్రమించాడు వామనుడు.

అట్లే మన ఊహాగానము కూడ మొదట చిన్నతాడుగా, అది పగ్గముగా, పగ్గము పెద్ద ఓడలకు లంగరుగా ఉపయోగించు మోకుతాడుగా తయారైపోతూ ఉంటుంది. చిన్న విత్తునుండి ఉద్భవించిన మర్రిచెట్టు ఊడలను దించుకుంటూ ఎంత దూరమో విస్తరించిపోతూ ఉంటుంది. అట్లే ఊహలు వాస్తవ రూపంగా నికలడగా లేనిచో దుఃఖాలకు అంతూ ఆది ఉండదు. అందుచే **ఊహలను ప్రారంభములోనే త్రుంచి వేయాలి. ఊహాతీతమైనదే శ్రేయోమార్గము. అహింసా మార్గమే అన్ని మార్గములలోను శ్రేష్ఠమైన మార్గము.** ఇక సత్యమునకు ఆయన ఇచ్చిన విలువ వర్ణింపరానిది. వాస్తవమునకు సంస్కృతమున “సత్యము” అను పదము యొక్క అర్థము శాశ్వతమైనది. భగవంతుడు (సత్–చిత్–ఆనంద) సత్య,జ్ఞాన,ఆనంద స్వరూపుడు. మహాత్ముని జన్మదిన జ్ఞాపకార్థముగా **మన ఆశ్రమవాసులందరు సత్య–అహింసలను ఆలంబనముగా చేసికొని పవిత్ర జీవితములను గడపుచు తోటి ప్రజలకు ఆదర్శముగా నుండవలెనని కోరుచుంటిని.**

సత్యమేవ జయతే.

ఓం ఓం ఓం

## 31. కాల నిర్ణయము

దైవము లేక ఆ దివ్యాంశము భూతభవిష్యత్ వర్తమాన కాలమన్నింటి యందు నున్నందున, దైవ ప్రార్థనలకు కాలనిర్ణయ మనునది లేదు. ఆ దివ్యశక్తి ముందు మనము ఇసుక రేణువుల వంటివారము. నీటిబుడగ సముద్రమునుండి వేరు కానట్లు, కిరణము సూర్యుని నుండి వేరుకానట్లు, మానవుడు నమ్మినను, నమ్మకపోయినను, తాను ఆ సచ్చిదానంద సముద్రములోనే యున్నను, మాయా ప్రభావమువలన తనకు అందుబాటులో లేని దేనికోసమో వెదకులాడుచు, నిజస్వరూపమును మరుగు పరచు కొనుచుండెను.

**ముండ్ల మధ్యనున్న గులాబి పుష్పము తన సువాసనలను అంతటా వెదజల్లు నట్లు మానవుడు తన నిజస్థితిని, తన ఉనికికి కారణమైన దైవశక్తిని గమనించినచో ఆ గులాబి పుష్పమువలె ఎన్ని అడ్డంకులనైనను అధిగమించి ప్రభావితుడగును. సర్వకాల సర్వావస్థల యందు ఆ జ్ఞప్తి ముఖ్యము.** బాలుడైన భక్త ప్రహ్లాదుడు నుడివి నట్లు.

**పానీయములు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ**
**లా నిద్రాదులు సేయుచుందిరుగుచున్ లక్షించుచున్ సంతత**
**శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతస్వాద సం**
**ధానుండై మఱచెన్ సురారి సుతుడే తద్విశ్వమున్ భూవరా.**

**మన నిత్యకృత్యములలో, కార్యాలయంలో పనిచేయుచున్నను, ముద్రణాల యంలో పనిగాని, తోటపనిగాని ఎప్పుడు ఏ పనిచేయుచున్నను దైవమును మరచి నను, మరల జ్ఞప్తికి తెచ్చుకొని బాధ్యతలు నెరవేర్చినచో ఆయా పనులు సఫలమగును.** శ్రమ ఫలించును. భజనలు చేసినపుడు ఆధ్యాత్మికోపన్యాసములు వినుచున్నపుడు భగవంతుని గురించి, ఆయన ఉనికి గురించి విని ఆనందించుటతో లాభముండదు. ఆ జ్ఞప్తి నిత్యానుష్ఠా నముగానున్నచో అదియే అభ్యాసముగా మారును. అభ్యాసమునకు అలవాటు పడిన మనసు ఆహార విహారములలో, అన్ని అవస్థల యందు నోరు దైవనామమును ఉచ్చరించునే యుండును. ఇది అనుభవైక వేద్యముగా చెప్పుటగుచున్నది. అందుచే దైవతపనకు కాలము నిర్దేశింపబడలేదు.

ఓం ఓం ఓం

---

ఆలోచించుట, వ్రాయుట వంటి మానసిక, శారీరక క్రియలయందును,
సర్వచలనములందును ఏకైక అవిచ్ఛిన్న శక్తియే పని చేయుచున్నది.
ఈ సూత్రమును సదా జ్ఞప్తియందుంచుకొనవలయును.

# 32. బ్రహ్మానంద సుఖము

సర్వాంతర్యామియగు దైవసన్నిధి ననుభవించుటకు ఆశ్రమ సందర్శకులుగా వచ్చిన స్వాములకు స్వాగతము. నా మతములో క్రొత్తవారు, పాతవారు అనే భేదము లేదు. అందరూ ఒకే దైవ సంతానమైనపుడు ఎవరికి ఎవరు అన్యులుగా నుందురు? ఇపుడు ఆశ్రమభక్తురాలగు కృష్ణవేణి "ప్రేమమయమే జగము-త్యాగమయమే జీవితము" అను పాటను శ్రావ్యముగా పాడుట విని చాలా ఆనందించితిని. ప్రేమ యనునది మహత్తరమైనది. అది బద్ధశత్రువులనైనను ఆకట్టుకొనగలదు. ఇక త్యాగమయ జీవితములు చిరకాల స్మరణీయములుగా నిలుచును. ఈపాట చివరలో శిబి చక్రవర్తి, భీష్ముడు, బలి చక్రవర్తివంటి యుగపురుషుల త్యాగమయ జీవితములు చక్కగా కీర్తింపబడినవి. త్యాగమయులు చేయజాలని దేమియు భూమిపై నుండదు. ఈ యుగములో గాంధీమహాత్ముని త్యాగమయ జీవితమే మనకు ప్రత్యక్ష తార్కాణము. అట్టి వారిని సామాన్యులు అర్థము చేసుకొనజాలరు. శ్రీకృష్ణుడు దుష్టశిక్షణ, శిష్ట రక్షణ ఎట్లు చేయగల్గెనో కృష్ణుని అంతటివారు జన్మించినపుడే గ్రహించగలరు. వివేకానందస్వామి అంతటివారు మరల జన్మించినపుడే ఆయన చెప్పిన గూఢతత్త్వమును అర్థము చేసికొనగలరు. అట్లే నా భావములు నిగూఢముగా నున్నట్లు వినువారికి అనిపించవచ్చును. శ్రీరామతీర్థులు చెప్పినట్లు – "నీవు ఇతరులను సంస్కరింపచేయ వలయునన్నచో మొదట నిన్ను నీవు సంస్కరించుకొనుము" అను సత్య రహస్యమును బోధించిరి. అట్లే **నేను కూడ ఇతరులకు బోధన చేయుటలో విలువైన కాలమును వృథా చేయుటకంటే ఏకాంతములో మౌన ధ్యానములతో శేషజీవితమును గడుపుటయే మంచిదని తలంచుచుందును. గుర్తించువాడు, గుర్తింపజేయువాడు ఒక్కడే అని తలంచుటలోనే బ్రహ్మానంద సుఖమున్నది.** శబ్దములో, నిశ్శబ్దములో ఆ మహా శక్తియే పరిభ్రమణము చేయుచున్నది.

ఓం ఓం ఓం

---

మనకు అజ్ఞాతమైన దైవసంపత్తు గలదు. సకాలమున నది అనుగ్రహింపబడును. (తన్నిమిత్తము) భగవంతునిపై ఆధారపడుట నేర్చుకొనవలయును.

# 33. జ్ఞాపకశక్తి

విజ్ఞులైన భక్తులు తమ నిత్య జీవిత కార్యక్రమములను యథావిధిగా నిర్వహించుచు, జ్ఞప్తియందున్న విషయమును మరల మరల మననము చేయుచుందురు. అవిజ్ఞులు, ఎరుక మరుపులు, మంచిచెడ్డలు, వివేకావివేకములు సత్యా సత్యములను గ్రహించు శక్తి లేక, వారి తాపత్రయములలోనే వారు సదా మునిగియుందురు.

సాధకులు మంచిని అనగా జ్ఞానయుతమైన విషయములు చదివినవి, విన్నవి జీవితాంతము వరకు మరపులేని విధముగా జ్ఞాపకముంచుకొని ఆనందానుభూతి నందెదరు.

నిన్న దక్షిణ అమెరికానుండి వచ్చిన ఒక సోదరి – ఎప్పుడో చాలా కాలము క్రిందట మన పీస్ అను ఆంగ్ల పత్రికలో అచ్చుపడిన "నేను దైవముతో కూర్చుని యుంటిని" అను పాటను, దైవానుభూతిలో విలీనయై – ఆనందముతో పాడుట చూచినాకు చాల ఆశ్చర్యమయ్యెను. 60 సం॥ల పూర్వము స్థాపింపబడిన శాంతి ఆశ్రమం గురించి, మనదేశములో అననేల ? ఆంధ్రరాష్ట్రములో కూడ తెలియని వారుండవచ్చుననుటలో సందేహములేదు. ఒకవేళ తెలిసినను, వారి ప్రాపంచిక కార్యక్రమములో ఆశ్రమసందర్శనము అంత ప్రాముఖ్యము నందియుండక పోవచ్చును. "మతేగతి" మతి అనగా మనస్సు సరిగానున్నచో అదియే మంచి గతికి దారి చూపును.

ఆత్మజ్ఞప్తితో చేసిన లోకశాంతి ప్రార్థన మాహాత్మ్యము యొక్క శాంతి తరంగములు, దేశవిదేశములను, ఖండాంతరములను అధిగమించి శాంతియుత వాతావరణమును సృష్టించగల శక్తివంతమైనవి. అది కేవలము ఆత్మ సాక్షాత్కారమును పొందిన బ్రహ్మవిదుల వలన అతిసులభముగా ప్రసారమగును. **మానవులందరూ ఒకే విధమైన సృష్టియైనను, వారి వారి సాధనాతీవ్రతను బట్టి ఆత్మవిదులుగా నుండి బ్రహ్మ సాక్షాత్కార భాగ్యమును పొందగలరు.** విజ్ఞురాలైన మన అమెరికా సోదరిని భగవంతుడు శాంతితో బ్రోచుగాక ! మీరందరును అట్టి దివ్య జ్ఞాపకశక్తి కలిగి శాంతిని పొందెదరు గాక !

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం ఓం ఓం

---

ఓ బిడ్డా ! ప్రేమకొరకే భగవంతుని ప్రేమించుట నేర్చుకొనుడు.

ప్రతి పనియు ఆయన కొరకే. ఇతర మంతయు

అల్లకల్లోలము, అంధకారము, మృత్యువు.

# 34. మనసు స్వాధీనమైన....

నేటి సత్సంగములో యిపుడు "వినవే ఓ మనసా" అను కృతి చక్కగా గానము చేయబడెను. అసలు మనసు అనునది మన స్వాధీనములో నుండినప్పుడు గదా – దానిని బంధించి వినిపించుట జరుగును ? అందుకే శ్రీ త్యాగరాజులు వారు, "మనసు స్వాధీనమైన యా ఘనునకు మరి మంత్ర తంత్రములేల ! అను కృతిని చక్కగా వివరించిరి.

ఎవరి మనస్సునకు వారు ఉపదేశించుకొని దానిని బుద్ధిబలముతో జయించి నపుడు మనస్సు మనము చెప్పినట్లు వింటుంది. మనలను మనము సంస్కరించు కొనుటలోనే నిజమైన మతము ప్రారంభమగుచున్నది. మన మనస్సులను బట్టియే మతము లేర్పడు చున్నవి. సర్వమతసమన్వయమును, సామరస్యమును గోరు మనస్సు గలవారే అందరిని తమ ప్రేమలో ఇముడ్చుకొనగలరు.

సర్వజీవ కోటికి సమానముగా వెలుతురును పంచి, సూర్యుడు ప్రేమతో వారికి ఆరోగ్య, ఆహారములను తన వేడిమి, తేజస్సులతో సమకూర్చుచున్నాడు. ఆయన విరామ మెరుగని నిస్వార్థసేవాపరాయణ దీక్షాపరుడు. ఇక సముద్రము నిరంతర ఓంకార నినాదముతో ఎడతెరపిలేని అలలను సృష్టించుటే గాక, తనకు తెలియకనే ఆవిరిగా మారుచు, మరల వర్షరూపమున భూమిని సస్యశ్యామలమొనర్చి ప్రజలకు జీవనాధారమగు పంటల నిచ్చుచున్నది. ఈ రహస్యమును ఎందరు గుర్తించు చుండిరి. వెర్రిమానవులు అంతయు తమ కృషివల్లనే జరుగుచుండెనని అహం కరించుదురు. పంచభూతముల సహాయము లేనిదే మానవుడు భూమిపై మనజాలడు. ఇక వీటన్నింటికి మూలశక్తియైన పరమాత్మతత్త్వము నెటుల తెలిసికొనగలము? గాన మొదట మనస్సును స్వాధీనమొనర్చుకొని బుద్ధిలో ప్రవేశింపచేసినచో బుద్ధి వివేకవంతమైన ఆత్మలో ప్రవేశించును. అచట "నిశ్శబ్దో బ్రహ్మ". **సూర్య సముద్రులే నా ఆరాధ్య గురువులు. వాటికి ప్రణమిల్లుచు, ఆ దివ్య తేజోమయ ఓంకార నాద ముతో నా మనస్సు లయించుదును గాక !** ఇది నేటి సందేశ సారాంశము.

ఓం ఓం ఓం

---

తాను ఏ కొరతలేని సంపూర్ణుడనని గ్రహించినచో,

పిమ్మట ఏదైన చేయవచ్చును, మానవచ్చును.

# 35. ప్రకృతి సౌందర్యోపాసనము

ఈ దినమంతయు వివిధ రకముల కార్యక్రమములతో గడుపుటచే మనస్సు అవిశ్రాంతిగా నుండుటచే సాయంసమయములో ప్రకృతిమాత ఒడిలో సేద తీర్చు కొనదలంచి కొండవైపు వెళ్ళితిని.

అది సంధ్యాసమయము. పరమేశ్వరుని అద్భుత చిత్రకళానైపుణ్యము నాలుగు దిశల యందు శోభాయమానముగ నుండెను. అస్తమయ సూర్యుని బంగారు కిరణ ములు నీలిమేఘములపై ప్రసరించుటచే సూర్యకాంతి పరివర్తనము చెంది తూర్పు కొండపై చిత్రవిచిత్ర రంగులతో ఇంద్రధనస్సు కల్పింపబడెను. ఆ మనోహర దృశ్య మును గాంచుచు, నిశ్శబ్దముగా కూర్చుని ధ్యాననిమగ్నుడ నైతిని. ఆ దృశ్యము మాటలతో వివరింప శక్యముకానిది. అది స్వీయ నేత్రములతో చూచి ఆత్మానందాను భూతి నందినవారికే లభించును. ఇతరుల కది అసాధ్యము.

అజ్ఞానతిమిరాంధకారబంధురమునుండి వెలుపలికి రాగల్గినపుడే ఆ జ్ఞాన భాస్కరుని తేజస్సును, లోపల (అంతరమునను) బాహ్యమున అన్నివైపులను గాంచ గలము. ఈనాటి నా దివ్యానుభూతి నా వారసత్వము. నా వారసత్వమును ఈ ఆశ్రమము ద్వారా మీకు అందజేయ కోరుచుంటిని. ఆ ఆనందప్రదఘడియల నుండి చిరుచీకటిలో నిర్వాణమందిరము చేరి ఈ సత్సంగములో మీ అందరిని చూచు టానందము. ఇపుడు శ్రీ త్యాగయ్యగారి “జ్ఞానమొసగరాదా!” యను కృతి విని నాకెంతయో ఆనందమైనది.

ఆ జ్ఞానమే లేనిచో మానవుడు పశుతుల్యుడగును. జ్ఞానమొసగరాదా యని ఎవరిని ఎవరు ప్రార్థించవలయును ? చిలుకపలుకుల వలె నోటితో పాడుటతో లాభము లేదు. దాని అంతరార్థమును జ్ఞానులగువారే గ్రహించి సహజ జ్ఞానానంద మగ్నులగుదురు. జ్ఞానప్రదాత భగవంతుడు. మనలను మానవులుగా సృష్టించి జ్ఞాన మొసంగియే యుండెను. కాని కొందరు మరపుచే జ్ఞాన విహీనులగుచుండిరి. **తమకు బాహ్యమున లభించుచున్న ధన ధాన్యములతో తృప్తిచెందక, విజ్ఞులైన వారు భగవం తుని పొందు జ్ఞానమార్గము నన్వేషింపవలెను. అప్పుడే మానవజన్మ సార్థకమగును.** ఇది నేటి సందేశ సారాంశము.

ఓం ఓం ఓం

---

లౌకిక విషయములను దూరముగా నుంచి దైవ ప్రార్థనలు చేయవలె

ననుకొనుట ఒక్క ఆదివారమునాడు మాత్రమే జరుగనేల ?

ప్రతి దినము ఒక తేజోవంతమైన ఆదివారముగ, ప్రార్థనలతో, శాంతి

విరామములతో ఆనందముగా నుందుము గాక !

# 36. ఆధ్యాత్మికాహారపు విలువ

శరీరమునకు ఆహారము అవసరము కాదని ఎవరనగలరు ? శరీర దృఢత్వమే మనస్సునకు ముఖ్యావలంబనము. కాని పూర్వపు ఋషుల మాట ఏమిటి? గాలి తోను, నీటితోను పెక్కేండ్లు తపస్సు చేసిన మహనీయుల గురించి వినుచునే యుం టిమి. అది యొక యుగము అనిపించవచ్చును. కాని మనిషి ఆనాడు ఈనాడు ఒకే విధముగా సృష్టింపబడి పెరుగు తరుగుల స్థితిని పొందుచుండెను.

ఈనాటికిని అపక్వాహారము, పండ్లు, పాలతో జీవించుచు దైవదర్శనము చేయు వారు మనకు సమీపముగా బాహ్యముగా కనిపించకపోయినను, అజ్ఞానము అను తెర వెనుకకు వెళ్ళి చూచినచో – అట్టి మహనీయులను, జ్ఞానులను దర్శింపగలము. వారు కనిపించకపోయినను వారి అనుష్టాన, ఆత్మానుభవ ప్రభావము చాల మేర వ్యాపించి శాంతివాతావరణ మేర్పడును. ఏదో ఊహాతీతమైన దానిని గురించి చెప్పుట నా అభిమతము గాదు. చెప్పిన భావములు చిన్నవిగా, అల్పముగా కన్పించ వచ్చును. దానివలన నాకే నష్టము లేదు. ఏదో విధముగా భక్తుల అభివృద్ధికి తోడ్పడుటే నా జీవిత ఆకాంక్ష.

ఒక పర్యాయము శ్రీ రమణాశ్రమవాసి ఒకరు మహర్షి వద్దకువెళ్ళి, ఆశ్రమ ఆహారము గూర్చి ఫిర్యాదు చేసెనట. అందులకా రమణులు యిట్లు చెప్పిరి. “మీరు ఆశ్రమమునకు ఆహారమునకే వచ్చినచో యిచ్చటమీకు అంతయు అసంతృప్తిగనే యుండును. కాని మీకు ఆధ్యాత్మికాహారపు రుచి తెలిసినచో సర్వము మీకు మధుర ముగనే యుండును.

నా భావన కూడ అదియే ! తేనెటీగలు పుష్పముల మధువును గ్రోలి తద్రసా స్వాదన యందలి మాధుర్యముచే తిరిగితిరిగి మధువునే గ్రోల పరిభ్రమించు చుండును. అట్లే **నివృత్తి పరులు యిట్టి ఆశ్రమములందు లభించు ఆధ్యాత్మికాహార మునే తిరిగితిరిగి వాంఛింతురుగాని, క్షుద్ర విషయములపై దృష్టిని పోనీయరు.** ఒక్కొక్కసారి తేనెటీగలు నా తలచుట్టును తిరుగుచున్నపుడు, అందుగల సహస్రదళ పద్మము నందలి మధువును గ్రోల వాంఛించుచున్నవా యని తలంచుచుందును. ఆ పద్మము ప్రతివారి శిరసున వికసించియుండును. దాని కొరకు ఎచ్చటనో వెదుక వలసిన పనిలేదు. మనము పాదాంగుష్టమునుండి ఉపరితలము వరకు అనగా శిరోపరిభాగము వరకు ప్రయాణించగలిగినచో అచ్చట సహస్రదళ పద్మమునందలి సువాసనా భరితమైన మధువు లభించును. పరమేశ్వరుడు దాతలకు దాత. సర్వ సంపదలకు నిలయుడైన ఆ శ్రీపతిని ఆశ్రయించిన వారికి ఎట్టి లోటును కలుగ నీయడు. మానవులు చేయవలసినది మాత్రము అర్హతగా నుండుటయే. ఆ దయా మయుడు సర్వజ్ఞుడు కదా ! అంతయు భగవన్మహిమ.

ఓం ఓం ఓం

## 37. అహంకార ఫలితము

'అహం' అనునది మనుజుల మనస్సులలో దాగియుండును. వేసవిలో భూమి మీద పడిన విత్తనము, వర్షము కురియగనే మొలకెత్తునట్లు అహంకారము కూడ లోన దాగియుండి మానవుని ప్రవృత్తిని బట్టి కొన్ని పరిస్థితులలో ఎదుటివారి మీద దాడి చేయునంతటిదిగా మహోద్ధృతముగా పైకి లేచును. ఇది "తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా అని వేమనయోగి చెప్పినట్లు, విచక్షణారహితమై తన గోతిని తానే త్రవ్వుకొనుట.

ఇక నిరహంకార స్వభావులు, వినయసంపన్నశీలురై తమకు హానిచేయ తలపెట్టిన వారిని గూడ ప్రేమతో ఆలింగనము చేసికొను సాధుస్వభావులుగా నుందురు.

ఇప్పుడు చెప్పబోవుచున్న దృష్టాంతము ఆయా స్వభావముల యొక్క శక్తిని తెలియబరుచుచున్నది.

ఒక ఊరిలో ఇద్దరు స్త్రీ సంగీత పాఠకులు గలరు. అందు ఒకామె అహంకారము గలది. రెండవ ఆమె నిరహంకారి. ఆమె ఒకరోజు పాటకచేరిలో శ్రావ్యముగా పాడుచుండెను. శ్రోతలు ఆనందముగా వినుచుండిరి. ఇంతలో అహంకారి యగు మొదటామె హఠాత్తుగా ఆ సభలో ప్రవేశించి, చప్పట్లు చరచుచు–చక్కగా సాగుచున్న సభను గందరగోళపరచినది. అది ఆమె సహజ స్వభావము గదా !

కొంతకాలమునకు అహంకారయుతముగా జీవించుచున్న గాయకురాలు ముదుసలియై, ఆదరించువారులేక, తినుటకు తిండియైనను లేక ముష్టి ఎత్తుకొని జీవించుచుండెను.

ఒకరోజున నిరహంకారియైన గాయకురాలు ఆమెను చూచుట తటస్థించి దగ్గరగా వెళ్ళి, "నీ వెవరివమ్మా" అని ప్రశ్నించెను. ఆ ముసలిఆమె యిచ్చిన జవాబును బట్టి వెనుక ఒకప్పుడు సంగీతసభలో తనను అవమానించిన గాయకురాలిగా తెలిసికొని సంతప్త హృదయముతో జరిగినదానిని మరచి, ప్రేమతో ఆమెను తన యింటికి తీసుకువెళ్ళి జీవితాంతము వరకు పోషించెనట. దాని సారాంశము. **అహంకరించెడు స్వభావులకు తాత్కాలిక జయము లభించినను, అంత్యమున మాత్రము ఫలితము ననుభవింపక తప్పదు. అట్లే సాధు స్వభావులు, ఎవరి అవహేళన లను పట్టించుకొనక విలక్షణముగా నుందురుగాన జయము ఎల్లప్పుడు వారి వెంట నంటియే యుండును. అహం, నిరహం అనునవి జీవితములో ఆరోహణా అవరోహణముల వంటివి.** అందరికి శాంతి కలుగుగాక !

ఓం ఓం ఓం

## 38. భగవన్నివాసము

భగవంతుడు ఉన్నాడా ? లేడా యని కొందరి సందేహము. భగవంతుడున్నట్లయితే ఆయన ఎక్కడ ఉన్నాడు ? ఆయనను చూచుట ఎట్లు అని మరికొందరి సందేహము.

కృష్ణభగవానుడు భగవద్గీత ద్వారా చెప్పినది; క్రీస్తు బైబిలు ద్వారా చెప్పినది ఏ మతాచార్యులు చెప్పినను ఒక్కటే.

"భక్తులైనవారు ఎచ్చట పలువురు చేరి నన్ను గూర్చి తలంచుచుందురో, తన్మయత్వముతో నా నామసంకీర్తన చేయుచుందురో అచ్చటనే నుందు"నని భక్త వత్సలుడు హామీ యిచ్చెను.

"నేను స్వర్గములోను లేను, దేవాలయములందును లేను ! యోగులలోను లేను. ఎచ్చట భక్తులు అన్యము మరచి నన్నే భజించుచుందురో అట్టి భక్తుల హృదయములలో నివసించెదను. ఆహా భక్తి హృదయుల భాగ్యమే భాగ్యము. **ఇప్పుడు సత్సంగములో యింతమంది భక్తులు కలసి హరినామసంకీర్తన చేయుచుండుట చూచి, వినియు భగవంతుడు ఇప్పుడిచ్చటనే యున్నాడను తలంపే, ఆ విశ్వాసమే నా హృదయమునకు నూతన శక్తినిచ్చినది.**

ఒకప్పుడు అమెరికాలో కొంతమంది మేధావులు సమావేశమై ఈ దిగువ నుదాహరింపబడిన ప్రశ్నకు సమాధానము పొందదలంచి, ప్రపంచములోని గొప్ప వారందరికి వ్రాసినారట. ఆ ప్రశ్న యిటులున్నది. "మనలో కోరికల వలన కలుగు అశాంతికి, బలహీనతలకు రక్షణ మెయ్యది?"

ఈ ప్రశ్నకు మహాత్మాగాంధీ, మహర్షి రవీంద్రనాథ టాగూరు మొదలగు మహనీయులందరూ జవాబు వ్రాసి పంపించిరి.

ఆ సభ మరల సమావేశమై అనుభవనీయురాలైన ఒక సోదరీమణి వ్రాసిన ఈ క్రింది సమాధానము సర్వోత్తమమైనదిగా తీర్మానించిరి. జవాబు యిట్లున్నది. "ఇప్పుడు ఇచ్చటనే మరియు ఎప్పుడు ఏమి చేయుచున్నప్పటికి భగవదస్థిత్వమును తెలిసికొని అనుభవించుటయే" ఒక వస్తువును తక్కెడలో ఒకవైపునుంచి రెండవ దానిలో రెండో, మూడో వస్తువులుంచినచో తక్కెడ పై భాగము కఱ్ఱ 2,3 వస్తవులున్న వైపునకై మొగ్గునట్లు మనము 2,3 గంటలు మాత్రము భగవంతుని అస్తిత్వము లేదా సన్నిధిని అనుభవించి మిగతా 2,3 గం॥ మానివేసిన యెడల ఆ గంట అనుభూతి మిగతా 2,3 గంటలు మనలను వెంటాడుచుండును. ఏలన ఆయన లేని చోటు – కాలము లేదు గనుక. ఈ రహస్యమును గ్రహించి **భక్తులైన వారు ఆయనను పొందగోరువారు 1 గంట అననేల 24 గంటలు ఆయన ఉనికినే అంతటా అనుభవించుచుతరించెదరు గాక ! యిదే నా సందేశము.**

ఓం ఓం ఓం

# 39. జన్మ దినముల ప్రాముఖ్యత

దైవ భక్తులకు సుస్వాగతము. ఈనాడు అమ్మాజీ జన్మదినము. ఎవరిని ఆహ్వానించక పోయినను ఆమె యందలి ప్రేమతో ఎందరో భక్తులు ఆశ్రమం వచ్చుటానందము. కాని ఆమె మాత్రము ఈ బాహ్య స్మృతులు, అభివందనములకు దూరముగా నుండు స్వభావము కలది గావున, ఈ దినమును ప్రశాంతముగా గడుపనెంచి బెంగళూరు వెళ్ళెను. ఆమె భౌతికముగా చాలా దూరముగా నున్నను, మానసికముగా ఆమె నా చెంతనే నాతోనే యుండి ధ్యానించుచున్నట్లు తలంచి ఆనందించుచుంటిని.

మనము ఎందరియొక్క జన్మదినములనో జరుపుకొనుచుందుము. కాని అసలు జన్మదినము ప్రాముఖ్యతను గమనించుటలేదు. జన్మదినములలో కూడ ముఖ్యము అముఖ్యము అయినవి ఉండును. నూతన వస్త్రాలంకరణములు, రుచికరములగు పిండివంటలు, దీనిని గూర్చి సామాన్య ప్రజలు ఆలోచించుచు, వాటిలోనే ఆనాడు ఆనందించుచుందురు. ఈ మాదిరి వేడుకలు దైవానుభూతినొంద జాలవు. కనుక అముఖ్య మనిపించును. ఇక ముఖ్యమైనది, అమూల్యమగు మనకు లభించిన మానవ జన్మలో మరియొక సంవత్సరము వృథాగా గడిచిపోయినదే యని విచారించువారు ఎవరును కనిపించుట లేదు.

కనీసము జన్మదినము రోజునైనను, పాతవాసనలను, అలవాట్ల నన్నింటిని విడిచి, మరచి మౌనములో నిశ్శబ్దముగా, నిర్జనప్రదేశములో కూర్చుని మనస్సును ఆత్మపరమొనర్చి ధ్యానములో దైవదర్శనము నొందినపుడే, జన్మదినము సార్థక మగును. సఫలమగును. **జన్మదినము రోజునైనను మన లోకశాంతి ప్రార్థనను 108 సార్లు స్మరించి, తరించమని ఆశ్రమవాసులను, ఆలయ భక్తులను కోరు చుందును.** నా ఆశయము ప్రకారము ఆ మార్గములో నడుచుచు జీవించుటయే అమ్మాజీ (జ్ఞానేశ్వరి) ధ్యేయము. **దైవసన్నిధి ననుభవించువారు నాకు అత్యంత ప్రేమాస్పదులు. ఈ సంవత్సర జన్మదినాభివృద్ధియే రాబోయెడి జన్మదినాభివృద్ధికి పునాదిరాయి. ఆధ్యాత్మిక పునాది సుస్థిరమై, లోకశాంతికి మార్గదర్శక మగును.** ఇప్పుడు శాంతి ప్రార్థనతో ఈ సత్సంగమును పూర్తి చేయుదము గాక !

ఓం ఓం ఓం

# 40. దైవ రాజ్యము పసిబిడ్డలదే

**కాలము ఒక అమూల్య ధనము వంటిది. మనము ధనమును ఎంత జాగ్రత్తగా కాపాడుకొనగోరుచుందుమో, కాలమును కూడ అంత అమూల్యమైన ధనముగా భావించి దానిలోని ప్రతిక్షణమును సద్వినియోగము చేసుకొనవలెను.**

కాలచక్రమనునది, ఎవరి వృద్ధ్యభివృద్ధులతో కాని, కష్టసుఖములతోగాని, ఎట్టి సంబంధము లేక గిర్రున తిరిగిపోవుచున్నది. ఆ కాలచక్రమును నిబంధించగల శక్తి ఎవరికిని లేదు. అందుచేత నేను మీ అందరిని ప్రస్తుత క్షణమునందే దైవసన్నిధిని అనుభవింపచేయుటకు కోరుచుందును. క్షణము విలువ తెలిసికొని దైవము ననుభ వింపగోరినచో రోజంతయు ఆ దివ్యజ్ఞప్తిలో జీవించగలమని విశ్వసించవలెను. మనయొద్ద ఒక బేట్రీలైటున్నచో అది పది అడుగుల దూరము వరకు దారి చూపును. అచ్చటినుండి మరల వేసినచో మరి కొంత దూరము తీసుకువెళ్ళి మనలను గమ్యము చేర్చును. అట్లే మనలోని జ్ఞానమును ఒకింత బహిర్గతపరచినచో, అది మన అభివృద్ధికే గాక, ఎందరిఅభివృద్ధికో తోడ్పడి జ్ఞానసిద్ధిని బడయగలరు. **మొదట ఆత్మవిశ్వాస మున్న, తరువాత అది దైవ విశ్వాసముగా పరిణమించును.**

ఒక నాస్తికుడు "గోడమీద భగవంతుడు ఎక్కడా లేడు" అని వ్రాయగా అతని చిన్ని కుమారుడు దానిని చదివి, "భగవంతుడు యిక్కడే యున్నాడు" అని అర్థము చేసికొనెనట. మనము కూడ పసిబిడ్డలవలె హృదయవికాసము గలిగిన దైవజ్ఞప్తిని పొందగలము. దానిని పొందుటకు హృదయ మాలిన్య ప్రక్షాళనము చేసి, శుభ్రముగా మార్చుకొని హరినామ స్మరణ మాధుర్యముతో నింపినచో అచట భగవంతుడు ప్రతిష్ఠి తుడు అగును. అచట అంతయు కాంతిమయమే. కనుక ఈ సత్సంగములో పాల్గొన్న వారందరూ ఈ మంచి మాటలను మననము చేసుకొని, మీకు లభించిన కాలమును దైవ సేవలో, ఆ దివ్య జ్ఞప్తిలో గడుపుచు తరించెదరు గాక !

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు.

ఓం ఓం ఓం

# 41. సర్వశక్తి

"సర్వశక్తి పని చేయుచున్నది జీవుని విశ్రమింపనిమ్ము." ఈ సూక్తి ఎంత అద్భుతమైనది ?

శ్లో॥ జ్ఞాతం జ్ఞాతవ్య మధునా
దృష్టం ద్రష్టవ్య మద్భుతం
విశ్రాంతోఽస్మి చిరం శ్రాంతః
చిన్మాత్రా న్నాస్తి కించన

తా. తెలియబడవలసిన బ్రహ్మము తెలియబడెను. చూడవలసిన అద్భుతమును చూచితిని. దానిని గూర్చి మిక్కిలి శ్రమపడితిని. నా శ్రమ ఫలించెను. ఇక విశ్రమించెదను. చిన్మాత్రమైన బ్రహ్మముకంటె నితరమేమియు లేదు. నేనే బ్రహ్మను. ఆహా ! ఏమి ఆశ్చర్యమైన సంగతి ?

ఒక జ్ఞాని చెప్పినట్లు అజ్ఞానము అను నిద్రావస్థ నుండి జ్ఞానావృతమైన జాగ్రదవస్థలోనికి వచ్చినపుడే సత్యవస్తువును తెలిసికొనవలయునను కాంక్ష కలుగును. కాంక్షతో సాధన ప్రారంభమగును. సాధనలో కఠినమార్గములు దృగ్గోచరమగును. కాని నిజమైన కాంక్ష గల సాధకుడు, కఠిన శిలావృత మార్గమునైనను అధిరోహించి తాను సాధించవలయునను కొన్నది సాధించి, తెలియబడవలసిన దానిని తెలిసికొని, చూడవలయునను తీవ్రకాంక్ష గలదానిని దర్శించి తనివితీర విశ్రాంతిని పొందును. అట్టి తీవ్రకాంక్షగల వారెంత ధన్యజీవులు.

సాధకునకు ముఖ్యముగా కావలసినది పట్టుదల. ప్రతివారిలోను రెండు రకముల స్వభావము లుండును. 1. సత్వగుణము 2. తమోగుణము. సత్త్వగుణము సుఖదాయకమైనది. రజస్తమస్సులు అనర్థదాయకములు. డాక్టరు జయకల్‌హైడ్ కథ వినియే ఉందురు. వారిరువురు కాదు– ఒకే వ్యక్తి. మనస్సు నిర్మలముగా, ప్రశాంతముగా నున్నపుడు జయకల్‌గా సత్వగుణప్రధానమైన పరోపకారాది సుగుణములతో నిండియుండును. గాని హఠాత్తుగా మనస్సులో మార్పు వచ్చినపుడు అహంకారయుతమైన అంధకారముచే ఆవరింపబడి ఆ వ్యక్తియే హైడ్‌గా మారిపోయి యితరులకు హాని చేయతలపెట్టెను. ఇతరులను బాధ పెట్టియైనను తాము అనుకున్నది సాధించుకొనగోరువారు హైడ్ వంటి మనస్తత్వము కలవారు. కనుక యిది వినిన జ్ఞాపకముగా **మీ రెల్లప్పుడు కూడా జయకల్ వంటి మృదు స్వభావులుగా నుండి యితరులకు మేలు చేయుటే పరమావధిగా జీవించవలెను. "పరోపకారార్థ మిదం శరీరమ్" ఇది గుర్తుంచుకొనుమనియే నేటి నా సందేశము.**

ఓం ఓం ఓం.

# 42. పని క్షయకారి కాదు

పని క్షయకారి కాదు. వ్యాకులత క్షయకారి అను వాక్యము తరచు స్మరించు చుండుట నా అలవాటు. మనము చేసిన చేయుచున్న మంచి పనులు ఒక రూపమును దాల్చి ఇతరుల నాకర్షించును. వ్యాకులత - అనగా మనస్సు వికలము గానున్నచో తాను అశాంతితో బాధపడుటే గాక తన వలన ఇతరులు అశాంతితో బాధపడుట జరుగుచుండును. నీలోనుండి వచ్చెడి ప్రతి మాటయు మీ హృదయములలో చొచ్చు కొని నేను పొందిన అనుభూతినే మీరందరూ పొందవలయునని కోరుచుందును. ఈ నా సందేశమును ఎవరైనను వ్రాయుట చూచినపుడు - అందరి శ్రేయమును కోరు అనుభూతులు ద్విగుణీకృతమై మాటలుగా మారుచుండును.

**చాలమంది నేను ఏమియు మహత్తులు చేయనని అభిప్రాయపడుచుందురు. అట్టి మహత్తులు, సిద్ధులు మానవుల ఆత్మోన్నతికి తోడ్పడుటకు బదులు, అధః పాతమునకు దారి చూపును. అయితే ఒక విషయం మాత్రము నేను గ్రహించగలను. అది ఏమన - నేను చూచిన స్త్రీలు గాని పురుషులుగాని వారు నివృత్తిపరులా? ప్రవృత్తి పరులా ? స్వార్థులా ? స్వార్థరహితులా? అను సత్యమును ముఖములో స్పష్టముగా గాంచుట జరుగును.** స్వార్థము అసూయలు మరణహేతువైనవి. ఒక శ్రీమంతుడు తాను నిర్మించుకొన్న భవనములోని గదిలో అన్ని గోడలను అద్దములచే స్థాపించి ప్రతిరోజును తన రూపమును అతడు అన్ని వైపుల నుండి చూచుకొని తృప్తి చెందు చుండెడివాడట.

ఒకరోజున ఒక కుక్క ఆ గదిలో ప్రవేశించి అన్నివైపులా తనవంటి కుక్కల రూపమునే చూచి అసూయతో మొరిగి మొరిగి చివరకు అలసిపోయి మరణించెనట.

అట్లే మానవుడు కూడ అసూయాగ్రస్తుడైనచో అట్టి గతి, స్థితియే సంభవించును. మానవ జీవిత గమ్యము అసూయగాదు. **స్వచ్ఛందమైన ప్రేమయుతముగా నుండుటే ఆ ప్రేమ ప్రవాహముచే తోటి మానవులను ఆనందంలో ముంచ ప్రయత్నించుటే మానవజన్మకు మహాలక్ష్యము, గాన మీరందరూ ప్రేమ హృదయులై, తోటివారిలో భగవంతుని గాంచి ప్రేమింతురు గాక !**

ఓం ఓం ఓం

# 43. నివృత్తి

నివృత్తి మార్గము బహు శ్రేయోదాయకమైనది. ఆ మార్గములో భగవంతుని కనుగొనుట చాల సుఖము. ప్రవృత్తి మార్గావలంబకులకు భగవత్సన్నిధానము చేరు నర్హత లభింపదు. నేడు శ్రీ దేవానందస్వామి తలవని తలంపుగా మాతృమూర్తి యగు ఒక సాధువమ్మగారితో ఆశ్రమం వచ్చుట చాలా ఆనందము. ఈ సంవత్సరము జన్మదినమునకు వారు వేదికమీద లేకపోవుట చాలా లోటుగా కనిపించెను. వారు హరినామ సంకీర్తన చేయుచున్నపుడు, భక్తులు తను, మను, శరీరములను మరచి ఆనందములో మునిగి సంకీర్తన చేయుట చూచి నా కెంతయో తన్మయత్వముగా నుండును. భగవంతుడు వారికి ఆ శక్తిని ప్రసాదించెను. **ఎవరు ఎప్పుడు ఆశ్రమం రావలయునో అంతయు భగవన్నిర్ణయము** యిపుడు శ్రీ దేవానంద భక్తి నామ సంకీర్తన చేసి, వారి అమూల్యసందేశము నొసంగెదరు. సుబోధకమగు వారి వాక్యములు విని యిచ్చటనే మరిచిపోవుట గాక మీ హృదయములలో జీర్ణింప చేసుకొని వృద్ధి చెంద ప్రయత్నించవలెను.

తగిన మూల్యమును చెల్లించినపుడే – మనము కోరిన వస్తువును పొందగల్గి నట్లు, భక్తి యను మూల్యమును చెల్లించినపుడే భగవంతుడు ప్రత్యక్షమగును. ఆయన భక్త హృదయనివాసి, భక్త సులభుడు. నిజమైన పరితపన తోచినచో వెంటనే పలుకుటకు సిద్ధముగా నుండవలెను. లోకశాంతి ప్రార్థన శరీరమునందు ప్రత్యణువు నందును ఆ దైవశక్తిని నింపుకొని ఆ దివ్య జ్ఞప్తితో స్మరించినచో ఆయన దివ్యతేజ స్సును సులభముగా దర్శించగలము. కేవలము పెదవులు కదిపి ప్రార్థన పఠించినంత మాత్రాన భగవంతుని సన్నిధిని పొందుట అసాధ్యము. మనస్సు కరిగి ఆత్మతో (అమనస్కము) లీనమైనపుడే ఆ దివ్యజ్యోతిని దర్శింపగల శక్తి మనకు సాధ్యమగును. భక్తికి భగవద్దర్శనమునకు నివృత్తిగా నుండుటే మూల సాధనము.

ఓం ఓం ఓం

# 44. ఆశ్రమము అనెడి వల

తోటపల్లి ఆశ్రమము స్థాపించి సుమారు 40 సంవత్సరములు కావచ్చెను. ఈ గడిచిన 40 సం॥లో ఆశ్రమం అనెడి వలలో చిక్కియున్నట్లే నేను భావించెదను. ఇటీవల కొన్ని సంవత్సరములు వాల్తేరులో నుండి, అచటి సముద్రపు ఒడ్డున, మరియొక క్రొత్త వల ఏర్పరచుట జరిగెను. తోటపల్లి యైనను, వాల్తేరు అయినను, మరియెచ్చటైనను, ఆశ్రమములలో జీవితము (వలలో చిక్కిన చేపవలె) వలలో చిక్కి జీవించుట వంటిదే.

సాలీడు తన నుండియే ద్రవ పదార్థమును బయటకు తీయుచు తనగూడును తానే నిర్మించుకొనుచుండును. అటులనే అంతరవృత్తులనుబట్టి సాధువులు, యోగులు ఆశ్రమములను నిర్మించుచు, కొందరు ఆ వలలో చిక్కి బాధలు పడుచుందురు. అచ్చటచ్చట కొందరు పుణ్యపురుషులు వారు నిర్మించుకొనిన వలల నుండి బయట పడుటయు జరుగుచున్నది. వాల్తేరు ఆశ్రమము అనెడి వలనుండి తప్పించుకొని వచ్చి మరల తోటపల్లి ఆశ్రమ పెద్ద వలలో పడితిని. ఈ వల చాల విశాలమైనదైనందున మంచి ప్రశాంతముగను, నిశ్శబ్ద వాతావరణము వలన ఆనందముగా నున్నను, దీని నుండి కూడ బయటపడుటకే నా మనస్సు కోరుచున్నది. ఈ స్థలమును విడిచి, కొండవారనున్న స్థలము షిర్డీలో ఏకాంతముగా కొదువ జీవితమును గడుపుటకు ఈ మనస్సు కోరుచుండుట నాకే ఆశ్చర్యముగా నుండెను. ఏ వలలు, బంధనములు, **ఏ గూడులు లేని ఏ చింతనలు లేని, “పరిపూర్ణత్వమును”, అనగా వివిధ నామరూపములతో నున్న శరీర ప్రపంచమును మరచి జీవించుటే నిజమైన జీవితము. స్థలభ్రాంతి, శరీరభ్రాంతి అనువాటికి అతీతమైన స్థితిలో అంతయు తేజోమయ శాంతియే. అది అచల పరిపూర్ణస్థితి.**

భగవన్మహిమ – మహిమ – మహిమ

ఓం ఓం ఓం

---

మానవు డొక పూస. అట్టి పూసలు అసంఖ్యాకములు.

ఆత్మ వానిని కలుపు సూత్రము. (దారము)

మన దృష్టిని ఆ సూత్రము నందే నిలుపవలయును.

# 45. సత్య స్వరూపము

**సత్యస్వరూపియగు భగవంతుని సన్నిధిని అనుభవించుటకు మీ అందరకు స్వాగతము. సత్యము అతి సున్నితమైనది. అతి నిరాడంబరమైనది. కాని ఎంత సున్నితమైనదో అంత దృఢమైనది అంత తీక్షణమైనది. దాని నెరుంగుట దుర్లభము.** అయినను శ్రీ స్వామి రామతీర్థులు చెప్పినట్లు.

"సత్యమును లోతుగా భూమిలో పాతిపెట్టినను, ఏదో విధముగా అది బయటకు వచ్చియే తీరును. సత్యమును ఎవరును బలపరచుటలేదేయని విచారింప పనిలేదు. కోటికాంతులతో తనను తాను రక్షించుకొనగల అమోఘమైన శక్తి సత్యమునకు గలదు" అని వచించిరి.

సత్యమే అంతశ్శక్తివంతమైనదైనపుడు ఇక సత్యస్వరూపియగు భగవంతుని శక్తిని మనము గుర్తింపగలమా ? ప్రతి అణువునందు ఇమిడియున్న సత్య దైవశక్తిని మాయావిష్కృతులగు మూఢులు దర్శింపలేక, లెక్కకు మించిన కోరికలను పెంచు కొనుచు, సముద్రమునందలి తరంగముల వలెను, అగ్నియందు ఆజ్యము పోసినచో అది పైపైకెగయునట్లును, కోరికలు తీరిన కొలది మరల అభివృద్ధి గాంచుచునే యుండును. వాటితోపాటు, దుఃఖములు బాధలు అభివృద్ధి చెందుచుండును. దుఃఖాన్వితముగాని సుఖమెచ్చటను లేదు. నిజమగు ఆనందము, సుఖశాంతులు కోరికలు లేనివారికే లభించును. అజ్ఞాని ఈ సత్యమును తెలిసికొనలేక ఆత్మలనెడు తాటిచే బంధింపబడి బాధపడుచుండును. **జ్ఞానియైన వాడు నిత్యానిత్యములను గుర్తించి సత్యస్వరూపియగు భగవంతుని దర్శించి వివేక విజ్ఞానములతో చిన్మయా నందుడుగా భాసించును.** ఉన్నదొక్కటే సద్వస్తువు. పొందునదేది పొందువారెవరు. ఆ దివ్యస్థితి ననుభవించుటే జీవన్ముక్తి.

ఓం ఓం ఓం

---

పరబ్రహ్మము సముద్రము వంటిది.
వాక్కున కతీతము.
మౌనమునందు మాత్రమే అనుభవైకవేద్యము.

# 46. ఆచరణ ముఖ్యము

**భక్తులకు జ్ఞానగృహముగా స్థాపితమైన శాంతి ఆశ్రమమునకు వచ్చువారు వారి బాహ్యచిత్తవృత్తులను బయటనే విడిచి గేటుదాటి లోపల అడుగు పెట్టగానే స్త్రీ పురుషులెవరైనను సరే ప్రతిఅడుగునను దైవనామస్మరణ చేయుచు ఆశ్రమ సందర్శనము చేసి వారి హృదయములను శాంతితో నింపుకొని వెళ్ళవలెనని కోరుచుందును. ఈ పవిత్ర వాతావరణములో నున్నంత కాలమైనను, దైవమును గురించి ఆలోచించలేనివారు, అట్టి జిజ్ఞాస లేనివారు, బయటకు వెళ్లిన వెంటనే దైవమును మరచినచో ఆశ్రమ సందర్శనము వృధా శ్రమ యగును.**

ఎన్నియో గ్రంధపఠనములు, పురాణములు వినుట చాలా సులభమే. కాని వాటి సారమును గ్రహించి ఆచరించుట చాలా కష్టము.

ఒక దేవాలయములో ఒక పండితుడు పురాణము చెప్పుచుండగా–భక్తులనేక మంది అచ్చట చేరి ఆసక్తిగా ఆలకించుచుండిరి. అచటి స్త్రీలలో పురాణ పండితుని భార్య కూడ యుండెను. పురాణము చెప్పుట ముగిసిన తరువాత అందరును వారి గృహములు చేరినట్లే పండితుడు కూడ యింటికి వచ్చి పాదప్రక్షాళనము చేసి భోజనము చేయ మొదలిడెను. ఆనాటి భోజనములో కూర రుచించనందున భార్యను తీవ్ర స్వరముతో “యిది కూరయేనా ? ఇందులో ఉప్పు కారము ఏమియు లేనిదే తినుట యెట్లు” అని ప్రశ్నించగా ఆమె చిరునవ్వుతో మీరు పురాణము వినువారందరికి సాత్వికాహార విలువలను గురించి ఎంతగానో చెప్పితిరి కదా యని నేను యిట్లు కూర వండితినని సమాధానము చెప్పెను.

అప్పుడు పండితుడు – ఓసి వెర్రిదానా ! నేను పురాణములో చెప్పినది నాకు వర్తించదు. అనెనట.

అందుచే **మనము ఇతరులకు బోధించుటకు ముందు మనము ఆచరణ చేసి ఆ అనుభవముతో బోధించిన బోధ సఫలమగును. అట్టివారే స్వధర్మాచరణ పరాయణులుగా పరిగణింపబడుదురు.**

ఓం ఓం ఓం

# 47. పవిత్ర నీడ

**పవిత్రత అనునది ఒక మహావరము వంటిది. అది అయాచితముగా లభించిన వారు, ఏ పనియు చేయనవసరములేదు. వారు చదువ వలసినదిగాని, వినవలసినది గాని ఏమియు నుండవు. వారు దైవాంశ సంభూతులు. అట్టివారు ఏ బోధలు చేయనవసరములేదు. వారి ఉనికియే కదలికయే పరిసర వాతావరణమునకు మహత్తరమైన మేలు చేయును.**

ఇప్పుడు హోలీషాడో పవిత్రనీడ, అనెడి విజ్ఞానదాయకమైన కథ జ్ఞప్తికి వచ్చు చున్నది. ఒక తావున ఒక మహనీయుడు నివసించుచుండెను. అతడు కడు నిరాడంబర జీవి. ఇతరులకు చిరునవ్వుతో ఉపకారము చేయుటే ఆయన స్వభావము. ఒకప్పుడు దేవతలకు ఆ మహనీయుని యందు అత్యంత ప్రీతి కలిగి, అతని వద్దకు వచ్చి "కావలసిన వరము లిచ్చెదము కోరుకొమ్మని" చెప్పిరి. కాని అతడేమియు కోర లేదు.

అతనికెట్లు మేలు చేయుటయో వారి కేమియు తోచక, వారిలో వారు ఆలో చించి అతని నీడ ప్రసరించినంత మేరవరకు సర్వము శుభప్రదమగునట్లు వరమిచ్చి వెళ్ళిరి. అది మొదలు అతడు ఎచ్చటకు వెళ్ళినను, ఆ ప్రదేశమంతయు ఆహ్లాదకరము, ఆనందమయముగా నగుచుండెను. రోగులు ఆతని నీడలో నిలచి రోగముల నుండి విముక్తులగుచుండిరి. కడకు అతని నీడ పడినచోట ఎండిపోవుచున్న పచ్చగడ్డి సహితము కలకలలాడుచు వర్ధిల్లుచుండెను. అతడెంత ధన్యజీవి ?

**నా భావము మీకు అతిశయోక్తిగా కనిపించవచ్చును గాని నేను నివసించు చోటున అందరూ శాంతిగా సుఖప్రదముగా నుండవలయునని అనుకొనుచుందును.** శ్రీ వివేకానందలు ఇట్లు చెప్పిరి.

**"ఉన్నతమైన ఆశయము కలవాడు వందసార్లు అపజయమును పొందవచ్చును గాని తరువాతనైనను అతడు నిశ్చయముగా ఆశయసిద్ధిని బడయును. అసలు ఆశయమే లేనివాడు ఎన్నటికిని అభివృద్ధి పొందనేలేదు." అందుచే ప్రతివారు ఏదో ఒక ఆశయము కలిగి అభివృద్ధి చెందెదరు గాక !** ఇది నేటి సందేశము.

ఓం ఓం ఓం

# 48. ప్రార్ధనా మహాత్మ్యము

ఈ రోజులలో తరచు మహాత్మాగాంధీగారు చెప్పెడి వాక్యములు జ్ఞాపకము వచ్చుచుండును.

“నేను భోజనము లేకపోయినను జీవించగలను గాని; ప్రార్థన లేనిచో జీవింప జాలను.” బుద్ధిమంతులకు ఒక్కమాట చాలును. ఆయనకు భగవంతుని యందు ప్రార్థనలయందు ఎంత విశ్వాసముండెడిదో గ్రాహ్యమగుచున్నది.

తమ రాజకీయ జీవితములో తటస్థించెడి ఎన్నియో కష్టనష్టములకు, భగవద్గీత తెరచి ఒక్కొక్క శ్లోకములోని అర్ధమును గ్రహించి తమ సమస్యలకు పరిష్కారమును దానితో అన్వయము చేసుకొని తాము తలపెట్టిన పనిని జయప్రదముగా నెరవేర్చి అహింసామార్గముననే చిట్టచివరకు భారతదేశమును స్వతంత్ర రాజ్యముగా చేయగల్గిన మహనీయుడుగాన నేటికిని ఆయనను మహాత్మునిగా దేశవిదేశ ప్రజలచే మన్ననల నందుకొనుచుండిరి. ఆయన అమరజీవి. ప్రార్థన మహాత్మ్యమును గ్రహించి ఆచరించువారు సాధింపజాలని దేమియు లేదను సత్యమును నిరూపించగల్గిన జ్ఞాని.

నా విశ్వాసమే నాకు రక్ష; అట్లే ఎవరి విశ్వాసము వారిని రక్షించును. “ధర్మో రక్షతి రక్షితః” ధర్మ మార్గావలంబనాపరులకు ఎవరూ ఎట్టి హానియు చేయజాలరు. మనలో నుండి ధర్మయుతమైన భావములే బయటకు రావలయును. నోటితో ధర్మము అన్నంతమాత్రమున అది మనలను రక్షింపజాలదు. ధర్మమును మనము అనుసరించినచో అది మనలను సదా వెన్నంటి కాపాడుచుండును.

శ్రీ స్వామి రామతీర్థులు చెప్పినట్లు – **“దైవమును గురించి ఆలోచించినచో నీవు దైవముగా మారుదువు; మట్టిని గురించి ఆలోచించిన మట్టిగానే యుందువు” కనుక మన ఆలోచనలు సదా దైవము వైపు మళ్ళింతుము గాక !**

ఓం ఓం ఓం

---

సమస్త కర్మలకు కారకుడు, అధ్యక్షుడు ఆ భగవంతుడే.
ఆయన యందే సర్వమును అర్పణ చేయవలయును.

# 49. నా సూది ఎక్కడున్నది ?

మన మేదైనను వస్తువును వెదుక ప్రయత్నించునపుడు, అసలు ఆ వస్తువు పెట్టిన చోటును మరచి అంతటా వెదుకచూచుట కొందరి మానవుల స్వభావము.

ఒక ముసలమ్మ తన సూదిని యింటిలో పారవైచుకొని వీధి దీపము వెలుతురులో దాని కొరకై ఆరాటముతో వెదకుచుండెను గాని సూది అచ్చుటదొరకనందున నిస్పృహ చెందుచుండగా – ఆ దారిని వెళ్ళుచున్న యువకుడొకడు 'ఏమి వెదకుచుంటివమ్మా అని ముసలమ్మను ప్రశ్నింపగా – సూదిని నా యింటిలో పారవైచుకొంటిని అనెను. ఆ యువకుడు అమ్మా ! నీ సూది నీ యింటిలో పారవైచిన చోటున వెదకినచో నీ శ్రమ ఫలించును గాని యిచ్చుట ఎంత వెదకిన ఏమి లాభముండును అని చెప్పగా – ఆ ముసలామె తన తెలివితక్కువతనమునకు విచారించెను.

దీనివలన ప్రతివారు గ్రహించవలసినది **పొందవలసినది మనలో యున్నదని తెలిసికొని, బాహ్యము నుండి అనగా క్రింది స్థితినుండి తమ మనస్సును అధిగమించి పైపైకి అధిరోహింప ప్రయత్నించినచో శ్రమ ఫలించును.**

తాపీ మేస్త్రీ యిటుక తరువాత యిటుకను పేర్చుచు పైపైకి వెళ్ళి అంతస్థులుగా భవన నిర్మాణమును చక్కగా నివాసయోగ్యముగా చేయును. అట్లే **సాధకుడు తన మనస్సు అనెడు యిటుకలను, ప్రేమయనే సిమెంటుతో అతుకుచు అనగా తమ హృదయమును ప్రేమ ప్రపూర్ణముగా చేసి తోటి మానవుల హృదయములను ప్రేమతో ఆకర్షించి ఆధ్యాత్మిక భావనియమను ప్రేమతో ఆకర్షించి ఆధ్యాత్మిక భవన నిర్మాణము చేయు కృషి చేసినపుడు అవి దైవ నిలయములుగా మారును.** ముఖ్యముగా కావలసినది సిమెంటును యిసుకను కలపి ఒకటిగా చేయు నీరువలె సాధకుల హృదయములు స్వచ్ఛముగా నున్నపుడు తాము శాంతి ఆనందములను పొందుటే గాక అవి విశ్వవ్యాప్తమగును. అదియే ముక్తికి మార్గము.

ఓం ఓం ఓం

---

మత మనగా భగవదారాధన.

ఈ సమస్తమైన చరాచర ప్రపంచ మంతయు భగవంతుడే.

జ్ఞానికి (అతడు తన జీవితమంతా ఈ సమస్తమును ప్రేమించుటలో, ఆరాధించులో నిండియుండును కనుక) మతము, జీవితము ఒక్కటే.

# 50. పరిపూర్ణత్వము

నేటి సత్సంగములో భక్తులకు నేనివ్వగల సందేశమేమిటని ప్రశ్న ఉదయించి నది.

**ఓం పూర్ణ మదః పూర్ణమిదం, పూర్ణాత్ మూర్ణముదచ్యతే ।**

**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమే వావశిష్యతే ॥**

నేను పూర్ణత్వముననుభవించుచున్నపుడు పూర్ణుడను – నేనే అపరిపూర్ణుడ నైనపుడు అపరిపూర్ణుడను. ఇక చెప్పుటకు ఏమి మిగిలియున్నది ?

మానవులు మాయా ప్రభావమువలన తమలోనున్న సద్వస్తువును మరచి – అదియున్న చోటును గుర్తించలేక బాహ్యాన్వేషణలో కొట్టుమిట్టాడుచున్నప్పుడు పరిపూర్ణ త్వము నెట్లు అనుభవింపగలరు ? తెలివి లేక విచక్షణాజ్ఞానము గలవారు, ఎల్లప్పుడూ పట్టుదలతో తీవ్రదీక్షతో నూతన విషయములను తెలిసికొన ప్రయత్నింతురు. ముత్య ములను అన్వేషింప కోరిక గలవారు సముద్రములో, ఎంత లోతులోనైనను ధైర్యముతో ప్రయాణించి మంచి ముత్యములను కనుగొనగలరు.

అట్లే **దైవాన్వేషణాపరులు తీవ్ర పరితాపముతోనిండి చంటిబిడ్డ తల్లికై రోదించు నట్లు ఆర్తితో నిరంతర నామస్మరణతో, బాహ్య జగత్తును మరచి, తమ అంతరాంత ములో నున్న అఖండ సచ్చిదానంద సాగరములో ప్రవేశించగలిగినచో అచ్చట దివ్యజ్యోతి దర్శనము లభించి పరిపూర్ణత్వమునందగలరు.** అట్లు కానిచో అది అంత సులభముగా లభించునది కాదు. తీవ్ర పరితాపన అను మూల్యమును పూర్తిగా చెల్లించినపుడే భక్తులు హృదయపవిత్రతను బట్టి మాత్రమే తెరచాటునుండి బయటికి వచ్చి కనిపించు నాటకసూత్రధారివలె పరిపూర్ణుడైన భగవంతుడును, నాకు సంపూర్ణ దర్శన మిచ్చును. గాన భక్తులైనవారు అట్టి పరితాపపరులుగా మారవలెను.

ఓం ఓం ఓం

---

ఆత్మయే అమూల్యమగు నిధి.

దాని వలననే సమస్తము కనుగొందుము.

మరియు సమస్తము దానికొరకే కోరబడుచున్నది.

# 51. పరిమితములో అపరిమిత శక్తి

భగవంతుడు ప్రతివారికి మంచి శక్తి నిచ్చెను. దానిని సద్వినియోగము చేసి కొనుచు దైవమును చేర ప్రయత్నించువారు ధన్యులు. వృద్ధిలేని జీవితము వ్యర్థము. మానవజీవితము పరిమితమైనది గాని ఈ శరీరములో అపరిమిత శక్తి దాగియున్నది. ఆ శక్తి సహాయము లేనిదే మనము కదలజాలము. ఈ శరీరము ఒక యంత్రము వంటిది. యంత్రములో ముఖ్యమైన భాగము అనగా దాని కదలికకు మూలమైన వస్తువు విచ్ఛిన్నమైనచో ఆ యంత్రము ఎంత గొప్పదైనను పనిచేయజాలదు. అట్లే ఈ మానవ శరీరములోనున్న మహాశక్తి వారి వారి మేధస్సులను బట్టి మహోత్కృష్ట కార్యములను కొందరిచే చేయించును. కొందరి అర్హత, దైవ జిజ్ఞాసలనుబట్టి, మహా పురుషులుగాను, దేశోపకారవంతులునుగాను, జ్ఞానధనులను గాను చేసి నడిపించు చుండును. కనుక **మానవులముగా జన్మించినందుకు యంత్రమువంటి శరీరమునకు చైతన్య శక్తినిచ్చి జ్ఞానజ్యోతిని వెదజిమ్ముతూ అన్ని శక్తులకు మూలశక్తిని అనగా ఈ మాంస చక్షువులకు అగోచరమైన మాటలకు అతీతమైన మహాశక్తి ఉనికి గమనించు కొని పరిమితమైన దేహభ్రాంతిని విడిచి అపరిమితమైన శాశ్వత శక్తిని గుర్తించి తరింప ప్రయత్నించవలెను.**

నా స్వానుభవములను మీతో పంచుకొనుటకు కారణము, అందరిలోనున్నది ఒకే ఒక అపరిమిత మహాశక్తి. తమను తాము (నే నెవరిని?) తెలుసుకొనుటకు ప్రయత్నించుటే తడవుగా మీలో ఒక నూతనోత్సాహముతో కదలిక ప్రారంభమై, అది విశాలమై, అపరిమిత వ్యాప్తమగును. ఇది వేదాంత రహస్యము. దీనిని ఛేదించి బట్టబయలు చేసినపుడు, ప్రతివారిలోని శక్తి బహిర్గతమగును. విన్న విషయములు ఆచరణలో పెట్టి తరించమని కోరుటే నేటి సందేశ సారాంశము.

ఓం ఓం ఓం

---

బంధమోక్షములు మనః కల్పితములు
మంచి చెడ్డలు, దేహజగత్తులు అన్నీ ఊహాజనితములే.
ఇటువంటి ద్వంద్వములలో విహరించుట మనోలక్షణము.

# 52. భగవద్విశ్వాసము

భగవంతుని యందు నమ్మిక, విశ్వాసము కలవారి హృదయములో హానికరమైన చెడు ఆలోచనలు తలెత్తవు. మొదట తన ఆత్మ విశ్వాసము నలవరచుకొన ప్రయత్నించినచో అపుడు దైవ విశ్వాసమునకు అదియే మార్గమగును. సాధనలో అపజయము, అడ్డంకులు ఎన్ని ఎదురైనను వాటిని లక్ష్యపెట్టక విలక్షణముగా నుండి ఆత్మవిశ్వాసము ధైర్యములతో ముందుకు వెళ్ళ ప్రయత్నించినచో, ఆధ్యాత్మిక మార్గము సులభముగా ఏర్పడును. తన మార్గమును తాను అన్వేషించుకొని గమ్యమును చేరువారు భగవంతుని కృపకు పాత్రులగుదురు. నేడు తణుకు నుండి ఆశ్రమ భక్తులు వచ్చి సత్సంగములో పాల్గొన్నందుకు ఆనందము.

ఈ ఆశ్రమము భక్తులకు జ్ఞాన గృహము వంటిది. స్వామి మార్కండేయ, "ఎవరి సిఫారసు లేకుండా ఎవరు ఎప్పుడు వచ్చినను సర్వదా ఆదర ముతో ఆశ్రయమిచ్చుచున్నది ఈ శాంతి ఆశ్రమమొక్కటే" అనిరి. ఆయన మాట ఎల్లప్పుడు నిత్య సత్యమగు గాక !

**విద్యార్థులకు కళాశాలలు, రోగులకు వైద్యశాలలు, ఎంత అవసరమో, భక్తులు, దైవపిపాసనాపరులకు శాంతిఆశ్రమము అనేది భక్తుల జ్ఞానగృహముగా ఎల్లప్పుడు స్వాగతము చెప్పుచున్నది. గృహస్థులు వారి వారి పరిధిలోనే అనగా బావిలోని కప్పలవలె నివసించక, వారి హృదయములను విశాలమొనర్చి విశ్వప్రేమతో నిండి అందరి క్షేమమును కోరుటలోనే వారికి మోక్షమున్నది. శాంతి కాముకులు దీనిని శాంతి కేంద్రముగా ఉపయోగించుకొని, గట్టి దీక్షతో దైవాన్వేషణతో కొంత సాధనతో తృప్తి చెందక, అంతరాంతరమునందు నివసించుచున్న భగవంతుని పొంద కృషి చేసినపుడే మానవ జన్మ సార్ధకమగును.** ఇది నేటి సందేశము.

ఓం ఓం ఓం

---

భగవంతుని మరచుట అసాధ్యము
ఏలననగా మన ఉనికే ఆయన యందు,
ఆయన యందే మన ఉనికి.

# 53. కార్తీక పౌర్ణమి

నేడు చల్లని వెన్నెల కాంతితో నిండిన పౌర్ణమి దినము. నేడు చంద్రుడు సంపూర్ణ బింబముగా మన నేత్రములకు ఆనందము నిచ్చుచుండును. అట్లే **ప్రతివారు తమ హృదయములను ప్రేమయను వెన్నెలతో నింపుకొనుచు తమ తోటివారిని సదా చల్లని ప్రేమాదరములతో ఆనందింప చేయవలయును.** ఈనాటి సత్సంగములో శ్రీ బెన్నయ్య దొరగారు, ఆశ్రమ డాక్టరుగారు వచ్చి పాల్గొనుటానందము. ప్రేమ రెండు విధములు. 1. స్వంత తల్లిప్రేమ 2. సవతి తల్లి ప్రేమ. **ఆశ్రమవాసులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు ఆశ్రమమును, తమ స్వంత తల్లిగా ప్రేమించి, దీని కష్ట, నష్టములు తమవిగా భావించి స్వార్థరహితముగా దీని వృద్ధికి తోడ్పడినచో అది వారి జీవితాభివృద్ధికి దోహదమగును. అట్లుగాక ఆశ్రమమును సవతి తల్లిప్రేమవలె-కపటముగా ప్రేమచూపువారు తమకు తామే హాని చేసికొనినవారగుదురు.** వంట శాలలో వంట చేయువారు, పవిత్ర హృదయము, కపటరహిత ప్రేమతో ఇచ్చట చేయు పవిత్ర సేవ భగవంతుడు తమ కిచ్చిన భాగ్యముగా భావించి వంట చేసినచో, అట్టివారిచేతి భోజనము చేసినవారు శాంతిని, ఆధ్యాత్మికాభివృద్ధిని చెందగలరు. అందుచేతనే వంటశాలలో నుండి నిరంతర హరినామ సంకీర్తనతో వంటగాని మరే ఇతర సేవగాని చేసినచో ఆశ్రమ సందర్శకులుగా, ఆశ్రమమునకు వచ్చువారు యెంతయో ఆనందించుటే గాక వారి ప్రేమను వంటశాలవారు పొందుటకు అవకాశ మున్నది. కాని వారి వారి పూర్వ సంస్కారముల ననుసరించి ఎప్పుడూ ప్రాపంచిక విషయములనే మాట్లాడుకొనుచు వంట చేయుదురని విని మనస్సు చాలా ఆవేదన నొందుచుండును. ఇక ముందైనను అందునా స్త్రీలు ఎట్టి కలహాలకు తావీయక నిర్మల హృదయములతో ఐకమత్యముగా నుండి ఆనందముతో, హరినామ సంకీర్తన చేయుచు వంట చేయవలయునని మరల మరల కోరుచుంటిని. తమ సుఖశాంతులు ఆశ్రమాభివృద్ధితోనే యున్నవని గ్రహించి సేవ చేయువారు ధన్యులు. ఇప్పుడొక చిన్న కథను ఉదాహరణముగా వినుడు.

ఒక పిల్లవానిని యిద్దరు స్త్రీలు ఎవరికి వారే వాడు నా స్వంత బిడ్డయని తగవులాడుకొనుచు చివరకు రాజుగారి వద్దకు వెళ్ళగా, ఆ రాజు వారి నుద్దేశించి “ఆ పిల్లవానిని చెరిసగముగకోసి పంచుకొనుడ”ని తీర్పు చెప్పగా అప్పుడు ఆ పిల్లవాని కన్నతల్లి తన బిడ్డ క్షేమమును కోరుచు ఆ పిల్లవానిని సవతి తల్లికే యిచ్చివేయమని కోరెనట. అప్పుడా రాజు సత్యమును గ్రహించగలిగెను. అదే విధముగా ఈ ఆశ్రమ మును సవతి తల్లిగా భావించి తమ ఆపదలను తామే కోరి తెచ్చికొన ప్రయత్నించు వారు మూఢులు కాదా ! దీనిని స్వంత తల్లిగా ప్రేమించి దీని అభివృద్ధికి యెట్లు సహకరించగలమా? యని ఆలోచించువారు తమ సుఖ జీవనములకు తామే మంచి బాట వేసుకొందురు.

అట్లే, ఈ ఆశ్రమ గురుకుల బాలబాలికలు గూడ చాల ఆదర్శవంతముగా యిప్పటి నుండి నీతివంతమైన బోధలు నేర్చుకొనుచు ప్రేమతో జీవించునట్లు పెద్దవారు సంస్కరింపవలయును. కొంతమంది పిల్లలు మంచి వారున్ననూ, కొంత మంది మంచి సంస్కారులు గానందున అబద్ధములు, దొంగతనములు చేయుచుందురు. దాని వలన మొత్తం గురుకులమునకే చెడ్డ పేరు వచ్చును. పెద్దవారు గాని పిల్లలుగాని సంస్కారవిహీనులు ఆశ్రమములో నివసింప నర్హులు గారు. **ఇది నా రక్తమాంసములను యింకించుకొని దైవ సహాయమున నిర్మించిన ఆశ్రమముగాన ఆశ్రమ వృద్ధియే నా వృద్ధియని తలంచుచు యింతగా చెప్పుట జరుగుచున్నది. భగవంతుడు మీ అందరినీ ఆదర్శవంతమైన ఆశ్రమనివాసులుగా నుండునట్లు ఆశీర్వదించుగాక.**

ఓం ఓం ఓం

## 54. వాసనాత్రయము

వాసనయనగా, సువాసన–చెడువాసన–అను అల్పనావాసనావాక్యము గాదు. ఇప్పుడు మూడు రకములైన విషయములు చెప్పుచుంటిని.

1. విజ్ఞానము 2. వాసనాక్షయము 3. మనోనాశనము.

1. అనుభవపూర్వకముగా లభించిన జ్ఞానము – విజ్ఞాన మనబడును.

2. వాసనాక్షయ మనగా – మనలో ఏనాటి నుండియో పాతుకుని పోయిన చెడు అలవాట్లు – వానిని జ్ఞానమనెడు వాడియైన ఖడ్గముచే మొదలంట ఛేదించ వలయును.

3. మనో నాశమనగా అతి చంచలమైన ఈ మనస్సును లేకుండా చేసుకొని, అనగా అమనస్కముగా నుండి ఆత్మభావనతో విలీనము కావలయును. ఈ మూడింటిని ఆచరణలో పెట్టుట చాలా కష్టమేగాని సాధనాపరులకు దృఢమనస్కులకు యివి సులభమైనవే. మరుపు అనెడు భ్రమలోపడి మోసపోవలదు. మరుపే చావు. మనలో ప్రత్యణువునందు నిండియున్న దైవమును మరచుటెట్లు ? మాయ యను మరపుతెరచాటు నుండి బయటకు వచ్చి మీలో నిరంతరాయముగా వెలుగుచున్న దైవ తేజస్సును గాంచి తరించుడు.

శ్రీస్వామి రామదాసుగారి మహాసమాధి దినము జ్ఞాపకముగా ఇప్పుడు అందరు దైవజ్ఞప్తిలో నిండి వారికి ప్రీతికరమైన శ్రీరాం జయరాం జయజయ రామ ఓం మహా మంత్రమును పలుసార్లు స్మరించెదరు గాక; యిది నేటి సందేశము.

ఓం ఓం ఓం

# 55. ఉగాది సందేశము

ఈ నూతన సంవత్సరారంభదినమున సమావేశమైన భక్తులందరికి దైవ సన్నిధికి సుస్వాగతమని చెప్పుటకు ఆనందించుచుంటిని. ఈ పర్వదినమున చాలమంది భక్తులు, దేవాలయములకు వెళ్ళియో, యిట్టి ఆధ్యాత్మిక సభలలోనో పాల్గొనుచుందురు. అదే వారి అదృష్టము. ఎవరు దైవగానము వినగోరుచుందురో, దైవస్మరణ చేయగోరు చుందురో వారి జీవితములు ధన్యమైనవి.

'ఇప్పుడు అంతా కృష్ణమయం' అను పాట అతి మధురముగా పాడియుండిరి. అది పాడువారు – వినువారు – దాని ప్రతిపదము యొక అర్థమును హృదయస్థము చేసికొనుచున్నపుడే – ఆ పాట మాధుర్యము ననుభవించగలరు. అంతా కృష్ణమయం అని చిన్నమాటలలో చెప్పబడినదే "ఈశావాస్య మిదం సర్వం" అని ఈశోపనిషత్తులో ప్రప్రథమమున చెప్పబడినది. ఆయా ఉపనిషత్తులు చదువుటకు తగిన సమయము – శక్తిలేనివారు ఈ చిన్న పాటను మనసారా సుఖముగా పాడుకొని ఆనందించ వచ్చును గదా ! అసలు ఈ జగత్తునందు కృష్ణమయం కానిదేమున్నది? మంచి చెడు, కష్ట సుఖములందును దైవాంశము లేనిదేమియు లేదు. ఆ సత్యమును గ్రహించినవారిని ఈ ప్రాపంచిక బాధలు దరిచేరునా ? **మీ మీ దినచర్యలను, మీరు చేయు ప్రతి తలంపు ఆయనదేయనియు, ప్రతి కార్యము ఆయన కొరకే చేయుచుంటిమనెడి భావనయే మీకు అమిత శక్తి నిచ్చును.** ఇప్పుడు శాంతి ప్రార్థనా స్మరణముతో ఈ నూతన సంవత్సర ప్రార్థనా సభను పూర్తి చేయుదము. భగవంతుడు మీ అందరనూ ఆశీర్వదించుగాక !

ఓం ఓం ఓం

---

మానవుడు (జీవాత్మ) తనలోనే ఇమిడియున్న
ఆనందము మరచి,
ఇతర స్థలములందు దానిని వెదుకుచు
దుఃఖించుచున్నాడు.

# 56. గమ్యస్థానము ఒక్కటే

ఏ మతమువారైనను, ఏ వర్ణమువారైనను అందరి గమ్యస్థానము ఒక్కటియే. ఆ గమ్యస్థానమునకు దైవమే అధిపతి. అన్ని మతగ్రంథసారములు–ఆత్మలో నున్న పరమాత్మయొక్కటియే యని చాటుచున్నవి. దైవము ఒక గుడికి గాని, ఆలయమునకు గాని కట్టుబడియుండలేదు. ఆయన సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. ఎచ్చట భేదరహితమైన ప్రేమయున్నదో అచ్చట దైవ ముండును. అట్టి దైవమును మీ హృదయములలోనే దర్శించమని చెప్పుట నావంతు. అది మననము చేసికొని అభివృద్ధి చెందుట మీ వంతు. వృద్ధియే జీవితము వృద్ధిలేకుండుటే పతనము గాన ప్రతిక్షణమును విలువగల దానిగా భావించి దైవజ్ఞతతో గడుపవలెను. మీ వలన సదా యితరులకు మేలు కలుగవలెను.

మనకు తెలియకుండానే కొన్ని జీవులకు హాని కలుగుచుండును. మనకు తెలియకయో లేక తెలివితక్కువతనము చేతనో ఎవరికైనను బాధ కలుగచేయ వచ్చును. తప్పు గ్రహించి తమ తప్పు తాము సరిచేసుకొనుటే తెలివిగల వారి పని. ఎవరి స్వార్థము వారినే క్రిందికి అణగద్రొక్కివేయును. ఇవి వినుటకు కష్టముగానే యుండును. కొన్ని మంచి వాక్యములున్నవి. "Say nothing - Do Nothing" ఏమియు చెప్పకుము. ఏమియు చేయకుము. "నీ వుండియు లేనట్లుండుము."

"జీవించవలయుననియున్నచో – చనిపోయినట్లుండుము."

ఈ పై వాక్యములు ఆత్మోన్నతికి ఎంతయో దోహదపడును. **ఎవరికి చనిపోవల యునని యుండదు. చిరకాలము జీవింపవలయుననియే యుండును. అట్లు జీవించ గోరుచున్నవారికి భగవంతుడే శరణ్యముగా నుండవలెను. అన్యథా శరణం నాస్తి– త్వమేవ శరణం మమ. నీవు తప్ప అన్యమేదియు వలదు. నీవే నా గతి యని నమ్ము వారికి స్వర్గము అరచేతిలోనున్న ఉసిరికాయంత సులభముగా లభించును. గాన మీ గమ్యస్థానమును చేర త్వరపడుడు !**

ఓం ఓం ఓం

---

మానవుడు బ్యాటరీ యంత్రము వంటివాడు
అతనిని చైతన్యునిగా చేయుశక్తి అతనిలోనే ఉన్నది.

# 57. వేదాంత కళాశాల

ఈ రోజు సత్సంగములో శ్రీస్వామి రామానందతీర్థజీ మన మధ్యనున్నందులకు నాకు చాలా సంతృప్తిగా నున్నది. వాస్తవమునకు వారు దూరముగా నున్న సమయములో కూడా వారి మనస్సు ఎల్లప్పుడు మనతోనే యుండును. వారి పవిత్ర నిష్కపట ప్రేమ మనలను ఎన్నడును వీడునది కాదు. కనుక నా దృష్టికి వారిచ్చటలేని సమయమెన్నడును లేదు.

వారు ఎంతయో శ్రమించి శ్రీ స్వామి రామతీర్థవేదాంత కళాశాల నిర్మాణము గావించిరి. అలహాబాదు వంటి దూరప్రాంతముల నుండి కూడా శ్రీ దీక్షిత్‌వంటి దైవజిజ్ఞాసాపరులు వేదాంతకళాశాల విద్యార్థులుగా వచ్చుటానందము. దానిని అనేక విధములుగా అభివృద్ధి చేయవలయునను వారి కాంక్షను భగవంతుడే నెరవేర్చునని నా నమ్మిక.

వేదములు ఏమి ప్రబోధించినవో – ఉపనిషత్తులు ఏ రూపములేని భగవంతుని ఉనికిని ఎట్లు నిరూపించినవో–భగవద్గీతలో శ్రీకృష్ణుని ప్రబోధసార మేదియో అవి అన్నియు వేదాంతకళాశాల విద్యార్థులకు బోధించుటే వారి లక్ష్యము. మంచి కోరికలను భగవంతుడు ఏ రూపములోనైనను నెరవేర్చును భగవంతుడు వారిని, నన్ను ఆ కళాశాల నిర్మాణమునకు పనిముట్లుగా ఉపయోగించి మా జీవితములను సార్థక మొనరించెను. **స్వార్థరహితముగా చేసిన సేవ ఎప్పుడును జయప్రదముగనే యుండును. మనకు కావలసినది దైవవిశ్వాసము.** ఇప్పుడు ఇక శాంతి ప్రార్థనా స్మరణముతో ఈ సత్సంగమును ముగించుదము. భగవంతుడు భక్తులగు మీ అందరిని శాంతిగా చూచుగాక !

ఓం ఓం ఓం

---

అజ్ఞానులు, దుర్మార్గులు క్రూరముగ
హానిచేసిననూ, నలిపి త్రొక్కి వేయబడినను, పరిమళమునిచ్చు
గులాబివలె, ఉపకరింపవలయును.

# 58. హారతి ప్రాముఖ్యత

నాకు ఎవరు నమస్కరించినను, నన్ను ఎవరు స్తుతించినను అవి నా హృదయ నివాసియగు పరమేశ్వరునికి చెందుచున్నవను భావన నాకెంతయో ఉత్తేజము నిచ్చుచుండును. ప్రతిదినము ఒక చిన్న బాలిక–నాకు మొదట హారతినిచ్చుచున్నపుడు ఈ ప్రాముఖ్యత నాకేల ? అందరి యందున్నది ఆ పరమాత్మయే గదా ! యని భావించుచుందును. అట్టి భావనలు వాని నిజస్థితిని తెలిసికొనుట జరుగుచున్నది. శ్రీ మెహర్‌బాబా గారి జయంతి యని శ్రీ రామారావుగారు గుర్తు చేసిరి. చి॥శాంతి జన్మదినము కూడ రేపేయగుటానందము. రేపటి రోజున హెచ్చుగా లోకశాంతి ప్రార్థన చేయమనియు, ప్రశాంత స్థలములో దైవధ్యానము చేయమనియు ఆమెను కోరుచుంటిని. అప్పుడే జన్మించిన రోజు సార్థక మగును. **మహనీయుల జయంతులు జరుపుకొనుటలో అర్థము, వారి జీవితములలో ఎక్కువ కాలము దైవానుభూతి నొందుచు, ఇతరులను కూడ దైవ మార్గములో నడిపించు దీక్ష పూనుటయే. అదియే మహనీయుల జన్మ సార్థకత.** వారి జయంతులను ప్రార్థనలతో, భజనలతో హరినామ సంకీర్తనలతో భక్తులు ఆనందముగా జరుపుకొనుచుందురు. అట్టి పవిత్రదినము భక్తుల జన్మసార్థకతకు తోడ్పడును. అంతేగాదు వారి పవిత్రజీవితవిశేషములు భక్తులు తలంచుకొనుట కూడ వారి ఆధ్యాత్మిక జీవిత వికాసమును వృద్ధిచేయును. ఎవరు ఏ రూపముతో ఏ పేరుతో ఈ భువిలో జన్మించినను, వారు భగవంతుని చిద్విలాసములను భక్తులకు పంచి యిచ్చినవారు మహనీయులుగా కీర్తికాయులగుదురు. అట్టి మహనీయుల జీవితములే చరితార్థమగును. ఇప్పుడు గాంధీ మహాత్మునికి ప్రీతికరమైన రఘుపతి రాఘవ రాజారాం గానము చేయుదురుగాక!

ఓం ఓం ఓం

---

భగవద్దర్శనమైన వెనుక అంతయు ప్రేమ,
సమృద్ధి, క్షమలతో నిండిపోవును. ఇక ద్వేషము
వంటి భావములు ఏ మాత్రము మిగలవు.

# 59. భగవదార్తి

భగవదార్తి – అనగా పరితపన. దుర్లభమైన మానవ జన్మ లభించినందుకు దేని కోసము మానవుడు పరితపించవలెను. “జంతూనాం నరజన్మ దుర్లభం” అన్నారు. పులి–సింహము వంటివి అడవికి రాజులే గావచ్చును – గట్టిగా గర్జించవచ్చును. కాని భగవంతుడు వాటికి జ్ఞానసముపార్జనా శక్తి నీయలేదు. ఒక మానవులకే జ్ఞానయుతలక్షణములున్నవి. మానవులు అజ్ఞానమును రెండు రకములుగా ఉపయోగించుచున్నారు.

1. తన సంసారము – పిల్లలు – బంధమిత్రులు, భోజనవసరులు సమకూర్చుకొనుట అనగా అన్నము– దాని కాధారము పప్పు, పప్పులోనికి ఉప్పు, రకరకముల కూరలు–పిండివంటలు ఈ విధముగా నిద్ర లేచినది మొదలు రాత్రి నిద్రించువరకు ఏదో విధమైన తాపత్రయములలో పడికొట్టుకొనుచుందురు. ఇక ధనదాహమునకు అంతే ఉండదు. 50వేల రూపాయలను – లక్షగాను దానిని రెండు లక్షలుగాను వృద్ధిచేయప్రయత్నించుటలో ఆయుర్దాయము చాల గడిచిపోవుచున్నది. కొందరి జీవితములు చూడ వారి సంపాదనను వారే అనుభవింపలేకపోవుచున్నారు. ఇది కడు విచారకరమైన విషయము. అట్టి జన్మలు వ్యర్ధము.

2. అరుదుగా నుండు కొందరు – తమకు లభించిన మానవజన్మవిలువను గ్రహించి – దానిని ఎట్లు సద్వినియోగము చేయవలయునా యని సదా చింతించుచుందురు. ఏలనగ ఈ శరీరము నశించినచో మరల మానవజన్మయే లభించునను నమ్మకమేమున్నదని తలంచుచు – తమకు లభించిన ధనమును బీదలకు తోడ్పడుటలోనో – తాము నేర్చిన విద్యను యితరులకు పంచుట కొరకో ఎదుటివారి కష్టసుఖములలో తామున్నామని ధైర్యము చెప్పుటయూ ఒకరకమైన సుకృతమే– ఈ విధముగా తమ జీవితములను, తమ జ్ఞానమును ఇతరులతో సదా పంచుకొనగోరుచుందురు. అట్టివారి జన్మయే, నిజమైన మానవజన్మగా పేర్కొనవచ్చును.అట్లు కానిచో మానవుడు రెండుకాళ్లపశువుగానే పరిగణింపబడును. శ్రీరామకృష్ణులు వారు తీవ్రమైన భగవదార్తి గలవారగుటచే “అమ్మా! నిన్ను చూడకుండా ఎన్ని రోజులు గడచిపోయినవి ! ఈ రోజు కూడా వ్యర్థముగా గడచిపోవలసినదేనా” యని ఏడ్పెడి వారట. అందుచే **మానవులుగా జన్మించినందుకు దాని విలువను గ్రహించి – మనస్సును భగవంతుని పై మరల్చి – బాహ్య ప్రవృత్తి పరమైన వాటికి వీలయినంత దూరము గానుంటూ– మానవజన్మకు మూలమైన దైవమను గమ్యస్థానమును చేరి ధన్యులు కావలయునను నదియే నా సందేశము !**

ఓం ఓం ఓం

## ౬౦. ఈ క్షణము

నేను ఎల్లపుడును ప్రస్తుత క్షణము యొక్క విలువను గూర్చియే చెప్పుచుందును. నేడు నా బల్లమీదనున్న కాగితములు సర్దుచుండగా–అందులో ఒక కాగితము దొరికినది. దాని మీద నేను ఓంకారునికాదు. మరేమియు కాదు – నా పేరు ఈ క్షణము అని వ్రాయబడియున్నది. అదిచూచి నాకెంతయో సంతోషమైనది. అవును నేనెవరిని? ఈ శరీరములోనున్నది ఓంకారము దానిని ఈ క్షణమునందే గుర్తించవలెను. నాభావములు మీకు వింతగా నుండవచ్చును. ఈ క్షణము అమూల్యమైనది. దానికి విలువను కట్టజాలము.

ఇట్టి పవిత్ర భావములలో ఈనాటి సంధ్యాసమయమున శివాలయమునకు వెళ్ళి శివ శివాయని అప్రయత్నముగ పలుకజొచ్చితిని. మంగళస్వరూపుడగు ఆ శివుడు యిట్లనినట్లనిపించెను. 'నీవు నన్ను బాహ్యమున ఏలచూచి పిలచుచుంటివి? మనమిద్దరముకాము. ఉన్నదొక్కటియె ! నేను నీతోనేయుంటిని. ఈ విశ్వమునందెల్ల నిండియున్నది ఒక్కటే పరంజ్యోతి" – ఆ ప్రబోధము విని దివ్యానుభూతిలో శివోహం, శివోహం అనుచు నిలిచిపోతిని. అట్టి క్షణము ఎంత విలువైనది! అదియే జీవితములో అతి పవిత్రమైన క్షణము. చీకటి ఆవరించుచుండుటచే కొండ దిగనారంభించితి. "భగవంతుని చేరుమార్గము చాల కఠినమైనది." అను సూక్తి గల బోర్డు త్రోవలో కనిపించెను, అదిచాల నిజమే ననపించెను. అందుచేతనే ప్రవృత్తి పరులు ఆ మార్గములో నడుచుటకు యిష్టపడరు. అట్టి వారికి క్షణముల విలువేగాదు రోజుల విలువ సంవత్సరముల విలువ గ్రహించు అవకాశమేవుండదు. **ఓ దైవజిజ్ఞాసా పరులారా, నా వద్దకురండు. ఈ క్షణముయొక్క విలువను గుర్తించి, భగవంతుని చేర త్వరపడుడు; మన మందరము ఒకే దైవసంతానముగాన అందరము కలసి ఈ క్షణమునందే దైవమార్గమున పయనించి గమ్యమును చేరుదము.** ఇదియే మీ ఓంకారుని ప్రార్థన !

ఓం ఓం ఓం

---

మనస్సుకు నిజముగా ఒకటే విచారము, కష్టము.
అది ఆత్మ తన సహజస్వభావమును మరచుటయే.

# 61. కలిలో హరిస్మరణ

ఇపుడు భక్తులందరూ చేసిన భజన వినుట కానందముగానే యున్నది. భజన చేయువారు భజనపరులవలె గాక ; భగవంతుని అనేకవిధములు స్తుతించుచు పాడుచున్న పాటల సముదాయమే భజన అనబడుచున్నది. గాన భజన చేయువారు శరీరజ్ఞప్తిని మరచి చేసినచో, అంతరంగములో ప్రక్కనున్న వారు తన్మయత్వమున మునిగియుందురు. శ్రీరామకృష్ణపరమహంస అట్టి సమయములలో శరీరజ్ఞప్తిలేక నాట్యము కూడ చేసెడివారట. దైవజ్ఞప్తిలోనున్న వారికి కాలము, స్థలము తోటి మానవులతో సంబంధముండదు. వారి లోకములో వారు విహరించుచుందురు. అందుచేతనే లిప్తకాలమునైనను ఆయనను మరువరాదు. ఒక భక్తుడు స్వర్గద్వారము చెంత వేయి సంవత్సరములు తపస్సుచేసి-లిప్తకాలము ఒక కునుకు వేసినందున – ఆ కొలది సమయములోనే స్వర్గద్వారము తెరువబడుటయు, మూయబడుటయు జరిగిపోయెనట. వింటిరిగదా ! వేయి సంవత్సరములు చేసిన తపస్సునకు ఒక చిన్న కునుకు అడ్డమువచ్చినపుడు – క్షణభంగురమైన ఈ జీవితములలో ఎన్నిరోజులు దైవచింతన లేకుండా వ్యర్థముగా గడిచిపోవుచుండెనో గుర్తించుకొనుట చాలా ముఖ్యము. ఈ కలికాలములో హరినామస్మరణ మాత్రమే సులభతరుణోపాయము. కనుక **మీరందరూ తైలధారవంటి నిరంతర జ్ఞప్తితో భగవంతుని సన్నిధి ననుభవించుచు భజనలు చేసినచో జన్మసార్థక మగును. మీలో నున్న బలహీనతలను పారద్రోలి దృఢమనస్కులు కావలయును, అట్టివారిని భగవంతుడు సదా వెంటనుండి కాపాడుచుండును. అతడు మీ స్వంతమే అగును, దైవభక్తులు కోరునది అంతకంటే ఏమున్నది. భక్తియను తాడులో భగవంతుని బంధించవచ్చునని అనుభవనీయులు నుడివిరి. ఇది ఎంత సత్యము !**

ఓం ఓం ఓం

---

ఆనందమే భగవంతుడు. అహంకారము
సమూలముగ నాశనము అయిన హృదయమునందే
ఆయన నివసించును.

# 62. ప్రేమతత్త్వము

భగవంతుడు ప్రేమస్వరూపుడు కనుకనే దైవమే ప్రేమ. ప్రేమయే దైవము అని చెప్పబడినది. ప్రేమచేత సాధింపలేని దేమియు లేదని గుర్తించవలెను. నిర్మల ప్రేమ - బద్ధశత్రువుని - మిత్రునిగా చేయును. మన ప్రేమపూరిత మాటలచే రోగిని కూడా ఆరోగ్యవంతునిగా చేయవచ్చును. నిస్వార్థప్రేమ - మన జీవితములనే ప్రేమమయముగా చేసి వేయును. అందుచేతనే **నేను ఆశ్రమ కార్యకర్తలను, ఆశ్రమ వాసులందరిని యిచ్చటకు ఆశ్రమ సందర్శకులుగా వచ్చిన వారిని దైవముగా భావించి ప్రేమాదరముల సేవించమని సదాకోరుచుందును.**

మనము ఏమి యిచ్చినను వారు మరచుటకు అవకాశమున్నదిగాని మన నుండి పొందు ప్రేమను మాత్రమే వారి జీవితకాలమంతయు జ్ఞప్తియందుంచుకొం దురు. ప్రేమ మరపునకు తావీయచాలదు.

అమెరికానుండి క్రిందటి జనవరిలో స్వామి బ్రహ్మానంద దంపతులు ఆశ్రమం వచ్చి కొద్దిరోజులిచ్చట శాంతిగా గడిపి వెళ్ళిరి. మరల వారు ఈ సంవత్సరం జన్మ దినమునకు ఆశ్రమం రావలయునని యన్నట్లు వ్రాసియుండిరి. ఒకటి దైవశక్తితో నిండిన ఈ ప్రశాంతవాతావరణము. రెండవది ముఖ్యముగా క్రిందటిసారి వారి యందు చూపిన నిర్మల ప్రేమాదరములే - ప్రేమింపబడు వారికంటే ప్రేమచూపు వారే అధికధన్యులు. దైవ ప్రేరణవల్లనే మనకు అట్టి దివ్యప్రేమస్వభావము అలవడును. రాణి లక్ష్మి (పెద్దపావని) నా సన్నిధిలో తృప్తికరముగా ధ్యానము చేసికొని, తాము ఈ రోజు నిజమైన ఆనందమును అనుభవించినట్లు చెప్పగా నాకు చాలా సంతోషమైనది. శాంతి ఆశ్రమం చేస్తున్న కృషి దీని ధ్యేయము, ఇచ్చటకు వచ్చిన భక్తులు, ఆధ్యాత్మిక చింతనలో యుండి ధ్యానములో వీరి ఆత్మజ్యోతిని దర్శించి తరించవలయునను కాంక్షయే నా నిరంతర కాంక్ష మిమ్ము తరింపచేయుగాక!

ఓం ఓం ఓం

---

మనస్సునకు గొప్ప శక్తి గలదు.
దానిని చాంచల్యముతో నుండనీయరాదు.
అప్పుడే ఊహాతీతమైన శాంతి అలవడును.

# 63. అంతా మనస్సే

మనస్సు అనునది ఒక వస్తువు కాదు. దానికి రూపము లేదు. అయినను అది చేయజాలని పని ఈ పృథ్విలో నుండదు.

శ్రీరామ, కృష్ణ, బుద్ధ, క్రీస్తులుగానిండు, సాయిబాబా, మెహర్‌బాబా మొదలైన మహనీయులుగాని, వారు చేసిన వివిధరకముల ఉపదేశములుగాని, కార్యాచరణకు మనస్సే కారణ మగుచున్నది.

ఈ ప్రపంచమే మనోమయమైన మాయతో నిండియుండ అవతార పురుష లెక్కడ ! బాబా లెక్కడ ? సాలెపురుగు తన గూడును తానే సృష్టించుకొని తిరిగి దానిని తనలోనికి తీసుకొనుచున్నది. గారడీవాడు తన మనోశక్తిచేతనే చిత్రాచిత్రము లైన వస్తువులను కల్పించుచు చూపరులను భ్రాంతింపచేసి మరల ఆ మనశ్శక్తిచేతనే మాయము చేయుచుండును. చిన్నబిడ్డలు ఆటవస్తువులకై రోదన చేయుచుందురు. కొన్ని దినములు వాటితో ఆడుకొని దాచుకొనుచు, కొంతకాలమునకు భ్రాంతి తీరిన తర్వాత వాటి నొక మూల పడవేసియో, ఆవల పారవేసియో మరల మరియొక వస్తువుతో ఆడుకొన గోరుచుందురు. అటులనే పసిబిడ్డ హృదయులగు మానవులు, మొదలు ఒక బాబాను తరువాత మరియొక బాబాను పూజించుచు, అతడి మనస్సు వికసించిన తదుపరి లోకములోని బాబాలకు మూలమైన అసలు బాబాను పూజించ కోరుచుందురు.

కొందరు మిరపకాయలు తినుచున్నట్లు భావించి కన్నీళ్ళు కార్చుచుందురు. మరికొందరు తెలివైనవారు హల్వాలాంటి మధుర పదార్థమును తినుచుంటి మనునంత సంతోషముతో, తమమనః ప్రపంచములోని ఏ బాబానో పూజించుచు ధ్యానించు చున్నట్లు ఆనందబాష్పములు విడుచుచుందురు. కన్నీటికి, ఆనంద బాష్ప ములకు విడదీయటకు వీలులేనంత సంబంధమున్నది. సంబంధమే కాదు అవి రెండును ఒక్కటియే. తమ భావమును బట్టి కొందరు ప్రవృత్తిపరమైన పూజలు చేయుచు విలపించుచున్నారు. నివృత్తి పరులైన భక్తులు, నిరపేక్షతో పూజలుచేయుచు ఆనందించుచున్నారు. వీటికి మూలమంతయు మనస్సే అని గ్రహించిన ఆరూఢులు, సంకల్పము లన్నింటిని విడచి జడభరతునివలె సర్వమునకు సాక్షి రూపముగా నుండెదరు.

ఓం ఓం ఓం

# 64. నిరాశ

భక్తులందరకు హృదయనివాసమగు దైవము ననుభవించుటకు స్వాగతము. ఆశలను జయించి విరాగులైనవారికి దైవసన్నిధి అనునది అరచేతిలోని ఉసిరికాయ వలె అతి సులభముగా లభించును. ఆశ యనగా కోరిక – కోరికలతో నిండియున్న వారి మెదడులో "సైతాను" తన అనుచరులగు దెయ్యములతో నిరంతరము నాట్య మాడుచుండును. ఇక ఆశను జయించిన మహనీయుల సేవచేయుటకై దేవతలు కూడ– వారి పాదముల వద్ద ఆత్రుతగా వేచి యుండుదురట. మనలను నిరాశపరచని వాడు ఒక్కడే ! సామాన్య మానవులవలన ఏదో యొకవిధముగా మోసగింపబడి వారి వలన నిరాశనే పొందుచుంటిమి. ఇది చాలా మంది మానవులకు అనుభవమైన విషయమే. కనుక భక్తులందరూ దీని సారమును గ్రహించి ఎట్టి ఆశలకు లోను గాకుండా– భగవంతుని నమ్మినచో నిరాశ, నిస్పృహలనునవి దరిచేరజాలవు. దైవమును నమ్మి భంగపడిన వారుండరు. ప్రాపంచిక ఆశలను జయించినవారి జీవితములు అత్యంత ధన్యవంతములు. వారే ధీరులు – అట్టి మహనీయులకు ధన్యవాదములు.

ఓం ఓం ఓం

---

ఆధ్యాత్మిక రంగము నుండి ప్రాపంచిక కార్యకలాపముల లోనికి
తీసుకొని పోవలసిన సందేశమేమి ? మానవుల పాదముల క్రింద
నలుగదొక్కబడిననూ, తమ పరిమళమును
నలుదిక్కులను వ్యాపింపచేయు పుష్పముల క్షమాశక్తినే
ఒక సందేశముగా కొనిపోవలయును.

# 65. వెండితెరపై ఆడెడి బొమ్మలు

ఇపుడు చదువబడిన అధ్యాయము చాల విలువైనది. "ఈ శరీరమనెడి అస్థిపంజరమునుండి వెలుపలికి రమ్ము" కాని శరీరమునుండి బయటపడుటకు ఎవరు ఇష్టపడరు.

అనుభవనీయమైన నా మాటలు వారికి రుచించకనో అర్థముగాకనో తమ శరీరములనే నావద్ద నుండి త్వరగా బయటకు నడిపించకోరుచుందురు. ఇది ఆశ్చర్యము కాదా ? వెండితెరపై కదలెడి బొమ్మలను చూచి ఆనందమును పొంద గోరువారు – ఈ శరీర మనెడి తోలుబొమ్మనుండి బయటపడుటకు యిష్టపడుటకు బదులు నా మాటలువిని భయము కూడా చెందువారుండవచ్చును.

నేడు సముద్రతీరమునకు వ్యాహ్యాళిగా వెళ్ళి – ఒడ్డున లేచి పడుచున్న కెరటముల యొక్క తుంపరలు ఈ శరీరమును పూలజల్లులవలె తాకుచున్నపుడు పొందిన ఆనందానుభవమును ఈ చిన్న మాటలలో వర్ణించుట ఎట్లు ? అది వర్ణనా తీతమైనది. ఎవరు ఎపుడు ఎట్టి ఆనందమును పొందగోరుచుందురో అట్టి ఆనంద మును వారే పొందగలరు కాని యితరులు దానిని పొందజాలరు. నా జీవితపరమా వధి, తపన ఏమనగా – **ఆశ్రమ సందర్శకులు గాని, భక్తులుగాని ఎవ్వరినైనను నా వారిగా భావించుచు యిట్టి నిగూఢమైన పవిత్ర భావనలు నాలో దాచుకొనలేక బహిరంగముగా చెప్పివేయుచుందును.** ఏలనన ఏ క్షణమున పిలుపు వచ్చినను రావచ్చును. పండు పండినపుడు దానంతటదియే రాలిపోవును. అందుచేతనే నా భావములను మీరు మీ శరీరములనెడు అస్థిపంజరములలో నున్నపుడే మీకు వినిపించగోరుచుందును. అది మీ ఆత్మజ్ఞానాభివృద్ధికి కూడ ఉపకరించునని నా వెర్రి నమ్మకము. భగవంతుడు మిమ్ము ఆత్మజ్ఞప్తితో నుండునట్లు అనుగ్రహించి శాంతితో బ్రోచుగాక.

ఓం ఓం ఓం

---

మన మాటలు ఉరుములుగా, భావములు మెరుపులుగా
లోకకళ్యాణమునకు తోడ్పడునట్లు
చేయగలుగుటయే భాగ్యము.

# 66. లింకన్ ఆదర్శము

**ప్రతివారి పనులకు, ఆలోచనలకు మనస్సు సాక్షిగా నుండును. మనము కోటి మనుష్యులను మోసపుచ్చగలము గాని, సర్వసాక్షి యగు భగవంతుని మోసపుచ్చ జాలము.** ఏదయినను అక్రమకార్యము చేసినపుడు మనల నెవరుచూడలేదను కొనుట అవివేకము. ఆకాశమువైపు తిరిగి ఉమ్మివేసినచో అది తిరిగి మనమీదనే పడగలదు. మన సంకల్పములు కార్యరూపము దాల్చక పూర్వమే లోనున్న భగవంతుడు సాక్షిగా గమనించును. మనకు మంచిని మనస్సుద్వారా ప్రబోధించుచుండును. కాని చెవులుండియు వినలేకపోవుట జరుగుచున్నది. మనకు ఆయన జ్ఞాననేత్ర మిచ్చినను, వాటిని మూసుకొని గ్రుడ్డివారివలె మనలోనున్న దానిని చూడలేక పోవుచున్నాము.

ఆ శక్తిని గమనించిన "లింకన్" మహాశయుడు అనేక శ్రమల కోర్చి విద్యనభ్య సించి ఓర్పుతోను, పట్టుదలతోను, సర్వవిధములైన కష్టములనుభవించి చివరకు అమెరికా దేశ పరిపాలకుడయ్యెను. అతడు తన జీవితములోచాల ఘనకార్యములు చేసెను. తన జీవితమంతయు స్వార్థమనునది కొంచెమైనను లేక, పరోపకారార్థము వినియోగించిన ధన్యుడు, ప్రేమ హృదయుడు. ఒకసారి తాను ధరించు కోటుజేబులో ఒక చిన్నపక్షి గూడుపెట్టుకొనుట చూచినందున ఆ కోటును కదలించినచో, వాటికి బాధ కలుగునని ఆ కోటునే వదలి వేసినాడు. అహంను వదలి జీవించగల్గినాడు. ఒక రోజు లింకన్ మహాశయుడు బజారు వెళ్లుచుండగా త్రోవలో ఒక స్త్రీ ఏడ్చుచుం డుట చూచి ఆగి ఎందులకేడ్చుచుంటివని ప్రశ్నించెను. అందుకామె తాను రైలునకు వెళ్ళవలయుననియు ఆలస్యమైనచో రైలు అందదనియు కాని తన పెట్టెను మోసుకొని వెళ్లువాడు రాలేదనియు, తాను ఆ పెట్టెను మోసుకువెళ్ళజాలనందుకు ఏడ్చుచుంటి నని చెప్పెను. అది విన్న వెంటనే తాను అమెరికా అధ్యక్షుడనను భావమునే మరచి, ఆ బరువైన పెట్టెను మోసుకువెళ్ళి సకాలములో ఆమెను రైలులో పంపి వేసెను.

లింకన్ న్యాయవాది కూడ. ఒక సమయములో వారి స్నేహితుడొకడు వచ్చి తన కేసులో కోర్టులో తనవైపు వాదించుమని కోరెను. అతని రిపోర్టు చూడగా శుద్ధ అబద్ధములు, అధర్మముతో నిండియుండెను. అతడు తన అంతరాత్మ చెప్పినట్లు నడుచుకొను మహా మనీషి కాబట్టి, స్నేహితుడుగదాయని కోర్టునకు వెళ్ళి జడ్జిముందు నిలచినపుడు తన అంతరాత్మ అబద్దమాడుచున్నావు అను ప్రబోధమును విని నిజము చెప్పివేయుట జరుగుననియు తెలుసుకొని – ఎంత స్నేహితుడైనను అధర్మపక్షమున వాదించుట తనచేత కాదనియు అ కేసును వదలివేసెను. లింకన్ మహాశయునికి అసత్యము నందు గల అసహ్యం, సత్యమునందెత ప్రీతి యుండెడిదో గమనించుడు. ఇది యొక ఆదర్శపురుషుని లక్షణము. విన్న దాని మంచిని గ్రహించుట బుద్ధిమంతుల లక్షణముగా నుండవలెను.

ఓం ఓం ఓం

# 67. మానసిక వ్యధ

భగవంతుడు జగన్నాటక సూత్రధారుడు. ఆయన లీలవల్లనే ఈ సృష్టిజాల మంతయు వ్యక్తమగుచున్నది. అందులో మానవులమైన మనము పాత్రధారులము. ఈ భూమియనువేదికపై అనేకరకముల వేషభాషలతో సుఖ-దుఃఖసమ్మిళిత జీవిత పాత్రలు నటించుచున్నాము. అందుచే ఈ రహస్యమును గ్రహించి మానవపాత్ర ధారులు బహుజాగరూకతతో ఎవరి పాత్రను వారు నటించవలెను. అన్నింటి కంటె తృప్తి చాలఅవసరము. దానిలో శాంతి సుఖములిమిడియున్నవి. మహారాజులు, శ్రీమం తులు సహితము, సమస్త భోగభాగ్యములుండియు, మానసిక వ్యధ చెందుచునే యుందురు. అందుకు ఉదాహరణముగా ఈ క్రింది కథ చెప్పవలసియున్నది.

ఒక జమీందారు భవనము చేరువున ఒక నిరుపేద కూలివాడు నివసించుచు, తన కాయకష్టముతో లభించిన కూలి డబ్బులతో తృప్తిగా జీవించుచు రాత్రి నిద్రించు వరకు ఆనందముగా పాటలు పాడుకొనుచు హాయిగా నిద్రించెడివాడు. మన శ్రీమం తుడు తన సౌధమునుండి ఆ కూలివాని ఆనంద జీవితమును చూచి ఆశ్చర్యపడుచు, తనకు అన్ని సౌకర్యములుండియు, ఏనాడును సంతోషమనునది లేక చింతలతో నిద్రయే లేకుండుటయు, ఆ కూలివాడు ఏమియులేకపోయినను అంత ఆనందమయ ముగా నిశ్చింతగానిద్రపోవుటకు కారణములు. తన మంత్రిని అడిగెను. ఆ మంత్రి తెలివైనవాడగుటచే - దానికి కారణము ఇతనికి తృప్తిఅనునది లేకపోవుటయే అని గ్రహించి-జమీందారుకు నిదర్శనముగా చూపుటకై 99 రూపాయల మూటను ఆ కూలివాని పాకలో పడవేయించెను. వాడు కూలిచేసికొని గుడిసెచేరి, అందున్న మూటను విప్పిచూచి, ఆశ్చర్యముతో ఆత్రముగా అందున్న రూపాయలను లెక్కపెట్టు కొని, వాటిని 100 రూపాయలుగా పూర్తిచేయుటకు తాను పొట్టమాడ్చుకొనుటే గాక, చిన్న దీపమునకు నూనె కూడా కొనకుండా పైసలు కూడబెట్టసాగెను. ఆనాటి నుండి వాడి గుడిసెలో దీపముగాని, వాని పాటలుగాని వినిపించని కారణమరయు టకు జమీందారు మంత్రి సాధారణమనుష్యులుగా ఆ కూలివాని పాక వద్దకు వెళ్ళి "ఓయీ! నీవు వెనుక ప్రతిరోజు హాయిగా పాటలు పాడుకొనుచు సుఖముగా నుండెడివాడవు కదా ! ఇప్పుడు నీ యింట దీపమైనను లేదేమి ?" అని ప్రశ్నించగా ఆ కూలివాడు "నేనుకూలి పనిచేసుకొని వచ్చే పైసలతో సుఖంగా తినేవాడిని. నా గుడిసెలో 99 రూపాయల మూట మొన్న దొరికినది. అది వందగా చేయాలనే ఆశతో కడుపునిండా తిండి తినుటలేదు. ఆ రూపాయి పోగు అగువరకు శాంతిలేదు. ఇక పాట లెట్లు పాడగలను ?"

ఈ కథను బట్టి నేర్చుకొనవలసినది **తృప్తి లేనివారికి మానసిక వ్యధ తప్పదు. అది తప్పవలయునన్నచో దైవమును శరణువేడి కలిగిన దానితో తృప్తి చెంది, శాంతిగా జీవించుట నలవరచుకొనవలెను. ఇదే నా సందేశము.**

ఓం ఓం ఓం

# 68. దాతృత్వము

ఇపుడు శ్రీమార్కండేయ దాతృత్వమును గూర్చి చక్కగా చెప్పిరి. మానవునిగా జన్మించిన ప్రతివానికి దాతృత్వస్వభావము వుండవలయును. దాతృత్వము అనగా ధనముగాని,మరియే యితరములుగాని దానము చేయుట అను దానికి పరిమితమైన మాటగాదు. ప్రేమయను దాతృత్వములో ఎదుటివారికి మేలుకలుగును. జ్ఞానమును దాతృత్వము–పలువురి జ్ఞానాభివృద్ధికి కారణమగును. దాతృత్వమునకు అంతరార్థ మొక్కటియే–నీలోనుండి దేనినైనను, వారి వారి అవసరములనుబట్టి–విరివిగా పంచి వేయుము. ఏమియు మిగుల్చుకొనకుము. అదియే దాతృత్వమను పదమునకు సరియైన నిర్వచనము. ఆ దాతృత్వము మొదట నీ గృహము నుండియే ప్రారంభిం పుము.

అమెరికా భక్తురాలొకామె ఇట్లు చెప్పెను "లోకములో శాంతి నెలకొనుగాక ! అది నా నుండియే ఆరంభింపబడును గాక !" అట్లే ఎవరైనను తమకు ఏది అభిమాన మైనదో దానిని యితరుల సుఖమును కోరుచు విరివిగా పంచవలయును.

"ఇంగర్సాల్" అను నాతడు నాస్తికుడు. అయినా చక్కని ధర్మపరుడు–అతడు నాస్తికుడైననూ – ఉన్న సత్యమును మూడు ముఖ్య సూత్రములుగా చెప్పెను.

1. ఆనందమును పొందుటకు స్థలమిదియే !
2. ఆనందమును పొందుటకు క్షణమిదియే !
3. ఆనందమును పొందుటకు – ఇతరుల నానందింపచేయుటయే !

పై మూడు సూత్రములు – జీవిత శాశ్వతానందమునకు మూల సూత్రములు. **ఈ రోజులలో ఇతరులకు బోధించుటకంటె నాకు నేను బోధించుకొని, ఎవరు ఈ త్రోవను ప్రయాణించినా చివరకు అందరి త్రోవలు ఒకటియే యని గ్రహించుటలో ఆనందించుచుందును.**

ఓం ఓం ఓం

---

అహంకారము లేనట్లే తరచుగా కనిపించును. కాని సమయము వచ్చినపుడు భూమిలోనే యుండి వర్షములు కురియగానే మొలచు కొన్ని విత్తనములవలె పైకి వెల్లడి యగును.

## 69. శాంతము లేక సౌఖ్యము లేదు

**శాంతమునకు శాంతి అను పదమునకు అవినాభావ సంబంధమున్నది. శాంతము మానవుని పురోగతికి అద్దము. శాంతి అతని ప్రతిబింబము వంటిది.**

నూరుమంది కలహప్రియులున్నచోట శాంతము గల వ్యక్తి ఒక్కరున్నను, వారి మధ్య చెలరేగిన కలహములు ఈ వ్యక్తి శాంతవచనములచేత సూర్యుని వేడికి మంచు కరిగిపోవునట్లు ఆ కలహములు అంతరించిపోవును. శాంతములో అంత మహిమ యున్నందుననే శ్రీత్యాగరాజుల వారు దాంతునికైన వేదాంతునికైనా శాంతము లేనిదే సౌఖ్యము లేదనిస్పష్టముగా విశదపరచిరి. ఇప్పుడు ఆరుబయట వెన్నెలలో ఈ నలుగురు మహనీయుల 1. శ్రీకృష్ణ 2. గాంధీ 3. బుద్ధ 4. క్రీస్తు సన్నిధిలో సత్సంగము జరుపుకొనుట అందులో ముఖ్యముగా శ్రీ విశ్వనాథముగారు మన మధ్యనుండుట నాకెంతయో ఆనందముగా నున్నది. వారి గురించి చెప్పుటకు శ్రీ విశ్వనాథముగారు ఇష్టపడరు. అయినను నా హృదయము ఏదియో చెప్పుటకే కోరుచుండును. అట్టివారు నా నుండి వినవలసినదియు ఉండదు. వారు శాంతి - శాంత స్వరూపులు, అమృత హృదయులు. ఆ భావనలో - నా కన్నా ఇతరులు ఏదో ఒక విధముగా ఉన్నతమైన వారే అనిపించును. ఇపుడు జగదాంబ శాంతము లేక సౌఖ్యము లేదు అను కృతి వినచక్కగా పాడెను. నేను అట్లు పాడలేనుగదా. నేను చేసినను - చేయజాలక పోయినను నా మనస్సు సదా మీ అందరి ఆధ్యాత్మికాభి వృద్ధిని కోరుచు తోడ్పడుటయే నా నిజమైన సేవగా భావింతును. ఈ ఆశ్రమము మీ అందరి జ్ఞాన గృహము. ఈ జ్ఞాన గృహములో నివసించుటకు దైవ పరితాపము అను అర్హత కావలయును, మీ రందరూ అందుకు అర్హులుగా నుందురుగాక ! ఇదే నేటి నా సందేశము.

ఓం ఓం ఓం

---

మనస్సే ఒకరిని పాపిగను,
మరియొకరిని పుణ్యునిగను చేయును.
కనుక దానికి చంచలత్వము నందనివ్వక జాగ్రత్త పడవలెను.

# 70. సృష్టితత్త్వము

ఆశ్రమమునకు వచ్చి ఈ సత్సంగములో పాల్గొనిన శ్రీచిన్మయానంద స్వామి శిష్యురాలు శ్రీ శారదాదేవి గారికి హృదయపూర్వక స్వాగతము. దైవము ఆమె ద్వారా జ్ఞానపూరితమైన వాక్యములు చెప్పించెను. ఆమె సందేశమును విన్న మీరు తాత్కాలికానందముతో తృప్తి చెందక, ఆచరణలో పెట్టినపుడు అవి సార్ధక మగును. సహజముగా మన దినచర్యలో చిన్నవైనను, పెద్దవైనను ఎన్నియో పనులను నిర్వహించుట జరుగుచున్నది . గాని వాటిని నేను గనుక యిన్ని పనులు చేసితిననెడు భావన వచ్చినచో అది కేవలము భ్రాంతియే ! **దైవజ్ఞప్తితో నిండి నిరహంకారముగా చేసినపని ఒక్కటైననూ నిజంగా సార్ధకమగును.** శాస్త్రవిహితమైన చక్కని ఉదాహరణ చెప్పగోరుచుంటిని.

జీవిత మనే వృక్షము మీద రెండు పక్షులు నివసించుచున్నవి. అందు ఒక పక్షి ఆ తరుశాఖలలో క్రింది భాగమున నివసించుచు ఒకసారి పరిపక్వముగాని వగరు–చేదుగా నున్న పండ్లను తినుచుండును. మరొకసారి బాగుగా పండిన మధుర ఫలములను తినినపుడు సంతృప్తితో ఆనందించుచుండును.

ఇకరెండవ పక్షి ఆ వృక్షశిఖరాగ్రమున, నిశ్శబ్దముగా కూర్చుండి "ఈ సృష్టి తత్త్వమునుతిలకించుచు, మౌనములో విలీనమైపోవును. ఇది మానవులు తమ జీవిత గమ్యస్థానమగు భగవంతుని చేరుటకు చక్కని ఉదాహరణము. ఈ పక్షులు రెండును జీవాత్మ పరమాత్మలు. శరీరముతో తాదాత్మ్యము నొంది కష్టసుఖములలో ఈదులాడు వారు మొదటి పక్షివలె విచారమునకును, మరొకసారి ఆనందముతోను జీవాత్మ భ్రాంతులుగా నుందురు.

ఇక రెండవ పక్షివలె పరమాత్మతత్త్వమును తెలిసికొన గోరువారు సుఖ దుఃఖాతీతులై – తాము చేయు పనులకు విలక్షణముగా నుండి తామరాకుమీద నీటి బిందువువలె నిరంతరాత్మానుభూతిపరులై శాశ్వత స్థితిని పొందుచు నిశ్శబ్దముగా నుందురు. ఇది సకలచలనములకు అతీతమైన ఉత్కృష్టమైన స్థితి అనెడి మాటలు లేని మౌనస్థితి. ఆ స్థితికి ధన్యవాదములు.

ఓం ఓం ఓం

---

భౌతికమైన పరిమిత సౌఖ్యములు అపరిమితమైన ఆనందమును ఇవ్వజాలవు.
అటువంటి ఆనందమును పొందవలెనన్న దుఃఖములకు మూలకారణమైన
దేహాత్మబుద్ధిని విడిచి, శరీరమను
పంజరమునుండి వెలుపలికి రావలయును.

# 71. విధి వశము

విధి యనునది ఎంత గొప్పవారినైనను విడిచిపెట్టదు. కాని మనకు ప్రతికూలముగా తటస్థించు సంఘటనలు విధివశమనియే అనునది కేవలము భ్రాంతి మయమే– దానికి మన పూర్వ – యిప్పటి జన్మసుకృత, దుష్కృతములనుబట్టి కూడ విధి శిక్ష విధించుచుండును. కాని సామాన్య మానవులు తమకు సంభవించిన కష్టములకు విధినే దూషించుచుందురు. విధి యనగా భగవంతుడు, ఆయన కర్మ ఫలప్రదాత. ఇది మానవుల ఎడల విధి ధర్మచట్టము ననుసరించియే విధించుచుండును, ఇప్పుడు ఒక ఉదాహరణము ద్వారా దానిని తెలుసుకొందుము.

ఒక సాధువుగారు ఒక నూతి ప్రక్కన కూర్చుని ధ్యానము చేసుకొనుచుండగా – ఒక మనిషి ఆ నూతిలో పడిపోవుటకు పరుగిడి వచ్చుచుండెను. వాని వెనుక కొంతమంది జనులు పరుగెత్తుకొని వచ్చుచుండిరి గాని నూతిలో పడనున్న వానిని పట్టుకొనజాలక – వారు నూతివద్ద తపస్సు చేసుకొనుచు కనిపించిన సాధువుని– వానిని పట్టుకొని ఆపమని కేకలు వేసిరి. కాని ఆ సాధువు అతనిని పట్టుకొనుటకు బదులు నవ్వుచుండెను. అప్పుడు జనులు ఆయనను సమీపించి నీవు దొంగసాధువు వలె నున్నావు. చనిపోదలంచిన ఒక మనుజుని బ్రతికించుట తప్పా ! కూర్చున్న వాడవు కదలనైన లేదు అని నిందించసాగిరి. అపుడా సాధువు “ఓయి వెర్రి మానవులారా మీరు బాహ్య నేత్రములతో చూచి–అల్పమనస్సులతో నన్ను నిందించుచున్నారు. నేను సూక్ష్మ దృష్టితో చూచితిని. వెయ్యి పాశములతో వాని కర్మవానిని నూతిలోనికి లాగుచుండగా మీరేమి “చేయగలరు ?నే నేమి చేయగలను ?” అని బదులు చెప్పెను. **కనుక విధివశము అనునది బలీయమైనది. దానిని తప్పించనెవరి తరము?** అందుచేతనే మహనీయులు చెప్పినట్లు – ఆశాపాశము లనెడి ఉచ్చులలో చిక్కుకొనక వాటినుండి బయటపడు టకు భగవంతుని స్మరణ మొక్కటే తరణోపాయము. అది అన్ని బంధముల నుండి విముక్తి కలిగించి వారి విధి ఏదో అది చేయించి మంచి మార్గమున నడిపించును. కనుక అజ్ఞానులైనను జ్ఞానులైనను విధికి వశులై అంతయు నీ యిష్టమే నెరవేర నిమ్ము నా యిష్టమేమియును లేదు అని పూర్ణశరణాగతులు కావలెను. అట్టి వారిని విధి ఏమియు చేయజాలదు.

ఓం ఓం ఓం

# 72. సంతృప్తి

సంతృప్తి గలవారిని ఎట్టి ఆకర్షణలు దరిచేరజాలవు. సంతృప్తిలో ఎంత మహిమయున్నదంటే సంతృప్త హృదయములు తమవైపు రానున్న సంపదలేగాదు రాజ్యమిచ్చెదమని ఆశపెట్టినను దాని భ్రమలో పడక వాటిని గడ్డిపరకవలె చూడ గలరు. తమకు లభించిన ఒక పండునైనను వారు దైవ ప్రసాదముగా అందుకొందురు.

ఒక రాజు రత్నకిరీటధారి, దివ్యాభరణములను ధరించి తన పరివారముతో ఒక గ్రామమునకు వెళ్లుచుండగా మార్గమధ్యమున ఒకచెట్టు క్రింద కౌపీనధారియగు సన్యాసి ఒక రాతిపై కూర్చుని - ప్రకృతి రమణీయతలో దైవానుభూతి నొందుచు ఆనందపరవశుడై యుండుట గాంచెను. చక్రవర్తి ఆ సాధు ప్రశాంతమైన వదనమును గాంచి, ఆనందముతో ఆయన చెంతజేరి, ఆహా ! యిట్టి మహానుభావుడు, నా ఆస్థానమునకు వచ్చినచో సకల సౌకర్యములు సమకూర్చెదనని తనతో రమ్మని" కోరెను. అందులకు సాధువు ఒక లిప్తకాల మాతనివైపు చూచి, "మీ నుండి నేనేమియు కోరుట లేదు. ఈ చెట్టు క్రిందనే నాకు సుఖముగా నున్నది. దయచేసి నాకును, ఆ సూర్యభగవానునికి అడ్డుగా నిలవక తప్పుకొనుటయే నాకు మీరు చేయు సౌకర్యము" అనెను.

చక్రవర్తి మరల ఆయన నెన్నియో విధముల చెప్పినను, నిరాకరించినందున, అందు కాతడు ఆగ్రహించి నేనెవరినో తెలియునా ! నా మాట నిరాకరించుచున్నావు. చూడు ! నిన్నేమి చేయుదునో అని కరవాలము పైకెత్తగా ఆ సాధువు పకాలున నవ్వగా- రాజు నివ్వెరపడి పైకెత్తిన కత్తిని క్రిందపడవేసి ఆశ్చర్యముతో చూచుచుండగా ఆ సాధువు, "నన్ను నీ కత్తి చంపజాలదు. అగ్ని కాల్చజాలదు. అట్టి ఆత్మను నీవు చంపెదననగా నాకు నవ్వు వచ్చినదని" చెప్పెను. అపుడా చక్రవర్తి ఆ సాధువు మనస్థైర్యమును, గొప్పదనమును, కొంత గ్రహించగల్గినవాడై ప్రణమిల్లెను. **ఏ ప్రలోభ ములకు తావీయక ప్రశాంతహృదయులుగా నుండెడివారెంత ధన్యులు ! అది దైవికముగా లభించు నిత్యసంతృప్తిపదవి. భగవన్మహిమననుభవించుట అట్టి వారి హక్కు.**

ఓం ఓం ఓం

# 73. చిన్న పక్షుల భయము

భయ మనునది, మానవులనేగాదు, మృగ, పక్షి మొదలగు సర్వప్రాణికోటిని ఆవరించును. భయమును జయించుటయే ధైర్యసాధనము. స్వశక్తిలోనే ధైర్యము ధైర్యములో స్వశక్తియిమిడి యుండును.

ఒక రైతు పొలములో రెండు పక్షులు గూడు కట్టుకొని తమ పిల్లలతో నివసించు చుండెను. అట్లుండగా కొంత కాలమునకు ఆ రైతు చేను పండి కోతకు వచ్చెను. యజమానియైన రైతు తన పాలేరుతో చేను కోతకు వచ్చినది గాన కూలీలను పెట్టి కోయించుమని చెప్పి వెళ్ళిపోయెను. అతని మాటలు గూటిలో నున్న చిన్ని పక్షులు విని సాయంత్రము గూడు చేరగానే పెద్ద పక్షులతో చెప్పెను. అపుడా పెద్ద పక్షులు వాటి పిల్లలతో ఏమిపరవాలేదు. భయపడవలదు. రేపు కూలీలు చేనుకోయరు అని ధైర్యము చెప్పి మరునాడుదయము మరల ఆహారమునకై వెళ్లి పోయినవి. మరునాడు మరల యజమాని వచ్చి బంధువులతో చేను కోయుమని చెప్పి వెళ్ళి పోయెను. సాయంత్రం వేళకు గూడు చేరిన పెద్ద పక్షులతో చిన్న పక్షులు రైతు మాటలు చెప్పెను. అపుడవి ఏమియు పరవాలేదు రేపు కూడా మనము నిశ్చింతగా నుండవచ్చును. బంధువులు ఈ చేను కోయరు అని చెప్పి తెల్లవారగానే ఆహారమునకై ఎగిరి పోయినవి. మర్నాడు యజమాని తన కొడుకులతో రేపు చేను కోయుమని చెప్పెను. ఆ మాట విని పక్షులు గూడుచేరిన తల్లి తండ్రి పక్షులకు చెప్పగా ఏమియు పరవాలేదు. కొడుకులు కూడా ఆ పని చేయరు మనము తొందరపడవలసిన పని లేదన్నవి. ఇక నాల్గవ రోజున యజమానియైన రైతు రేపు తానే స్వయముగా చేను కోయుదునని చెప్పిన మాటలు గూడు చేరిన పెద్ద పక్షులతో పిల్ల పక్షులు చెప్పగా ఓహో అతడే స్వయముగా చేను కోయతలపెట్టినచో రేపు తప్పక చేను కోయబడు ననియు అచ్చటుండుట ప్రమాదమనియు తలంచి ఆ పక్షులు వెంటనే ఆ చోటు వదలి – తమ పిల్లలతో వేరొక స్థలమునకు వెళ్ళి చిరకాలము సురక్షితముగా జీవించినవి. దీనిని మీరు ఒక కథగా భావించరాదు. దీని వలన **స్వశక్తి యందు విశ్వాసముంచి చిన్నపనైనా, పెద్దపనియైనా స్వయముగానే చేసుకొనుటలో గల మంచిని గ్రహించవలెను.**

ఓం ఓం ఓం

# 74. స్వయముగా చేయుపని-లేక-రండి-వెళ్ళండి

చిన్న పనియైనను పెద్దపని గావచ్చును ఎవరి పని వారు స్వయముగా చేసి కొనగోరువారి జీవితములే ధన్యవంతములు.

స్వశక్తి యనగా స్థూలశరీరముల శక్తిగాదు ఆత్మశక్తి. తమపనిని యితరులు చేయుదురని తలచువారు పరమసోమరులు. స్వయంపనికి ఒక ఉదాహరణము. ఒక ధనికునకు యిద్దరు కుమారులుండిరి. అతడు యిద్దరికి చెరియొక 50 వేలు రూపాయలు యిచ్చెను. పెద్దకొడుకు దానిని తన స్వశక్తినుపయోగించి ఆ డబ్బును వృద్ధిచేసుకొనుచుండెను. రెండవ వాడు సోమరిగా తిరుగుచు ఆస్థినంతయు ఖర్చు చేసి అన్నవస్త్రములకు కూడా అవస్థపడుచుండెను. వారిరువురి పరిస్థితిని చూచిన వారు పెద్ద వాని నిట్లు ప్రశ్నించిరి. మీ తండ్రి మీ యిరువురుకు సమముగా ఆస్థి పంచెను గదా ! నీవు అధిక ధనవంతుడగుటకు, నీ తమ్ముడు కడు దరిద్రుడగుటకు కారణమేమి? దానికి పెద్దవాని సమాధానము నేను నా పనులన్నియు స్వయముగా చేసుకొనుచు, నాకు సహాయము చేయువారిని రండి రండి అని పిలిచి వారితో కలసి కష్టపడి పని చేయుదును గాన ధనవంతుడనైతిని – నా తమ్ముడుతన పని తాను స్వయముగా చేయడు సరిగదా పని వాళ్లను వెళ్ళండి చేయండి అని పురమాయించును. అందుచే వాని స్థితి అట్లు మారినదని చెప్పెను. అట్లే మానవుని **ఆధ్యాత్మికాభివృద్ధి కూడ ఇతరుల ఉపన్యాసముల వలన అధిక గ్రంథపఠనము వలన ఎంత మాత్రము వృద్ధిచెందదు. తాను చదివినది కొంచమైనను–మరల, మరల చదివినచో దానిలోని అంతరార్థము మాత్రమే అర్థము చేసికొనినచో దాని మహిమను స్వయముగా గ్రహించి యింకను లోతులకు అనగా తన అంతరమునకు ప్రవేశించి చూడగల్గినచో స్వానుభవము యొక్క నిజమైన ఆనందమును చవి చూడ గలడు.** అందుచే మీరందరును వెళ్ళు వెళ్ళు అనువారుగా నుండక రండి – రండి అందరము కలసి పొందవలసిన దానిని పొందుదము అనునట్టి వారిగా నుండ ప్రయత్నించవలెను. ఏదయినను అందరితో కలసి పంచుకొనునదియే ఆనందముగా నుండుటేగాదు అది మధురమైనదిగా మారును.

ఓం ఓం ఓం

# 75. పాలలో నున్న వెన్న

హృదయనివాసియగు భగవంతుని సన్నిధి ననుభవించుటకు సత్సంగమునకు వచ్చిన వారికి నా హృదయపూర్వక స్వాగతము. అగ్నిలో వేడి యిమిడియున్నట్లు సూర్యునిలో ప్రకాశమువలెను మనకు దైవముతో అంతటి ఐక్యతా సంబంధమున్నది. వెన్న పాలలోనే యిమిడియున్నది. కాని మనము పాలలో వెన్నను చూడజాలము. పాలలో ఒక్కచుక్క మజ్జిగ వేసినచో – అది పెరుగుగా మారి మరల దానిని కవ్వముతో మథించినచో అప్పుడు మన కండ్లకు వెన్న కనపించును. అట్లే భగవంతుడు మనలో నుండి చైతన్యశక్తి నిచ్చుచుండినను, మన హృదయములు పరిపక్వముగా లేనందున లోనున్న నిజస్వరూపమును చూడ జాలకుంటిమి. పెరుగును మథించి వెన్న తీసినట్లు మనస్సును మథించి-మథించినగాని లోనున్న బుద్ధి వికసించదు. పైనుదహరించిన విషయములు నిగూఢముగా నుండి అందుబాటులో నుండనట్లు కాన్పించును. చిన్న మొక్క మనకు ఉపయోగించదని తెలిసినప్పుడు దానిని లేతగానున్నపుడే త్రుంచివేయ వలెను. అది మ్రానుగా అయినచో కొట్టుట శ్రమతో కూడిన పని. ఒక నూలుపోగును సులువుగా త్రెంచగలము. పదిపోగులు కలసినచో దానిని త్రెంచజాలము. ఒక కత్తియున్నచో దానితో తాడును కోయవచ్చును కాని ఆ కత్తి ప్రాణములను గూడా తీయగలదు. కనుక **మనలో దాగియున్న ఎట్టి చిన్న తలపైనను దాన్ని హానికరముగా పెరుగనీయక వెంటనే త్రుంచి వేయవలెను. మన హృదయమనెడి అద్దమును శుభ్రముగా నుంచినచో – దానిలో దైవ ప్రతిబింబమును దర్శించగలము. పూర్ణవైరాగ్య మను పనిముట్టు అంతరాంతరములలో దాగియున్న కలుషమును కూడా కడిగి వేయును. అప్పుడు పాలలో యిమిడియున్న వెన్న వలె మన హృదయము స్వచ్ఛముగా మారిపోవును. ఇందు రహస్యమేమియును లేదు.**

ఓం ఓం ఓం

---

మనలను ముఖాముఖి పొగడు వారుకాక
మన లోపములను చెప్పువారే మనకు
యథార్థముగా అత్యంత ఆప్తులు, మిత్రులు.

# 76. శ్రేయస్సును కోరు ప్రార్థన

ప్రార్థనలు అనేకరములుగా చేయబడుచుండవచ్చును. 1. తమను తాము ఉద్ధరించుకొను ప్రార్థన. 2. తమ కుటుంబక్షేమమును గూర్చిన ప్రార్థన యివి మొక్కుల రూపముగానూ ఉండును. ఈ విధముగా ఎవరి విశ్వాసమునుబట్టి వారి ప్రార్థనలు జరుగుచుండును. **నా ఆశయము మన ప్రార్థనలు (రోగనివారణా కేంద్రము) ఆశ్రమ భక్తుల శ్రేయస్సునకేగాక ఆశ్రమ శ్రేయోభిలాషులందరి శ్రేయస్సును గూర్చియేగాక లోకములో అందరి శ్రేయమునుగూర్చి చేయుటే !**

శ్రీజయప్రకాశ్‌నారాయణగారు మన ఆశ్రమమునకు రెండుసార్లు వచ్చిరి. వారు దేశభక్తులు. ఆదర్శముగా జీవించువ్యక్తి. వారు అనారోగ్యముగా బొంబాయి అనుపత్రిలో నున్నట్లు తెలిసి – వారి ఆరోగ్యమును కోరుచు దైవమును ప్రార్థించుటే గాక బొంబాయిలోనున్న ఆశ్రమ భక్తురాలుకి వ్రాయగా, ఆమె వెళ్ళి చూచినందుకు ఆయన చాల సంతోషించిరని ఆమె వ్రాయగా నాకెంతయో ఆనందమయ్యెను. ఈ మనస్సు చాల తృప్తిచెందినది. అట్లేవారు ఎంత దూరమునున్నను మనము మనః పూర్వకముగా చేసిన ప్రార్థనలు ఫలించి వారి శరీరారోగ్యము కుదుటపడును. నాకున్న విశ్వాసమే మీ అందరికి ఉండవలయును. ప్రతిఫలాపేక్షలేక చేయు సేవగాని ప్రార్థనగాని వారికి – మనకు గూడా అధిక లాభమును చేకూర్చును. ఇట్టి చిన్న చిన్న అనుభవములతోనే నా నమ్మికలను దృఢము చేసికొందును. పొందేహక్కు అందరికిని ఉన్నది. గాని దానిని అనుభవనీయముగా ఆచరణలో పెట్టినపుడే సాధ్య మగును. దైవము కృపామయుడు. ఆయన తన భక్తుల సదాశయములను నెరవేర్చు టకే ఎదురుచూచుచుండును. గాన మీరందరూ నిస్వార్థ ప్రేమతో ఆయనను ప్రార్థించి కృతార్థులుగావలెనని నా కాంక్ష !

ఓం ఓం ఓం

---

విశ్వమంతటిని భగవంతునిగానో లేక ఆత్మగానో
చూడగలిగినవాడే ఆనందముగా, శాంతిగా జీవింపగలడు.
దుష్టునియందు కూడ భగవంతుని చూడవలయును.

# 77. మనస్సు కోతివంటిది

దేనికైనను స్థిరము ఉండవచ్చునుగాని మనస్సుకు మాత్రము స్థిర బుద్ధియుండదు. అది ఎల్లపుడు ఏదో విధమైన సంకల్పవికల్పములను చేయుచునే యుండును. కోతులకు స్థిరనివాస మున్నట్లు వినియుండలేదు. అవి ఆ చెట్టునుండి ఈ చెట్టునకు అటునుండి మరియొక చెట్టు మీదికి గెంతుచుండును. సరిగా మానవమనస్సు కూడ అట్లే పని చేయుచుండును.

మనస్సు మీదనే మానవుని ఆదర్శ జీవితము ఆధారపడియుండును. మాతృశ్రీ శారదాదేవి ఆదర్శజీవితమును గూర్చి మన రామారావు తరచుగా జ్ఞాపకము చేయుచుందురు. ఆమె యితరులలో ఎన్నడును చెడుచూడని మహిళ. జీవితోపయోగమైన గృహమును శుభ్రముచేయు చీపురుకట్టను గూడ ఆమె గౌరవభావముతోచూచెడివారని చెప్పుచుందురు. అట్లే ధర్మరాజు జీవితము ఆదర్శమైనది. ఒకసారి వారి గురువులు ధర్మరాజును దుర్యోధనుని ఉద్దేశించి రాజధానిలో సన్మార్గులెందరుండిరో దుర్మార్గులెందరుండిరో తెలిసికొని రమ్మని చెప్పిరట. ధర్మరాజునకు ఎక్కడ చూచినా సన్మార్గులే తప్ప దుర్మార్గు లెచ్చటనుకానరాలేదని చెప్పెనట. దుర్యోధనునకు నగరమంతయు శోధించినను ఒక్క సన్మార్గుడైనను కనిపించలేదని చెప్పెనట. దీనిని బట్టి **పచ్చకామెర్ల రోగికి సర్వము పచ్చగానే కనిపించునట్లు మనస్సులో దుర్మార్గపు ఆలోచనలున్న వారికి మంచి ఎచ్చట కనిపించును ? కనుక ఇది వినిన జ్ఞాపకార్థముగానైనను మీ మనస్సులను నిలకడయనునదిలేని మనస్సువలేగాక ఉత్తమమైన సన్మార్గము నన్వేషించుచు సృష్టికర్తయగు భగవంతుని చేరుటకు** అర్హతగలదానిగా మలచుకొని స్థిరమనస్సులగుదురుగాక ! స్థిరమైన మనస్సుగల వారి నుండి స్థిరమైన శాశ్వతమైనదియే వచ్చును.

హరిః ఓం తత్సత్

ఓం ఓం ఓం

---

ఇతరుల కష్టములను వారికి బదులు తమనే భరింపనిమ్ము
అని భగవంతుని మరల మరల ప్రార్థించువారు ధన్యులు.

# 78. సూర్యోదయ అస్తమయములు

సూర్యోదయ – అస్తమయములు రెండు దృశ్యములును చూచుటకు ఆకర్షణీయముగా మనోజ్ఞముగా నుండును. అయితే రెండింటికి భేదమున్నది. సూర్యోదయము. జడమయముగా నున్న ప్రకృతిని తట్టి మేల్కొల్పుచున్నది. సూర్యకిరణములు ఆయన రాకను సూచించుచున్నాయి. కొందరు నిద్ర మత్తులోనే యుందురు. కొందరు హాయిగా నిద్రించి లేచినందున ఎంతో ప్రశాంతమనస్కులుగా నుండుటవలన ఉదయ వాతావరణము అతిప్రశాంతముగా నుండి చాలమంది భక్తులు–తమ నిత్యానుష్ఠానములను పూజాపురస్కారాది దైవకార్యక్రమములలోను నిమగ్నులై యుందురు. **తెల్లవారుఝామున 3–4 గంటలు మెదలు సూర్యోదయకాలము వరకు ఆధ్యాత్మికాభివృద్ధికి అనువైన సమయము.** ఇక సూర్యాస్తమయము కడు సుందరమైనదే గాని ప్రజలు తమ పనిపాటలలో మునిగ హడావిడిగా అటుఇటు పరుగెత్తుచున్నట్లు నడుచుచుందురు. కారణము చీకటిపడినచో వారి పనులను చక్కబెట్టు కొనలేమను భయమే, అదియు నిజమేగదా; అట్టి వారి మనస్సు భగవంతునివైపు ఎట్లు వెళ్ళగలదు? అందుచేతనే మన పూర్వపు ఋషులు, భక్తవరేణ్యులు తమ సాధనానుష్ఠానములకు దైవధ్యానమునకు ప్రభాతసమయమునే ప్రధానముగా నిర్ణయించిరి. అందుచే **మానవులుగా జన్మించినవారు. తమస్సనెడి నిద్రనుండి సూర్యోదయాత్పూర్వమే మేల్కొని, పవిత్రమైన తలంపులతో తమ హృదయముల నింపుకొని బాహ్య సూర్యులకు మూల కారణమైన ఆంతరసూర్యతేజస్సును అనుభవింప అభ్యాసము చేయుదురుగాక !**

ఓం ఓం ఓం

---

తప్పంతయు తమదే అని తెలిసి కూడా,
యితరులను నిందించుటకు, హింసించుటకు
వంద మార్గములు వెదకు వారికి భగవంతుడు
సరియైన దృష్టిని ప్రసాదించుగాక అని ప్రార్థించుట మన కర్తవ్యము.

# 79. పవిత్రస్థల ప్రాముఖ్యము

మానవులకు – వారు నివసించు స్థలములకు అవినాభావ సంబంధముండును. ఈ పవిత్రస్థలముతో నాకే గాక ఆశ్రమమును ప్రేమించువారికి యిందలి ప్రశాంతతను అనుభవించకోరువారికిని దీనితో అట్లే అవినాభావ సంబంధ ముంచకోరువారికిని ఆశ్రమముతో అవినాభావ సంబంధ ముండును. నేడు బొబ్బిలిరాణీ శ్రీమతి సుభద్రా దేవిగారి జన్మదినము షష్ఠిపూర్తి కూడను. ఆమె కృష్ణ భక్తురాలు. ప్రతి సంవత్సరము ఆశ్రమం వచ్చి కొద్ది రోజులు ప్రశాంతముగ గడపి వెళ్లుచుందురు. ఆశ్రమమునకు ఆమె ఎన్నియో విధములుగా ఉపకారము చేయుచుందురు. "అంతా కృష్ణమయం" అనుపాట ఆమె స్వీయరచనయే. ఆమె రామ–కృష్ణ నామ సంకీర్తన ఏకాగ్రతగా చేయుచు యిచ్చుట భక్తులందరిచేత చేయించు క్షణములు నా కెంతయో ఆనందముగా నుండుటేగాదు, తన్మయత్వమును కలిగించు చుండును. అది అంతయు ఆమె ప్రగాఢభక్తిప్రభావము. భగవద్భక్తులు శారీరకముగా దగ్గరలేకున్నను, ఆమె మన మధ్య నున్నట్లే భావించుచుందును. ఆమె సంపూర్ణారోగ్యమును కోరుచూ ఇపుడు ముమ్మారు ప్రణవగానముతో భగవంతుని ప్రార్థించెదముగాక.

ఈ స్థల ప్రాముఖ్యమును గ్రహించినవారు, హరినామ సంకీర్తనానందముననుభ వించగలవారు, బాహ్యజగత్తులో నుండజాలరు. **ఆశ్రమంలో నివసించు పశువు కూడా బయటకు వెళ్ళుటకు యిష్టపడదు.** ఈ మధ్యలో ఆశ్రమ ముఖ్యభక్తుడు కోరినందున ఒక ఆవును కాకినాడ పంపుట జరిగినది. దానికి గేటుదాటుట ఇష్టము లేకపోయినను, ఎట్లో బలవంతముగా తీసుకువెళ్ళిరి. కాని ఆవు అచ్చట మేత మేయక పోవుటేగాక, పాలు యిచ్చుట తగ్గించినందున ఆయన తిరిగి దానిని పంపి వేసిరి. ఆశ్రమం చేరిన వెంటనే అది చురుకుగా నుండి, మేయుటయేగాక భారీగా పాలు యిచ్చుచున్నది. ఇది ఒక చక్కని ఉదాహరణకదా. **గుండ్రముగానున్న రంధ్ర ములో నలుచదరపు పలకయిమడనట్లు, నలుచదరపు రంధ్రములో గుండ్రని పలక యిమడనట్లు దైవ పరితాపనలేని స్వార్థపరులు ఈ ఆశ్రమంలో యిమడలేరు. అట్టివారు ఇచట నుండతగరు. దైవపరితాపనగల వారికే ఈ ఆశ్రమములో ఆశ్రయము దొరకును. భూత భవిష్యత్తు వర్తమాన కాలములు మూడింటికి ఈ ధర్మచట్టమే వర్తించునని ప్రతివారు గ్రహించి ఈ పవిత్రస్థల నివాసమునకు అర్హులుగా నుందురు గాక !** ఇది నేటి సందేశ సారాంశము.

ఓం ఓం ఓం

# 80. స్వయం సేవ ఫలితము

బద్ధకము సోమరితనము అనునవి మానవుని ముఖ్య శత్రువులు. అవి శరీరము నకు అధికపుష్టి - మనస్సునకు అధికనష్టము కలుగజేయును.

బయటనున్న నా వ్రాత బల్లమీద ఎన్నియో ఉత్తరములు, పుస్తకములు వగైరా నిండిపోయి యుండెను. లోపల గదిలోని బల్లమీద కూడ అట్లే పేరుకుపోయియున్నవి. అవి చూచినపుడు నా తలపు లిట్లుండును. ఇట్లే మానవ శరీరము మీద కూడ కొంచెము, కొంచెముగా మురికి చేరును. అది క్రమేణా లోనికి గూడ ప్రవేశించి, మనస్సును మలినము చేయును గదా ! బయటి మురికిని శుభ్రము చేయుట సులభమే గాని, లోపల చేరిన మాలిన్యమును శుభ్రము చేయుట, సర్దుబాటు చేయుట చాలకష్టము. అట్లు పేరుకుపోయియున్న కాగితములను అగ్నిలో ఆహుతి చేయవలె ననుకొంటిని. కాని అందులో కొన్ని అమూల్యనిధులు (ఆధ్యాత్మికప్రదమైనవి) నిక్షిప్తమైయున్నందున ఆ తలంపు విరమించితిని. అట్లే **మన తలంపులలో ఉన్నతమైన వాటిని గుర్తించి పదిలపరచుకొని, తక్కిన వాటిని ఆవలకి నెట్టి అనగా జ్ఞానాగ్నిలో దగ్ధమొనర్చవలెను.** ఒకనాడు ఓపికగా ఆ కాగితములను సర్దుచుండగా, వాటిలో ఒక నోట్‌బుక్కు దొరికెను. అది తెరచిచూడ "వ్యక్తిగతసేవ" అను చక్కని చిన్ని వ్యాసము వ్రాయబడియున్నది. అందు 1953లో జరిగిన ఒక సంఘటనను గూర్చి వివరింపబడెను. ఒకనాడు ఒక భక్తుడు తన బిడ్డతో నావద్దకు వచ్చి ఆ బిడ్డ విపరీత మైన తలనొప్పితో బాధపడుచుండెనని చెప్పగా–నేను ఆ బిడ్డను అమ్మాజీ వద్దకు తీసుకువెళ్ళకపోతివా అంటిని గాని మరల నా కిట్లనిపించెను. ఈ చిన్న విషయము నకు వారి వద్దకేల పంపవలెను ? నేను ఆ బాధను నివృత్తి చేయవచ్చును గదా అని తలంచి, కొంచెము అమృతాంజనమును తండ్రికిచ్చి రుద్దించవలె నను కొంటినిగాని, నేనే స్వయముగా ఆ పని చేసి ఆనందము పొందవలెనని తలంచి అమృతాంజనమును స్వయముగా ఆ బిడ్డ తలకు రుద్దగా, వెంటనే ఆమె తలనొప్పి తగ్గి ఆనందముగా నుండుట చూచితిని. ఇక నా ఆనందమునకు మేరయేలేదు. స్వయముగా చేసిన సేవ యొక్క ఫలితానంద మెట్టిదో అది చేసినవారికే తెలియగలదు. ఇతరులచే ఆ సేవచేయించినచో అట్టి ఆనందము మనకు లభించునా ? నా బాల్యస్నేహితులగు శ్రీ వి.వి.గిరి గారు ఒకసారి నాకిట్లు వ్రాసిరి "మీరు ఏది తాకినను, తలంచినను అది శుభప్రదమగును." వారి పవిత్ర భావనకు నా అభివాదములు. **ఏ ఆశ్రమ వాసుడైనను, బద్ధకము, సోమరితనములను దరిచేరనీయక చురుకుగా సమర్థవంత ముగా కార్యనిర్వహణ గావించి కృతకృత్యులు గావలెననికోరుచుంటిని.**

ఓం ఓం ఓం

## 81. ఆత్మారాముడు

నా చిన్న వయస్సులో శ్రీ సీతారామాంజనేయములో ఒక పద్యమును చదివితిని. దాని సారాంశము, రాముడనగా దశరథరాముడు కాదు. భక్తుల హృదయమందిరము లలో విహరించు ఆత్మారాముడు. "రామో ధర్మరూపకః" ధర్మమే రామరూపములో అవతరించెనట. ఎంత అద్భుతము ! రేపు ధర్మరాజు పట్టాభిషేకము రోజు. ఆయన అజాత శత్రువు. అనగా అతనికి శత్రువు అను భావము లేదట. అట్లే రేపు క్రీస్తు జన్మదినము. మన రామారావుగారి జన్మదినము కూడ రేపే. వారు ఆశ్రమమునకు భగవంతుడిచ్చిన గొప్పబహుమతి. వారిని గురించి వారి ఎదుట చెప్పుటకు యిష్ట పడరు. అది వారి సహజసద్గుణము. క్రీస్తు జన్మదినము అనగా క్రిస్టమస్ జ్ఞాపకార్థముగా మనము స్వచ్ఛంద ప్రేమతత్త్వము నలవరచుకొనుటే గాక ఆ మహ నీయుడు తోటి మానవులయందు ముఖ్యముగా తనను శిలువ వేయుచున్న వారి ఎడల చూపిన ప్రేమ కరుణలను ఆదర్శముగా చేసుకొని మన ద్వారా ఆ కరుణా మయుని ప్రేమను అవిరళముగా ప్రవహింపచేయుదుము గాక ! **దైవజ్ఞప్తితో పైకి వెళ్లవచ్చును మరపుతో క్రిందికి దిగజారవచ్చును.** వైకుంఠపాళి ఆట చాలమందికి తెలసియుండును. ఆ ఆట మానవ జీవితాభివృద్ధికి, అధోగతిలోపడుటకు ఉదాహరణ ముతో మంచి గుణపాఠమువంటిది. దానినే "పరమపదసోపానపటము" అని కూడ అందురు. మంచిభావములుగల మానవుడు వైకుంఠపాళి యందుగల నిచ్చెనలవలె పైపైకి వెళ్లును. చివరకు పరమపదమును చేరును.

ఇక అసూయ ద్వేషములు గల మానవుడు – ఆట ప్రారంభమునుండియు, మొదట చిన్నపాముల నోటబడి దిగుచు, మరల చిన్న నిచ్చెనల నెక్కప్రయత్నించియు, చివరకు ఆ పటమునందు గల పెద్దపాము నోటిలో పడిపోయి, పూర్తిగా క్రిందికి దిగజారి పోవును. వైకుంఠపాళి ఆటలో గల అర్థము. **మానవజీవితము సుఖదుఃఖ సమన్వయము. కనుక ఈ పవిత్రదినజ్ఞాపకార్థముగా ఆ ప్రభువు ప్రేమను ఆధారముగా చేసికొని పరమపదము చేరి జన్మరహితులగుదురు గాక !**

ఓం ఓం ఓం

---

క్రీస్తు ప్రభువును శిలువ వేసిన క్రూరసైనికులు తదుపరి అష్టకష్టములను
అనుభవించిరి. 'ఎంత విత్తితే అంతే ఫలిత' మను
లోకోక్తి జ్ఞప్తి యుందుండును గాక !

# 82. పువ్వులను కోయరాదు

ఈనాటి ఉదయము శివాలయమునకు వెళ్లి అచ్చట నున్న సిమెంటు సోఫాలో కూర్చుని ఆ ప్రశాంత వాతావరణములో బాలసూర్యుని సువర్ణకాంతులు వీక్షించు చుండ మనస్సు ఆహ్లాదకరముగా నుండెను. శివలింగమును బాహ్యాపుష్పములతోను పత్రితోను పూజించుటతోనే మానవులు తృప్తి చెందుచుందురు. ఈ బాహ్యాపూజలకు పరమేశ్వరుడు ఆనందించుచుండెనా ? పువ్వులను కోయరాదు అని బోర్డు వ్రాయంచి ఆలయంలో పెట్టించితిని గాని దానిని ఎందరు భక్తులు గమనించుచుండిరి ? వారి తాపత్రయము ఎట్లయినను పూవులను సేకరించి వాటి పూజతో భగవదనుగ్రహమును పొందవలయు ననియే. భగవంతుడు మనకు నేత్రము లిచ్చినందుకు పుష్పములను చూచి ఆనందించవలయునేగాని వాటిని త్రుంచరాదు. మన బిడ్డలయందు మన కెంత ప్రేమయుండునో అట్లే వికసించిన పుష్పములతో తల్లి చెట్లు అనుబంధమున్నది. అవి ఆహ్లాదముగా కనిపించుచుండును. భగవంతుడు మన నుండి ఆశించునది అంతరపూజ గాన మానవుల పరిశుద్ధహృదయములయందు ఆయనను సుప్రతిష్ఠించు కొని పూజ నేర్చినవారు ధన్యజీవులు.

జార్జి బెర్నాడుషాకు మంచి పూలవన ముండెడిదట. కాని ప్రతిదినము వాటిని చూచి ఆనందించుటేగాని, వాటిని తాకేవారు గారట. ఒకనాడు ఒక యువతి ఆయన గదిలోనికి వచ్చి యిట్లు అడిగెనట.

అయ్యా ! మీ కింత పూలవన మున్నదిగదా ! కొన్ని గులాబీలను కోసి మీ బల్ల మీద గ్లాసులో నేల పెట్టుకొనరు ? అందు కాయన యిట్లు పలికిరట.

అమ్మా : **నీ పిల్లల తలలు త్రుంచి నీ గదిలో బల్లమీద నుంచినచో నీవు ఆనందించగలవా ? పూలచెట్లకు గూడ ప్రాణమున్నది. వాటినుండి మొలకెత్తు మొగ్గలతో, పూవులతో అవి ఆనందముగా నుండు నను విషయమును మీరేల గ్రహించరు** ? ఆయన సమాధానముతో ఆ స్త్రీ సిగ్గుపడి – భీతితో తలవంచుకొనెనట. చేతికందినన్ని పూలుకోయు వారి కిదియొక గుణపాఠము కాదా ?

ఓం ఓం ఓం

# 83. చేయవలసిన దేమియును లేదు

ఒక్కొక్కసారి పరిపూర్ణమైన స్థితిలో నున్నపుడు నేను యిది వరకు చేసియున్నది గాని – యిపుడు చేయుచున్నదిగాని, ఇకముందు చేయబోవలసిన పనులు గాని యేమియులేనట్లే తోచుచుండును. ఆత్మభావనతో వీక్షించినచో ఈ ఆశ్రమస్థాపనలు, ఈ నామరూపములు అన్నియు భ్రమయేగదా నేను ఎన్నడూ ఏ ఆశ్రమము స్థాపించ లేదా ? అని నన్ను నేను ప్రశ్నించుకొందును. అపుడు సమాధానము యిట్లు వచ్చు చుండును. ఆత్మ అద్వితీయమైనది, పరిపూర్ణమయినది, మలినరహితమైనది. అది ఎటుల ఈ ఆశ్రమమును స్థాపించగలదు ? **ఆత్మభావనతో జీవించెడి వారి జీవితములు పరమపావనమైనవి గదా !**

**ద్వంద్వములోనే – మాయలోనే సృష్టి అంతయు కల్పితమగుచుండెను. మాయాతీతమైన ఆరూఢావస్థయే స్థిరమైనది.నిత్యత్వము నొసంగెడిది. అది దేశకాల నిమిత్తములకు అతీతమైనది. అట్టి స్థితిలో ఈ ఆశ్రమము లెక్కడ ? అనుబంధము లెక్కడ ?**

గంగానది వంటి మహాప్రవాహములో ఎన్నియో దుంగలు కొంతమేరకు కలసి కొట్టుకొనుచు వచ్చి, తిరిగి ఆ ప్రవాహవేగమునకే విడివిడిగా వేరువేరయిపోవుచు కొట్టుకొని పోవుచుండును. "యదా యదా కాష్ఠంచ నదీనాం బహవోంబువేగా" అట్లే వివిధరకముల మానవులు – యిట్టి ఆశ్రమములయందు తీర్థయాత్రాదులలోను కలసి తిరుగుచు వారివారి స్థలములు రాగానే విడిపోవుచుందురు.

ఈ శరీరము ఓంకార నామముతో ఈ ఆశ్రమములు స్థాపించి యుండవచ్చును. గాని ఇది శాశ్వతముగా నుండదు. అప్పుడు ఓంకారము ఆత్మరూపముగా బహిర్గతమై శాశ్వతస్థితి నొందును. అట్టి నిత్యమైన, అమరమైన ఆ సచ్చిదానంద స్వరూపమునకు మరల మరల ప్రణామములు.

ఓం ఓం ఓం

---

కొంచెమును గొప్పగా చేసి చెప్పుట (అనగా అతిశయోక్తి)
నేరము కాకపోయినను మచ్చ, అసత్యము కూడ అగును.

# 84. స్వభావము

ఇపుడు చదువబడిన అధ్యాయములలో "అపజయమును ఒప్పుకొనినవాడు ఓడిపోయినట్లే" ఇది చక్కని జీవితోపయోగమైన వాక్యము. అసలు అపజయమనేది ఎప్పుడు వచ్చును. భగవంతునియందు విశ్వాసము – ఆత్మస్థైర్యము గల వారికి అపజయము ఆమడదూరములోనే నిలచిపోవును. వారి వారి స్వభావములను బట్టి జయాపజయములకు లోనగుచుందురు. ఒక సాధువు ఒక నదీ తీరమున స్నానము చేయుచుండగా, ఒక తేలు నీటిలో పడి కొట్టుకొనిపోవుచుండుట చూచి, దానిని రక్షించబూని ఒక ఆకుపై పాకించి నేల విడువ ప్రయత్నించగా ఆ తేలు సాధువును కుట్టి మరల నీటిలో పడినది. మరల పైకి తీయబోవగా తేలు మరల సాధువును కుట్టెను. ఇదంతయు చూచుచున్న ఒక వ్యక్తి ఆ సాధువుతో "అది మిమ్ములను కుట్టుచున్నను దానిని మీరేల రక్షింపజూచుచుంటి"రని ప్రశ్నించగా ఆ సాధువు "రక్షించుట నా స్వభావము. కుట్టుట తేలు స్వభావము" అని చెప్పెనట. కనుక **ఎవరి స్వభావములను మనము మార్చజాలము. ఎవరు తప్పు చేసినను క్షమించుట సాధువుల స్వభావముగా నుండవలెను.** క్రీస్తు ప్రభువు ఒకరి ప్రశ్నకు సమాధానముగా తప్పుచేసిన వారిని 70 సార్లు క్షమించవచ్చునని చెప్పెనట. నా ఆశయము కూడ అదియే. **ఆశ్రమంలో నివసించువారు – తమ లోపములను తామే సవరించు కొనుచు– పై నుండి వచ్చువారికి ఆదర్శముగా నున్నచో–ఇక క్షమించుటయను మాటకు అవకాశమెచ్చటుండును. కనుక మీరందరూ వివేకవంతులుగా నుండి – దీనిని ఆదర్శవంతమైన ఆశ్రమముగా రూపొందించమని కోరుచుందును. మీ వృద్ధియే ఆశ్రమవృద్ధి యని నా దృఢ విశ్వాసము.**

ఓం ఓం ఓం

---

అమూల్యమైన సర్వవ్యాపకత్వ, సర్వజ్ఞత్వ,
సర్వశక్తిత్వ లక్షణములతో కూడిన మన సంపత్తు
ఏదో ఒక పేరుతో దుర్వ్యయము చేసి వ్యర్థం చేయకుందుముగాక.

# 85. మూడు బంగారు బొమ్మలు

ఎవరు ఈ ప్రార్థనసభలో విన్న మంచి మాటలను ఒక చెవితో విని - మరియొక చెవి ద్వారా వదలి వేయుదురో అట్టివారు వినియు విననట్టి వారే యగుదురు. విన్న వాటిని హృదయములోనికి వెళ్ళనిచ్చినచో అవి సార్థకమగును. దీనికి ఒక ఉదాహరణము చెప్పుచుంటిని. ఒక మహారాజు కొలువుకూటములోనికి ఒక విజ్ఞుడు 3 బంగారు బొమ్మలు తెచ్చెను. అవి మూడును చూచుటకు ఒకే రకముగా నున్నవి. ఒకే బరువుగా నుండెను. చూచువారికి వాటి భేదము ఏమాత్రము తెలియుట లేదు. కాని వాటిని తెచ్చినాతడు ఆ బొమ్మలకు వేరు వేరు ధరలు కట్టమని అడిగెను.

ఆ సభలో నున్న మంత్రులు, ఆస్థానపండితులు మొదలగు పెద్దలందరు, ఎన్ని విధముల వాటిని పరిశోధించినను, భేదము కనిపెట్టజాలక మూడు బొమ్మలు ఒకే ఖరీదు చేయునని చెప్పిరి. అపుడు రాజు విచారించి జ్ఞానియైన తన పూర్వపు మంత్రిని కబురు చేసెను. ఆయన వచ్చి ఆ బొమ్మలను పరిశీలించి ఒక బొమ్మను తీసి యిది ఒక గుడ్డిగవ్వ విలువైనను చెయ్యదని చెప్పెను. మరియొక బొమ్మను తీసి యిది ఒక వెయ్యిరూప్యములు ఖరీదు చేయునని చెప్పెను. ఇక 3వ బొమ్మను తీసి యిది కోటి రూప్యముల విలువ చేయునని చెప్పగా ఆ సభలోనున్న వారందరూ ఆశ్చర్యపడుచుండ ఆయన ఇట్లు వివరించెను.

1. మొదటిబొమ్మకు ఒక చెవినుండి మరియొక చెవికి రంధ్రముండుట వలన ఒకచెవితో విన్న సద్వాక్యములను మరియొక చెవి ద్వారా వదలి వేయు మానవుని వంటిదని చెప్పెను.

2. రెండవ బొమ్మకు చెవిలోనుండి నోటిలోనికి రంధ్రమున్నదిగావున మంచి మాటలను విన్న వాటిని మాటలద్వారా మరియొకరికి చెప్పి వదలివేయువాని వంటిది గాన వెయ్యి రూప్యములు ఖరీదునకు అర్హత కలిగియున్నదని చెప్పెను.

3. ఇక మూడవ బొమ్మకు చెవినుండి హృదయములోనికి రంధ్రమున్నది కాన- విన్న మంచి వాక్యములను - తన జ్ఞానపటిమతో విన్నవాటిని హృదయము లోనికి నింపుకొని తమలో వెలుంగుచున్న కోటిసూర్యప్రకాశవంతమైన తేజస్సు ననుభవించు మానవుల వంటిది గాని ఇది కోటి రూప్యములకిమ్మత్తేగాదు, విలువ కట్టజాలనంత బొమ్మయని చెప్పెను.

కనుక **మనము మొదటి బొమ్మవలె విన్న భగవద్విషయములు మరియొక చెవి ద్వారా వదలివేయుచుంటిమా ? లేక రెండవ బొమ్మవలె విన్న సద్వాక్యములు పదిమందికి చెప్పి కొంతయైనను వినియోగపడుచుంటిమా ? లేక 3వ బొమ్మవలె మనము వినునవన్నియు చక్కగా అవగాహన చేసుకొని - హృదయములో శాశ్వత మైన వాటినిగా పదిలపరచుకొనుచుంటిమా? యని ఎవరంతట వారే వారి హృదయ ములను పరీక్షించుకొని, మూడవ బొమ్మవలె నుండుటకే ప్రయత్నించినచో మానవ జీవితపరమావధి తెలిసికొని తరించు వారగుదురు.** ఇపుడు శాంతి ప్రార్థనాపఠన ముతో సత్సంగము పూర్తియగును.

ఓం ఓం ఓం

# 86. అగ్ని జ్వాలలు

నేడు కొండ వారకు వెళ్లగా – అక్కడ షిరిడీయను స్థలములో కూలీలు ముళ్ల తుప్పలను, ఎండుఆకులు, గడ్డి మొదలగు చెత్తను తగులబెట్టుచుండిరి. అదే సమయ మున నేను అచ్చటకు వెళ్లుటచే ఆ పెద్దమంటను చూచితిని. అపుడు గాలికూడ హెచ్చుగా నుండుటచే మంటయింకను పైపైకి లేచుచు ముళ్ళకంపలు వగైరాలు పెళపెళ శబ్దముతో కాలుచుండెను.

అపుడు తలవని తలంపుగా నాకీ ఆలోచన వచ్చెను. అహంకారమనెడు దానిని ఆ అగ్నిలో పడవేసి కాల్చివేసినచో ఎంత ఆనందముగా నుండును. మరల మరియొక తలంపు ఏమనగా ఈ బాహ్య అగ్నిలో అహంకారమమకారములు కాల్చబడవు. శరీరము వంటి నామరూపములున్నవే ఈ బాహ్య అగ్నిలో దహింపబడును. ఏ వస్తువునైనను కాల్చిబూడిదగా చేయగలదు కాని, అహంకార, మమకారాది తదితర గుణములకు రూపములేదు గాన ఈ అగ్ని వాటిని కాల్చజాలక పోవుటయేగాక, తాకనైనను తాకజాలదు. అట్లయిన ఆ గుణములను దహింపచేయుట ఎట్లు? కామ క్రోధ మద మాత్సర్యములు, అహంకార, మమకారాదులను దహింపగలదొక్కటే గలదనిపించెను. అది ఏది ? “అదియే జ్ఞానాగ్ని” ! దాని స్వరూపమెట్టిది? కోటి సూర్యదివ్యతేజస్వరూపము. అట్టి జ్ఞానాగ్నిచేతనే పై చెప్పిన గుణములన్నియు యిప్పుడప్పుడనక నిరంతరము దహింపచేయవలయును దీని సారమేమనగా – **మోక్షమును కోరువారు గుణరహితులుగా నుండుటకు సాధనచేయవలయును. గుణము లేదా స్వభావము అనునది చిన్నదైనను, వెంటనే గుర్తించి అది వృద్ధి చెంద కుండా నిశ్శేషముగా దహించివేయవలెను. గుణములకు అతీతుడైన వాడే మోక్ష సామ్రాజ్యము పొందిన వాడగును.** చెడుగుణముల జాడను – సద్గుణములే పట్టుకొన గలవు. జ్ఞానులజాడను జ్ఞానులైనవారే కనుగొనగలరు. దొంగల జాడను దొంగయైన వాడే పట్టుకొనగలడు. గాన మనలో తలయెత్తుతున్న స్వభావము, గుణములను మనమే పట్టుకొని శిక్షించవలెను. అపుడే భయరహితులముగా నుండి దైవాధీన మనుష్యులముగా నుందుము.

ఓం ఓం ఓం

# 87. మరణ స్మృతి

నా కాలము అతి విలువైనది. ఈ వర్తమాన కాలములో అందరి మనస్సులను దైవ స్మృతితో నింపవలయుననే భావముతో ఆ దివ్యసన్నిధికి స్వాగతమని చెప్పు చుందును. దైవస్మృతి యున్నచోట, మృత్యుభయముండదు. మృత్యువు సమీపించు చున్నదని తలంపుగలవారిని, ఎట్టి పాపపు తలంపులు దరిచేరజాలవు. మరణస్మృతి వలన మరియొక లాభము కూడా కలదు. దానివలన మృత్యుభయమును జయించి, సహజముగానే మృత్యువును ఆహ్వానించగల శక్తి ధైర్యము కలుగును. ఏకనాథ మహారాజును గూర్చిన చక్కని కథ యొకటి కలదు.

ఒక దినమున ఒక గృహస్థుడాయను సమీపించి "మహారాజా ఎంతమంచి జీవితము! మీ కెన్నడును కోపము రాదే ? ఎవరితోడను వివాదములు, కలహములు కలుగవే? తమరిలో ఎంతయో ప్రేమ, శాంతియు, పవిత్రతయు గలవు. మా జీవిత ములు అట్లేలయుండుట లేదు" అని అడుగగా ఏకనాథుడిట్లు చెప్పెను. "నా విషయము అట్లుంచుము. ఇక నీవు ఏడు దినములలో మరణింతువు" అని చెప్పెను. అపుడావ్యక్తి ఇట్టి మహనీయుని మాటలు అబద్ధమని ఎట్లనుకొనగలడు? ఆ గృహస్థ శీఘ్రముగా యిల్లుచేరికొని అవసాన కాలమునకు సంబంధించిన వ్యవహారములను చక్కబెట్టుకొనజొచ్చెను. జబ్బుచేసి మంచమెక్కుట జరిగెను. అట్లు ఆరుదినములు గడిచినవి. ఏడవ దినమున ఏకనాథుడు అతని యింటికి వచ్చి "ఎట్లుంటి వని" రోగిని ప్రశ్నించెను. ఆ వ్యక్తి ఇక పోవుచుంటి నని చెప్పగా ! ఏకనాథుడాతనితో" "ఈ ఆరు దినములలో నీవెంత పాపము చేసితివి? ఎన్ని చెడు తలంపులు నీ మనస్సు లోనికి వచ్చినవి" అని ప్రశ్నించగా ఆ ఆసన్నమరణుడు యిట్లనెను స్వామీ పాపపు తలంపులు కలుగుటకు సమయమే లేదు. తెరపి లేకుండా మృత్యుదేవతయే నిలచి యుంటున్నది. అప్పుడు ఏకనాథుడు డాతనితో– నా జీవితము,పాపరహితమై, శాంతి మయముగా ఎందుకున్నదో యిప్పుడు తెలిసినదా ? మరణ మను పెద్దపులి మన ఎదుట నుండగా పాపములు చెడుతలంపులెట్లు కలుగును ? మరణమును గూర్చిన నిరంతరస్మృతి–పాపవిముక్తికి తరుణోపాయము. **జీవితము క్షణభంగుర మైనది. అస్థిరమైన దాని కొరకు తాపత్రయమేల? శరీర భ్రమలేకుండుటే జీవన్ముక్తి. శ్రీ ఏకనాథులవారి సుబోధకవాక్యములు చరితార్థమైనవి గాన, వాటి అర్థమును గ్రహించి ధన్యజీవులు కావలయును.**

ఓం ఓం ఓం

# 88. కృషితో నాస్తి దుర్భిక్షమ్

మానవజీవితములలో కృషి అనునది అనేక విధముల ఫలించును. ఇప్పుడు 3 రకములైన చక్కని సూక్తులు వివరింపబడుచున్నవి. 1. కృషితో నాస్తిదుర్భిక్షమ్ 2. జపతో నాస్తి పాతకమ్ 3. విద్యతో నాస్తి అజ్ఞతా - ఈ మూడు వాక్యముల అర్థము తెలిసి ఎవరు ఏ రకము కృషిచేసిన ఆ రకమైన అభివృద్ధిని చెందుదురు.

1. కృషితో నాస్తి దుర్భిక్షమ్–అన్నింటికి మూలము కృషి. ఒకరు తమకు గల ఆ శక్తినిబట్టి పూలవనములనో, పండ్లతోటలనో, లేక ఆహార ధాన్యములనో వారి స్వయంకృషి బట్టి అభివృద్ధిగా పండించుకొనుచు అధిక లాభమును పొందుచుందురు. అవి ఇతరులకును తోడ్పడును. గాన ఇక దుర్భిక్షమునకు తావెక్కడ ?

2. జపతో నాస్తి పాతకమ్ – మరియొక రకమువారు నిరంతరము హరినామ మును దీక్షతో వేలానవేలు, లక్షలాది లక్షలుగా, కోటానుకోట్లు పట్టువిడువని కృషితో జపించుచుందురు. అట్టివారి చెంతకు కాదుగదా – ఆ పరిసర ప్రాంతములకు కూడా పాపములు, తాపములు, భూతములు దరిచేరజాలవు సరిగదా అట్టి కృషి జరుగుచున్న స్థలము పవిత్ర పుణ్యభూమిగా మారిపోవును.

3. విద్యతో నాస్తి అజ్ఞతా– మానవునికి విద్యవలన వివేకము దానివలన జ్ఞానము లభించును. జ్ఞాని చేయు సత్కార్యములు సమర్ధవంతముగాను, పరోపకార యుతముగానూ ఉండును. విద్య అనగా పాఠశాలలు, లేదా విశ్వవిద్యాలయాలలో చదివి పట్టభద్రులు కావచ్చును. వారి అట్టి విద్య స్వంత లాభమునకే పరిమితమై యుండరాదు. విద్యతో వచ్చిన విజ్ఞతవలన తమలోనున్న అజ్ఞానమును, స్వార్థ మును విడిచి, సుజ్ఞానమును పెంపుచేసి పలువుర అభివృద్ధికి తోడ్పడినపుడే వారు నేర్చిన విద్య నిజమైన విద్యగా ప్రకాశించును. అట్టి విద్యావంతులందరికి అజ్ఞత యనునది ఎట్లు చేరగలదు. కనుక **మీ కృషి, సాధనలనుబట్టి పై మూడు విధములుగా కృషి చేసి దేశమునకే కాక ప్రపంచమునకే ఆదర్శవంతులుగా మనుదురుగాక !**

ఓం ఓం ఓం

## 89. వజ్రోత్సవము

త్వరలో ఆశ్రమ వజ్రోత్సవము రానున్నది. ఈ శరీరముచే శాంతి ఆశ్రమము స్థాపించినది నేనేనా ? కాదు కాదు. భక్తవత్సలుడగు పరమాత్మయే ఈ ఘనకార్యము నొనర్చెను. ఇది ముమ్మాటికి సత్యము.

నాలో ఒక్కొక్కసారి సాగరతరంగములవలె ఆలోచనలు వచ్చుచుండును. ఈ మధ్య తరచు ఒక వెఱ్ఱి ఆలోచన వచ్చుచున్నది. ఈ నా శరీరము వదలివేసిన భక్తుల అభివృద్ధికి యింకను అధికముగ సహాయపడగలనా ? లేక జీవించి యుండి–డా. పిచ్చయ్యగారు నుడివినట్లు – మౌనముగా నుండి అధికముగా తోడ్పడగలనా? దైవవిధిముందు మనశక్తి ఎంత ? మనము ఏదైనను సాధింపవలయు నన్నచో ఏనుగులు, సింహములను వేటాడినట్లుండవలయునుగాని, చీమలను వేటాడి నట్లు అల్పముగా నుండరాదు. **నాలోఉద్భవించుచున్న భావనలు ఎదుట వారి మనస్సులను స్పందింప చేయవలయును.** ప్రతి సం॥ జన్మదినమునకు శ్రీ విశ్వనాథాలయమున లక్షపత్రిపూజ జరుగుచున్నది. ఈ సం॥ ఆశ్రమ స్థాపన 60 సం॥ల జ్ఞాపకార్థముగా కోటిపత్రిపూజ ఏల జరుపరాదు. అను ఆలోచన వచ్చినది. ఆశ్రమవాసులు నా అభిప్రాయమును బలపరచిరి. వారు తలంచినట్లు 60 అడుగుల శాంతిజ్యోతి స్తంభ నిర్మాణము వగైరాలు ఆశ్రమం వచ్చి చూచిన వారికే ఆనందము నిచ్చి తోడ్పడును గాని, కోటిపత్రిపూజ ఆశ్రమాభివృద్ధికేగాక, లోకములో అందరి శాంతికి తోడ్పడును.

నా షష్టిపూర్తికి–భక్తులందరూ ఆనందోత్సాహముతో కోటిపత్రి పూజచేసినపుడు పూర్ణాహుతిరోజున విరివిగా అన్నదానము పూర్తి అయి తర్వాత దేవతలు ఆనందించిరా అన్నట్లు పై నుండి వర్షధారలు జనవరి నెలలో కురియుట చూచి ఆశ్చర్యమయ్యెను. నా ఆశ్రమ జీవితములో అదియొక పరమపవిత్రమైన దినముగా భావించితిని. **ఇట్టి స్వీయ అనుభవములు చెప్పుచుండుట మీ అందరి ఆధ్యాత్మికాభివృద్ధికి, ఆత్మవిశ్వాసమునకు తోడ్పడుననియే ! భగవంతుడు మిమ్ము శాంతితో చూచుగాక !**

ఓం ఓం ఓం

---

దైవ సాక్షాత్కార దృశ్యము ననుభవించిన పిమ్మట చేయునది గాని,
చేయకపోవునది గాని ఏమియు లేదు.

## ౧౦. సేవానుబంధము

మన శ్రమ, కృషిని బట్టియే పంటను పొందగలము. అవిరళకృషితో సాధించ లేని దేమియును లేదు. అట్లే అధికముగా అభివృద్ధి చెందవలయునను కాంక్షగలవారు తమ స్వయంకృషితో లబ్ధిని పొందగలరు. నా హృదయనివాసి యగు భగవంతుడే- మీ హృదయములయందునున్నాడు. నా సాధన గట్టి కృషివలన నేను దైవసన్నిధిని అనుభవింపగలుగుచున్నాను. ఒక లక్ష్యము మీద సాధన చేసినచో అది లక్షణముగా నెరవేరును. నేను ఆశించినది పొందలేదు. నా ఆవేదన అదియే. మన డాక్టరు పిచ్చయ్యగారు నాకు యిచ్చిన ముఖ్యసలహా సదా జ్ఞప్తికి వచ్చును. "స్వామీజీ! మీరు చెప్పుచున్న మాటలు మీ వద్దనున్న వారికి మాత్రమే లాభించును. కాని మీరు మౌనములో చేసిన ధ్యానఫలితము లోకములోని వారందరికి తోడ్పడును." నా స్వభావములో ఎవరినుండియైనను, ఏదో ఒకటి నేర్చుకొనుటకే యత్నించు చుందును. డా. పిచ్చయ్యగారు ఒకరోజున ఈ శరీరము మృత్యువుతో పోరాడుతున్న సమయములో వార్త అందిన వెంటనే-ఆశ్రమమునకు వచ్చి వెంటనే కాకినాడ ఆసుపత్రికి తీసుకువెళ్లి, సకాలములో ఆపరేషను చేసి, ఈ శరీరములో ప్రాణమును నిలబెట్టి నాల్గుమాసములు తల్లివలె కాపాడిరి. రాత్రింబగళ్ళు ఆయన నా చెంత నుండి సేవ చేయుట చూచి కొంతమంది డాక్టర్లు, భక్తులు డాక్టరు గారు స్వామీజీకి ఏమి అయ్యేదరని అడుగుచుండెడివారు. దైవము నాకెంత సన్నిహితుడో - డా॥ పిచ్చియ్య గారు కూడా అంతే సన్నిహితుడు. **దైవప్రేరణ లేనిదే ఎవరు, ఎవరికిని స్వార్థరహితముగా సేవచేయలేరు. సేవ యనునది ప్రేమకు అన్వయము. భక్తి ప్రేమలతో చేయుసేవ అమిత ఫలదాయకము.** భగవంతుడు డా॥ పిచ్చయ్యగారిని వారి కుటుంబమును, శాంతి సుఖములతో జూచుగాక ! సేవచేయువాడు - సేవను పొందువాడు - సేవ యను పవిత్ర కార్యము అంతయు ఒక్కటే. అదియే దైవశక్తి!

ఓం శాంతి

---

సూర్యుడు తన తేజస్సు నెట్లు ప్రసరింపచేయునో
అట్లే నీవును నీ ఆనందమును, ఉత్సాహమును ప్రసరింపచేయుము, విచార,
దైన్యములను నీ లోపలనే ఉంచుకొని ఇతరులను సంతోషపెట్టవలయును.

## 91. అప్రమత్తత

ప్రమత్తత అనగా మరుపు. అజాగ్రత్త ఈ చిన్నమరుపే ఎన్నియో అనర్ధములకు కారణమగుచున్నది. మరుపు అనగా నిన్ను నీవు మరచుటయా ? – కాదు –నీలో నున్న దైవమును మరచుచుంటివి. నీ వెవరివో నిన్ను నీవు తెలిసికొనినప్పుడు, నీలో నున్న దైవమును తెలిసికొనగలవు. ప్రమత్తత లేని జ్ఞప్తితో ఆ సచ్చిదానంద స్వరూపుని దర్శించినచో, ఆనందములో తేలియాడెదవు.

దట్టమైన ఈ ప్రమత్తత యను కారుమబ్బు ఎవరినీ విడువదు. ఇది యొక మహాభూతము. జ్ఞానులను, అజ్ఞానులను, పండితులను, పామరులను, వారు వీరు అనక, ప్రతివారిని ఏదో ఒక సమయమునందు పట్టుకొని పీడించుచుండును. ఈ ప్రమత్తతకు – అతీతులుగా నుండువారే ఆరూఢులు. జీవన్ముక్తులు. ఈ మరుపు అనునది మనకు తెలియకుండగానే–మనలో ప్రవేశించి చిన్న ఊటగా, ఊట సెలయేరుగా మారి చివరకు గొప్ప ప్రవాహముగా మారి ఎవరికి ఆపుటకు వీలు లేనంతగా జలమయ ప్రవాహ మగునట్లు, రేపు అని గోడమీద వ్రాసి ప్రతిరోజు చదివినచో రేపుగానే కనబడునట్లు, ఈనాడు మరచితిమిగాని, రేపు మరువములే అను భ్రాంతిలో మనస్సును చిక్కుకొననీయక, నేడే అని వ్రాసికొని చదువగా చదువగా, అది యిప్పుడే ఏల చేయకూడదు అను పట్టుదల బయలుదేరి అది అభివృద్ధియై ప్రమత్తత యనుదానిని మొదలంట తృంచివేయును.

**ఆ ప్రమత్తతలేని మానవుడు నిత్యనూతన శక్తితో తేజోమయుడుగా మారి దైవ మును పొందుటకు అమితోత్సాహముతో నూతన మార్గమును కనుగొనుటలో నిమగ్నుడగును. అంతకంటె ఈ మానవ జన్మతరింపునకు ఏమి కావలయును?** కనుక ఈ సత్సంగములో పాల్గొన్న భక్తులందరూ ఈనాటి సందేశసారాంశముగా ప్రమత్తను దరిజేరనీయని చిత్తాప్రమత్తులుగా నుందురుగాక !

ఓం ఓం ఓం

---

జ్ఞాపకశక్తియు, మరపును భగవంతుని నుండియే కలుగుచున్నవి.
అందుచేత ఆయనను మరచుట అనునది లేదని గ్రహించి,
నిశ్చింతగా నుండవలయును.

## 92. దైవములో నడచుట

ఒకనాడు నేను శివాలయపు కొండవైపువెళ్లి తిరిగి వచ్చుచుండ అడుగడుగునా దైవసన్నిధిని అనుభవించాను. ప్రతి అడుగు వేయుచుండ దైవమే నాతోనుండి నడచుచుండె నను భావన వచ్చుటతో అమితోత్సాహము నొందితిని. ఆ భావన రాగానే- నేను భూమి మీద నడచుచున్నట్లు గాలిలో తేలి పరుగెత్తుచున్నట్లు అనిపించుటెంత అదృష్టము.

ఆహా ! లోకములోనున్న మానవులందరు నావలె, దైవముతో నడచుచున్నట్లు భావించినచో ఎంత ఆనందముగానుందురోగదా యనిపించెను. మరల నా మనస్సు ఇట్లు తర్కించసాగెను. "నీవొక్కడవే దైవముతో నడచుచుంటివని - యితరులు దైవముతో నడచుచున్నట్లు భావింపరని నీవెట్లు నిర్ధారించగలవు ? అహంకారము చాల హానికరమైనది సుమీ! నీ వొక్కడవే ఆ జ్ఞప్తి యందునుంటి ననుకొనుచుంటివా? అపుడప్పుడు నీవే దైవమును మరిచెడు క్షణములున్నవేమో? స్వీయపరీక్షచేసికొని, మరపులేని స్థితిని పొందప్రయత్నించుము." నా ఆంతర్య ప్రబోధమును విని నాలో తలెత్తిన "చిన్ని అహంకారము" మరుగై తలముడుచుకొని మాయమయ్యెను. సాధు సత్పురుషులకైనను నీవు నేను అనెడి అహం భేదభావనను నశింపచేయుట దుర్లభము గదా యనిపించెను. ఇదియొక జ్ఞానపూరితమైన గుణపాఠము. ఇట్లే **మానవులందరూ తమలోనున్న అహంకారగుణమును అభివృద్ధి చెందనీయక మొదటనే తృంచివేసినచో ఇక ప్రపంచములో అహం అనునదే క్రమంగా నశించిపోవునుగదా. కాని మాయ ప్రభావము చాల గట్టిది. మాయను జయించిన వారిని అహంకారము దరిచేరజాలదు. అహం నేను, నాది అను భ్రాంతిలేనివారు ధన్యులు. నావలె దైవసంతానమగు వారందరూ ఎల్లప్పుడు దైవముతోనే నడుచుచు గమ్యమును చేరెదరుగాక.**

ఓం ఓం ఓం

---

"పరమాత్మ ఇచటను, అచటను, అంతటనూ ఉన్నాడు.
ఆయన శాశ్వతముగా మనతో ఐక్యమయ్యే ఉన్నాడు" - అని
తెలుసుకొనుటే దైవసాక్షాత్కారము.

# 93. రూపుమాసిన అర్భుడు

మనము తీసుకొను ఆహారము తాత్కాలిక తృప్తినిచ్చుటే గాక కొంత శరీర పోషకముగను, రక్తముగా గూడమారును. అట్లే మానసికాహారము కూడా అనేక రకములుగా నుండును.

ప్రార్థన,ధ్యానము, నామసంకీర్తన ఇవన్నియు, వాటి శక్తి, పరిధినిబట్టి భక్తి తన్మయత్వము ఈ విధముగా దైవసాధన లన్నియు మనస్సుకి పుష్టి, తుష్టి నిచ్చెడి మంచి ఆహారములే. తమను తాము మరచి, దైవార్పితమైనపుడే స్థిరమైన ఆనందము అను ఆహారము మనస్సునకు అవసరము. ఇపుడు శ్రీ చైతన్యానందస్వామి కొన్ని ఉదాహరణములు చెప్పిరి. ఇవి ఒక భక్తుని ప్రశ్నలకు పూజాద్రవ్యముల సమాధాన ములు.

1.హారతి కర్పూరం "నేను భగభగమండుచు రూపములేకుండా హరించిపోయి నన్ను నేను భగవంతునికి అర్పించుకొనుచుంటిని. అట్లే మీరు కూడా దైవదర్శనము నకు వచ్చినపుడు మీలో నున్న అహంకార మమకారములను నానుండి వచ్చుచున్న వేడిలో భస్మముచేసి ధన్యతపొందుడని చెప్పునట. అట్లే 2. పుష్పములు తాము భగవంతుని కంఠహారములుగాను, పాదపూజలలోను తమ జీవితమును అర్పించు చుంటిమని చెప్పెనట. 3. అగరుబత్తి తాను భగవంతుని సన్నిధిలో వెలిగింపబడి సువాసనా పరిమళములనిచ్చును చివరకు రూపుమాసి పోవుచుంటినని చెప్పెనట. చివరకు 4. మంచి గంధపుచెక్క తనను ఎవరు ఎన్నిసార్లు అరగదీసినా సంతోష ముగా సుగంధమును స్వామికి అర్పించుకొంటినని చెప్పెనట. బుద్ధిమంతులకు ఒక మాటచాలును. పైవాటి సారాంశమును మీరందరూ గ్రహించియే యుందురు. అట్లే ఆ ధర్మఅనుష్ఠాన పరులగు శ్రీసనకా రామారావుగారు తమను తాము మరచి సదా ఆశ్రమాభివృద్ధియే భావించుచున్నట్లుంది. ఆయన భావన నా కెంతయో తృప్తి నిచ్చును. వృక్షము తాను ఎండలో నుండియు మనకు చల్లని నీడనిచ్చుచున్నట్లు శాంతి ఆశ్రమము ఎన్నియో వ్యయప్రయాసలకోర్చుకొని దైవపిపాసాపరులకు స్థానము నిచ్చుచున్నది. కనుక యిందు నివసించు వారు తమ స్థానములను భద్రముగా వినియోగించుకొందురుగాక.

ఓం ఓం ఓం

# 94. మానవసేవయే - మాధవ సేవ

సత్సంగ భక్తులకు దైవసన్నిధి ననుభవించుటకు ఆహ్వానించుట నా యలవాటు. నేననుభవించుచున్నది. నా చెంతకు వచ్చువారు కూడా అనుభవించవలెనని కోరుట సహజము. కాని నా కోరికను అభిలషించువారు బహు అరుదుగా నుందురు. ఏదైనను **దైవసన్నిధి ననుభవించుటకు పరిశుద్ధ హృదయులు మాత్రమే అర్హులుగా నుందురు.** యివి నా మాటలుగావు. దైవ చట్టములు, హృదయ పవిత్రత-నిస్వార్థ ముతో చేయు సేవగాని, ప్రార్థనగాని చేసినవారు దైవమునకు అతిసన్నిహితులు, దైవనివాసార్హులనుటలో నెట్టి సందేహములేదు.

ఇప్పుడు ఒక భక్తుని చరిత్రమును గమనించుడు. ఒకరోజున ఒక భక్తుని కలలో దేవత కనిపించి "నీవు ఏమిచేయుచుంటివని"అడిగెనట. నేను భక్తుల పేర్లు వ్రాయుటకు వచ్చితిని అని చెప్పగా "అతడు జవాబుగా నేను దైవపూజ భజనలు వగైరాలు చేయుటలేదు. మానవుల సేవ మాత్రమే చేయుచుంటిని. కనుక నాపేరు అందులో చేరదు." అనెనట.

మరల మరియొకరోజున ఆ దేవత అతని కలలో కనిపించి మానవుల సేవచేయువారిపేరు పూజచేయువారి పేర్లనే వ్రాయుచుంటినని చెప్పెనట. అట్లే మూడవరోజు కలలో కనిపించి తాను వ్రాసిన పేర్లజాబితాను చూపించగా అందులో మన భక్తుని పేరు మొదటిదిగానుండెనట. దీనిని బట్టి మనము గ్రహించవలసినది. **ఎవరు ప్రతిఫలము నాశించక నిస్వార్థముగా మానవసేవచేయుదురో అది దైవారాధన గానే పరిగణింపబడుచున్నది.** ఇది ఒక కథగా భావించి విని యిచ్చుటనే వదలివేయక విన్నది ఆచరణలో పెట్టినపుడు, మీరు ఏ విధమైన సేవచేసినను అది మాధవసేవగా తలంచి చేసినచో దాని సత్ఫలితమును మీరే పొందగలరు.

ఓం ఓం ఓం

---

దైనందిన జీవితమున సత్యమును గూర్చిన

స్వానుభవము లేనిచో, పండితుడైనను

'అహం బ్రహ్మాస్మి' వంటి వాక్యములను

ఎన్నిసార్లు మననము చేసినను, వ్యర్థమే,

విచారములు, భయభ్రాంతులు వంటి

ప్రపంచపు నీడలకు భయపడుచునే యుండును.

# 95. మీకేమి కావలయును ?

షష్టిపూర్తి సమీపించుచున్నది. చి॥ జ్ఞానేశ్వరి ప్రతి సంవత్సరము ఏదో యొక కానుక నా జన్మదిన జ్ఞాపకముగా, నా నిత్యావసరమున కుపయోగపడు వస్తువు నర్పించ ప్రయత్నించుచుండును. అందు ఈ సారి ఈ రాబోయెడిది షష్టిపూర్తికనుక, ఏదయినను విలువైనది నాకు నిత్యోపయోగమైనది యివ్వవలయునని కోరుచున్నది. ఆమె ఏమికొనుటకు తోచక ఒకరోజు – నన్ను సమీపించి "స్వామీజీ మీకు ఏమి కావలయు"నని ధైర్యముచేసి అడిగెను. అప్పుడు నా కేమి కావలయునో ఆలోచించ సాగితిని. నా గది అంతయు పరిక్షించిచూడగా నాకు అవసరమైన వన్నియునున్నట్లే కనిపించెను. ఏమియు కొరతయై యుండలేదు. అయినను కండ్లుమూసికొని నాకేమి కావలయునని దీర్ఘముగా ఆలోచించితిని. నాకు ప్రపంచవస్తు వేదియు కావలసి యున్నట్లు తోచలేదు. నా దినచర్యలో వాడు వస్తువులవసరములేదు; మరి యేమి కావలెను? దైవము కావలెనని అందునా దైవము యిప్పుడు నా నేత్రములతో చూచు చున్నా మనస్సులో ఆలోచించుచుండ ఉచ్ఛ్వాస నిశ్వాసములలో ఆడుచుండ మరియొక దైవము కావలెననుట అజ్ఞానమేకదా .

ప్రశ్న : మీకేమి కావలెను.

జవాబు : నా కేమియువలదు అపుడు నా కేమి కావలెనో నాకే తెలియని పరిపూర్ణ స్థితిలో నుండిని. **అట్టి మహత్తరమైన పరిపూర్ణస్థితిని పొందిన విజ్ఞులు సంకల్పశూన్యులై నిశ్శబ్దములో లీనమైపోవుదురట ఎంత ఆనందమైన వార్త!** నాకు కావలసినది నేను పొందితిని. చి॥ జ్ఞానేశ్వరిని భగవంతుడు క్షేమముగా–ఆయు రారోగ్యముల నిచ్చి శాంతితో బ్రోచుగాక ! యని ప్రార్థించితిని.

ఓం ఓం ఓం

---

భూత, భవిష్యత్ వర్తమాన కాలములలో, ఎల్లప్పుడు భగవత్ సాన్నిధ్యము

ననుభవించు సంపూర్ణ భావముతోనే యున్నాము.

ఆయన లేని స్థలము, కాలము లేవు.

## 96. మంత్ర ప్రభావము

భక్తులకు స్వాగత మని చెప్పుట నా సహజ స్వభావము. నేడు ఆశ్రమభక్తులు మంగెన తిరుపతిరావుగారు–వారి ధర్మపత్నితో ఆశ్రమం వచ్చుటానందము. వారు యిచ్చట నిర్మింపచేసిన కుటీరము ఎందరో భక్తులకు నివాసమగుచున్నది. అంతేగాదు. ఆమె భక్తహృదయురాలుగాన – నూతనముగా నిర్మింపబడుచున్న జ్ఞాన గృహ నిర్మాణమునకు ఆమె ఆర్థిక విరాళమిచ్చుటానందము.

మనము ప్రతిరోజు "జయజయరామకృష్ణహరి ఓం" అని పవిత్ర నామమును సంకీర్తనముగా చేయుచుంటిమి. దాని ప్రభావము మాటలలో వర్ణింపరానిది. "భక్త తుకారాం" ఒక గ్రామములో 5 వేలమంది భక్తసందోహముతో పై నామమును తదేకముగా తన్మయముగా చేయుచుండ భక్తులందరూ ఆనందోత్సాహములతో పాల్గొనుటతో ఆ ప్రదేశమంతయు భక్తితరంగములతో నింపబడియుండిగా ఆ గ్రామములో నివసించుచున్న ఒక గృహస్థు భక్తుడు తన బిడ్డ అనారోగ్య పరిస్థితిలో నున్నందున – భార్య వెళ్లవలదని వారించుచున్నను, అతడు భక్త్యావేశములో సంకీర్త నలో పాల్గొనుటకు వెళ్ళిపోయెను. కొంతసమయమునకు ఆ గృహిణి మృతుడైన తన బాలుని తెచ్చి – భక్త తుకారాం పాదముల చెంత పెట్టగా వారి పవిత్రనామ సంకీర్తన ప్రభావమువలన – ఆ బాలుని శరీరములో చైతన్యము కలిగి క్రమేణా చేతులు కలిపి భజన చేయసాగుట చూచిన వేలాది భక్తులు, ఆశ్చర్య ఆనందపరవశు లైరి. **నా స్వానుభవములో కూడ ఈ మహామంత్ర స్మరణ ప్రభావము వలన నా శరీరమునే గాక, ఈ ఆశ్రమమును సర్వ ప్రపంచమును మరచి అందులో లీనమగు చున్నట్లు భావించుచుందును.** కనుక ఇది విని జ్ఞాపకముగా మీరందరునూ "జయ జయ రామకృష్ణ హరిఓం" అను నామస్మరణతో తన్మయతను చెందుదురుగాక. ఇది నేటి నా సందేశము.

ఓం ఓం ఓం

---

శాశ్వతముగా ఆనందముతో నుండవలయునన్న
దానికి మార్గము ఒక్కటే. కష్టసుఖము లందు
ఆత్మను దృఢముగా నంటి పెట్టుకొని యుండుట.

# 97. సుకృత జీవితము

ఎవరు - ఎప్పుడు - ఎచ్చటసమావేశమైనను అది దైవాజ్ఞగనే భావించి ఆనందించుట నా మనోలక్షణము. ఈ రోజు మన ఆశ్రమఅధ్యక్షుల శ్రీ తెన్నేటి విశ్వనాథముగారి జన్మదినము.

వారి దేశభక్తి అఖండ సేవాతత్పరత నిష్కపట హృదయము, స్వచ్ఛ జీవితము వగైరా సుగుణములను చూచి నాకెంతయో ఆనందముగా నుండును. వారి సమక్ష ములో వారిని గురించి చెప్పినచో ఆయన కిష్టము వుండదు. ఇప్పుడు వారి ఆయు రారోగ్యాభివృద్ధిని కోరుచు మనము ప్రార్ధనలు చేయుదుముగాక ! అట్టి సుకృతజన్ములే ఈ ఆశ్రమ విలువను గ్రహించి శాంతిననుభవింప గోరుచుందురు. అందరికిని అది సాధ్యముగాదు. దాని కొరకు ఎంత డబ్బు ఖర్చు చేసినను అది బజారులో దొరకదు. మరి యెచ్చట లభించును ఆ పరమశాంతి? దైవపరితాపమను మూల్య మును చెల్లించినచో అతి సులభముగా లభించును. అట్టి మూల్యమును చెల్లించి శాంతిని పొందుటకు ఎందరు సిద్ధముగా నుండిరి? హృదయ పరితాపములో లోతుకు వెళ్ళినచో అచ్చట శాంతి పొందుటకు మూలమైనదానిని కనుగొనగలము. మన ముందు ప్రకాశించుచున్న ఈ కరెంటు దీపములకు విద్యుచ్ఛక్తి మూలమైనది. కాని వాని స్వరూప మెట్టిదియో మనము కనుగొనజాలము. నేను శ్రీరాముని శ్రీకృష్ణుని సన్నిధి ననుభవించితి నని చెప్పగలను గాని, ఆ ఆనందము యొక్క స్వరూపమును మీకు వివరింపచాలను.

ఈ విధమైన **నా స్వానుభవములను మీకు బోధించుటకు కారణము, వినగ వినగా ఏనాటికైనను మీలో కొందరైనను మూలమునకు వెళ్ళి ఆ దివ్యానుభూతులను పొంది తరింతురనియే నా ఆశ ఈ నా ఆశ. ఆశయములను భక్తులగు మీరు వ్యర్థము చేయక సార్ధకము చేసి సుకృత జీవులుగా మనుదురుగాక !** ఇది నేటి నా సందేశము.

ఓం ఓం ఓం

---

మన సామర్థ్యమును పరీక్షచేయుటకును, మనయొక్క ఆత్మశక్తిని వృద్ధి పరచుటకును మాత్రమే పరమాత్మ మనకు కష్టసుఖములను కలుగజేయును. అంతేకాని మనపై కసితో కాదు.

# 98. ఆద్యంతములు

ఆద్యంతములులేక అంతరబాహ్యములందు నిండియున్న ఓ దివ్యస్వరూపా ! నీ అపారకరుణ వలన నిన్ను కీర్తించుటకై మమ్మిట సమావేశపరిచితివి. కృతజ్ఞులము.

ఒక చిన్న మర్రి విత్తనములో మహావృక్షము యిమిడియున్నట్లు, నీవు సర్వత్రా యున్నను నిన్ను కనుగొన జాలకుండుట విచారము. అది మా కృషిలోపమే కదా! విత్తనమును భూమిలోపాతి నీరు పోయనిదే మహావృక్షము కానట్లు **మాలోనున్న శక్తియను విత్తనమును, జ్ఞానమనెడి భూమిలో పాతి – భక్తి అనెడి నీరుతో తడువనిచో ఆ మహా వృక్షమువలె మేము అఖండశక్తి సంపన్నులము ఎట్లు కాగలము** ?

నీవు మానవులకు జ్ఞాన మిచ్చినందుకు పశువులవలె ఆహార నిద్రా మైథునము లలోనే జీవించక తమకు లభించిన జ్ఞానమును పవిత్ర తలంపులతో నింపి సదా సత్కార్యముల నొనర్చుచు అభివృద్ధి చెందినపుడే నీవు ఇచ్చిన జ్ఞానము సఫల మగును. ఆ మహావృక్షము నలుగడల వ్యాపించి పోవునట్లు పలువురు పరమార్థ చింతనాపరులకు నీ జ్ఞానమును పంచుచు వ్యాపింపజేసినపుడే జ్ఞానము ఫల వంతమగును.

జ్ఞానసముపార్జకులు – ఎల్లపుడూ శాంతి నిధులుగానే యుందురు. గాన ఓ మానవులారా ! **మీకు భగవంతునిచే ప్రసాదింపబడిన జ్ఞానధనమును పలువురకు పంచుటలోనే జ్ఞానధనము అభివృద్ధి చెందును. మీ బుద్ధిబలమునుపయోగించి యితరుల విద్యాభివృద్ధికి తోడ్పడవచ్చును. మీలోనున్న జ్ఞానముతో నిష్పక్షపాతముగా న్యాయ విచారణ చేయవచ్చును. అవినీతి అధర్మము పెరుగనీయకుండా అణచి వేయగల శక్తి జ్ఞానమార్గావలంబులకు కరతలామలకము వంటిది.** అట్టి జ్ఞాన త్యాగులకు నా ప్రణామములు.

ఓం ఓం ఓం

---

ప్రతి క్షణము సద్వినియోగము కావలయును. అందుకొరకు ఆ క్షణముల
నన్నింటిని భగవత్ సేవయందు వినియోగింపవలయును.
అదియే సౌఖ్యమునకు మార్గము.

# 99. రోగుల సేవ

రోగులకు సేవ చేయగలుగట అదృష్టమే ! కాని బాధలో నున్నవారికి సేవ చేయువారు రెండు రకములుగా నుందురు. స్వార్ధ రహితముగా, ఓర్పుతో చిరునవ్వుతో సేవచేయువారు లభించుట రోగుల అదృష్టమునుబట్టి యుండును.

రోగుల సేవచేయువారి కొందరి ముఖముల చూచినచో వారు ఈ జన్మలో నవ్వు అనునది లేనట్లే పొడుగు ముఖములతో (యిదంతయు నా కర్మ అనునట్లు) విచారముతో నుందురు. వారికది తప్పనిసరిసేవ యనిపించును. అట్టి వారి సేవ వలన రోగులు కూడా యిదంతయు నాకర్మ అనుకొనుచు లోన బాధ పడుచుందురు. ఇలా రెండవ రకము సేవచేయువారు, రోగులపై రుసరుసలాడుచు సేవచేయుట తమకు శిక్షగా నున్నట్లు చింతాపూరితముఖములు గలవారిని చూచి రోగులు భయ భ్రాంతులగుచుందురు. అట్టివారిని చూచినపుడు రోగముతో బాధపడుచున్నప్పటి కంటె అట్టి సేవ చేయుచున్నవారిని చూచి నాకు చాల విచారము కలుగుచుండును. కొలదిమంది మాత్రము రోగులతో ఆదరముగా మాట్లాడుచు వారి అవసరములను ఓర్పుతో, నేర్పుతో పరిశీలించి నవ్వుతూ సేవచేయువారును గలరు. అట్టివారు లభించిన రోగుల రోగములెంత శరీరమును బాధించుచున్నను, వారి మనస్సులు తృప్తిగా నుండుటచే బాధలను మరచి హాయిగా నుందురు. అంతేగాదు వారికి నూతన శక్తి కలిగి త్వరలో ఆరోగ్యమును పొందగలరు. అట్టి సేవకుల వలన యిరువురకును మేలు కలుగును. నేను చెప్పునది రోగుల సేవకులు పెద్ద సంఖ్యలో నున్నంత మాత్రమున లాభములేదు. **మన ఆనందోత్సాహములే రోగికి బలమైన మందుగా పనిచేసి ధైర్యము నిచ్చును. అసలు తాము జబ్బుగా నుంటిమను భావనయే రాదు. గాన రోగుల సేవచేయదలంచువారు, తమ సుఖమును మరచి, రోగి బాధ తమ బాధే యను ఆత్మీయ ప్రేమతో సేవచేయుటలో తమ భవిష్యత్తునకు తామే సేవకులను సమకూర్చుకొన్నవారగుదురు. ఈ విశ్వాసము దైవోన్ముఖమైనది.**

ఓం ఓం ఓం

---

వ్యాకుల మనునది భయంకరమైన ఊహాజనితమైన పిశాచము. దాని ప్రభావము నీపై పడినపుడు 'పని' చేయుటకు ప్రారంభింపుము 'పని' వ్యాకులతను పూర్తిగా పారద్రోలును.

# 100. చీకటి నుండి వెలుతురు

రాత్రి గడిచినపుడే – పగలు వచ్చును. అంధకారమునుండియే వెలుతురు వచ్చును. ఉదయసంధ్యలకలయికయే దినముగా మారుచున్నది. ఈ విధముగా ఒక్కొక్కరోజు గడుచుచు మన జీవితములలో ఎన్నియో సంవత్సరములు గడిచిపోవు చుండెను. కాలము అనగా వీటి అన్నింటి కలయికయే గదా.

అయిన దీనియందొక్క విశేషమున్నది. సూర్యోదయముతో దినము ప్రారంభ మగుచున్నట్లు స్పష్టమగుచున్నది. ఆకాశము మేఘావృతమైనపుడు సూర్యప్రకాశము మరుగైనపుడు మనము బాహ్య గడియారములపై దృష్టిని సారించుచుందుము. అందుచేత కాలము ఎంత అయినదో తెలిసికొనుటకు ఇదంతయు సామాన్య జనుల నిత్యకృత్యము. కాని ఎల్లపుడు తమ దృష్టిని ఆంతరము వైపు మరలించు జ్ఞానులకు రాత్రి పగలు చీకటి వెలుతురులతో ఎట్టి సంబంధము నుండదు. అట్టివారు పగటి వేళను ఎంత ఆనందముగా తమతమ నిర్దిష్ట ప్రదేశములలో తమతమ పనిపాటలు కొనసాగించుకొందురో రాత్రి కూడ అట్లే ఉందురు.

శ్లో॥ యా నిశా సర్వభూతానం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥

సాధారణ మానవులకు రాత్రివలె నుండు అజ్ఞానదశయందు మునులు మెలకువతో నిశ్శబ్దముతో ఆత్మానందములో నుందురు. వారికి పగటి వంటి దశలో ఆత్మ జ్ఞాని నిద్రించును (భోగికి చీకటి, యోగికి పగలు – యోగికి చీకటి, భోగికి పగలు)

ఈనాటి నా తలంపులు దైవమును క్షణములో కోట్యంశమైనను మరువచాలని వారికి ఆ దివ్యతేజస్సును నిరంతరము అనుభవించువారికి రాత్రి పగలను భేదముండ దని నా విశ్వాసము.

అజ్ఞానదశయందే ఈ భేదము లన్నియు చూచుటగుచున్నది. అట్టివారు సంవత్సరముల నధిగమించుచు, జన్మ పరంపరల కూడబెట్టుకొనుచున్నారు. కనుక **ఈ శరీరమున ప్రాణముండగానే రాత్రి పగలు భేదమును మరచి మనస్సులను భగవంతుని వైపు మరల్చి అన్ని దశలయందును అంతరజ్యోతిని దర్శింపగల ధన్యులకు అంతయు ప్రకాశమానముగానే గానవచ్చును.**

ఓం ఓం ఓం

# 101. మహనీయమూర్తులు

సహజముగ మానవుడు దైవాంశ సంభూతుడే కాని ఆ రహస్యమును గ్రహించుట సామాన్య మానవులకు సాధ్యముగాదు.

నేను నివసించుచున్న నిర్వాణమందిరము ముందుఆవరణలో నలుగురు మహనీయుల విగ్రహములున్నవి. అవి మీ అందరిదృష్టిలో విగ్రహములుగానే కనిపించవచ్చును.

నేను వేకువ ఝామునలేచి ఆ విగ్రహముల చెంతకు వెళ్లుచుందును. కృష్ణుని వైపు అడుగు వేయుచుండ ఆయన చిరునవ్వుతో నన్ను సమ్మోహితుని చేయుచున్నట్లు భావించుచుందును. అటునుండి గాంధీ మహాత్మునివైపు వెళ్లుచున్నప్పుడు మహాత్ముడు తన చేతిలోనున్న భగవద్గీతను చూపి ఏదియో సందేశమిచ్చుచున్నట్లు తలంచి చిన్మయానందుడ నగుచుందును. అటునుండి బుద్ధుని వైపు అడుగులు వేయుచుండ చేతిలోని భిక్షాపాత్ర నా వైపు చూపుచుండెనా యనిపించును. అటునుండి క్రీస్తువైపు మళ్ళుచుండ దూరమునుండియే ఆయన రెండు చేతులను చాచి నన్నాలింగనము చేసుకొనగోరుచున్నట్లు భావింతును. ఆ ప్రశాంత బ్రాహ్మీముహూర్త సమయాన ఏకాంతములో, ఆ నలుగురు మహనీయుల దివ్య సాన్నిధ్యమును అనుభవింపగల్గుట నా అదృష్టము. **శ్రీకృష్ణుని జ్ఞానము, గాంధీమహాత్ముని సత్యమైన నిస్వార్థసేవ, బుద్ధుని అహింసా మార్గము, క్రీస్తుప్రభుని ప్రేమను వారి వారి ఆచరణయుక్తమైన జీవితముల ద్వారా ప్రపంచమునకు వెల్లడి చేసిరి.** కాని అట్టి మహనీయులను నిత్యము స్మరించుచు ఆ బాటలలో నడుచువారే నేడు చాలా అరుదుగా నుండిరేమో? ఎవరి మనస్సులు వారే పరీక్షించుకొనవలయును. **యిట్టి దివ్యానుభవములు వినుటవలనను, యితరుల బోధలమీద ఆధారపడుట వలనను లభించవు. ఆత్మలో వెలుగుచున్న పరంజ్యోతిని దర్శించినపుడు ఆత్మ సాక్షాత్కారము అను పదమునకు సరియగు నిర్వచనము కనిపించును.** నేనిచ్చెడి దివ్యానుభవములను ఫలములు, ఆత్రముగా అందుకొని మీ హృదయగుహలలో పదిలపరచుకొన్నపుడే నా శ్రమ ఫలించును. నా నుండి వచ్చు ప్రతిభావము దైవమును చక్కగా అవగాహన చేసికొని అభివృద్ధి చెందెదరు గాక !

ఓం ఓం ఓం

# 102. గాలివాన లేక తుఫాను

గాలివాన వెలసినది. సుఖముగా నున్నది. ప్రకృతి విజృంభణను నిన్నటిరోజున అనుభవపూర్వకముగా గంటలకొలది యిచ్చటనే కూర్చుని చూచితిని. పెద్దపెద్ద చెట్లు కూకటివేళ్ళతో కూలిపోవుచుండెను. ఒక్కోసారి చెట్టుపైన గాని ఇంటిపైనగాని పిడుగుపడినచో అవి కాలిపోవుచుండును. ప్రకృతి ఆగ్రహముతో విజృంభించినపుడు దానిని శాంతింపచేయగల శక్తి ఎవరికి గలదు ? ఆ దృశ్యమును గాంచినపుడు మానవుల కోపము జ్ఞాపకము వచ్చినది.

మానవుని కోపజ్వాలలో తోటి మానవులు ఆహుతి అగుతుంటే తానేమి చేయు చున్నదియు తెలియక తన గోతిని తానే త్రవ్వుకొన్నట్లు అధోగతికి చేరును. పెను తుఫాను అనగా ప్రకృతి విజృంభణలో ఎన్ని అనర్థమైన సంఘటనలో సంభవించును. అది సహజమైనదైనా అసహజమైనదైనా దానిని తప్పించుకొనలేము. కాని జ్ఞానము కలిగిన మానవుడు అజ్ఞానముచే నింపబడి తన లోపమును తాను సర్దుబాటు చేసుకొన లేకపోవుచున్నాడు. తనను తాను సర్దుబాటు చేసికొని శాంతించినచో అది ఎదుట వారికి మహోపకారి అగును. ఆధ్యాత్మికాభివృద్ధి నొంది, తనలోని శక్తిని గమనించి కృతకృత్యుడైనచో బాహ్యమున సంభవించు ఎట్టి తుఫానునైనను తట్టుకొని అనగా ఎట్టి ఆపదలు సంభవించినను వాటిని జీవితాభివృద్ధికి సోపానములుగా మార్చుకొన గలడు.

**ఓ మానవుడా ! కోపమును విజ్ఞతతో ప్రేమమయముగా మార్చుకొనినపుడు జీవితమే శాంతి మయమగును. శాంతి అనునది నీ జన్మహక్కు అనునది మరువ కుము. నీ ప్రేమాదరములతో తుఫాను బాధితులనూ ఆదుకొనుము. అదియే నిజమైన సేవగా గుర్తించుము. అట్టి ఉదారహృదయములకు భగవంతుడెల్లపుడు తోడునీడగా నుండును.**

ఓం ఓం ఓం

---

భగవంతుని ప్రతిబింబమైన మానవుడు దేహాత్మ బుద్ధిని వదిలి,
కోరికలను విడిచిన యెడల తన సహజ స్వరూపమును తిరిగి పొందును.

# 103. గాంధర్వ సేన

అంధులకు అంధుడు దారి చూపజాలడు. జ్ఞాన నేత్రముగలవారే తాము వెలుగుబాటలో నడుచుటయేగాక అజ్ఞానులను కూడ తమ బాటలో నడిపించగల సమర్థు లగుదురు. కొందరి మనుజుల మనస్తత్త్వము విచిత్రముగా నుండును. గొర్రెల మందలోని, ఒక గొర్రె దారితీసినచో అది ఎంతముళ్ళబాటనైన, ఆ మందలోని గొర్రెలన్నియు దాని వెనుకనే నడిచిపోవుచుండును. అట్లే మానవులు కూడ ఒకవ్యక్తి యందు విశేషము ఏదయినను చూచినచో అదిచూచి అందరు అటువైపే పరుగు లెత్తుచుందురు. దానికి ఉదాహరణగా "గాంధర్వసేన" కథను గూర్చి తెలిసికొందము.

ఒక రాజ్యములోనున్న చాకలివాని గాడిదకు గాంధర్వసేన పేరు పెట్టెనట. ఆ గాడిద చాకలివాని బట్టలు మూటలు బరువును తన వీపుమీద మోయుచు తన యజమానికి ఎంతయో సేవ చేయుచుండెను. ఆ గాడిద ఒకనాడు చనిపోయెను. ఆ చాకలివాడు తన విశ్వాస సేవకురాలైన ఆ గాడిద చనిపోయినందుకు చాలా దుఃఖించి ఆ రాజ్యములోని ఆచారమునుబట్టి విచారము సూచించు నల్లబట్టలను వేసికొనెనట. ఆ దోవన వెళ్ళుచున్న వారు అతని విచారమును సూచించు బట్టలు చూచి కారణమడుగగా చాకలి తనకు అత్యంత ఆప్తురాలైన గాంధర్వసేన చనిపోయె నని చెప్పి మరల దుఃఖంచుచుండెనట. అతని మాటలు విన్నవారందరూ సానుభూతిగా నల్లనిబట్టలు తామును ధరించినారు. అట్లు రాజధానిలోని ప్రజలందరూ ఒకరిని చూచి ఒకరు నల్లని దుస్తులు ధరించి తిరుగుచుండ ఆ దేశపు మంత్రిగారు కోటలోనికి వెళ్ళుచు ప్రజలందరూ విచారసూచికమైన నల్లని దుస్తులు వేసుకొనుట చూచి, 'అయ్యో! ఈ ఊరిలో ఎవరో గొప్పవారు చనిపోయియుందురని తలంచి, ఆయనయు నల్లని దుస్తులు ధరించి కోటలోనికి వెళ్లిరి. మంత్రిగారి దుస్తులు చూచిన రాజుగారు ఈ ఊరిలో ఏదో ఆపద జరిగినదని తలంచి తాము అట్టి బట్టలు ధరించి రాణిగారి భవనమునకు వెళ్లిరి. రాజుగారు నల్లని దుస్తులు ధరించుటచూచి భర్తను "ఈ దుస్తులు ధరించుటకు కారణమేమిటి? మీ దగ్గర బంధువులుగాని, ఆత్మీయులైన వారెవరైనా మరణించిరా" యని అడుగగా అందుకు రాజు అదేమియుగాదనియు మంత్రిగారి దుస్తులు చూచి తాము కూడ ధరించితిమని చెప్పుటతో ఆమె పట్టణము లోని ప్రజలందరిని ఆరాతీయించగా చివరకు చాకలివాని గాంధర్వసేన అను గాడిద చనిపోయిన సూచనగా వాడు వేసుకున్న నల్లని బట్టలు చూసి తాము కూడా నల్లని బట్టలు వేసుకొన్నట్లు అసలు విషయం తెలిసి సిగ్గుపడిరట. ఈ కథ సారాంశము. **మానవులు అసలు వస్తువును మరచి తనలో నన్ను శక్తిని తెలుసుకొనలేక మోహ జాలములో పడి ఒకరివెంట ఒకరు పరుగులిడుచూ గోతిలో పడుచుండిరి. ఓమానవుడా ! నీ అజ్ఞానపు నిద్రనుండి మేల్కొని జ్ఞానమార్గములో పయనించి గమ్యస్థానము చేర ప్రయత్నించుము.**

ఓం ఓం ఓం

# 104. సూత్రాత్మ

ఈ ప్రపంచమనెడు దండలో అనేక రకములైన పూసలు, ముత్యములు మొదలగునవి యున్నవి. పూసలు అల్పమైనవిగావచ్చును. ముత్యములు విలువైనవి గావచ్చును. వాటికి వీటికి గూడా దారమే ఆధారమగుచున్నది. నీవు అల్పమగు పూసవంటివాడవా ? లేక దారముతో ఒకటిగా బంధింపబడిన తెల్లని స్వచ్ఛమైన ముత్యముల మాలగా నుండగోరుచుంటివా? నీలో చైతన్యము లేనిచో కదలుచు, ఆలోచించెడి శక్తి ఎచ్చట నుండి వచ్చుచున్నది? దీనికి ఆధారమైన శక్తి యొకటి యున్నదని గ్రహించినచో ముత్యాల హారములున్న దారమును అనగా సూత్రాత్మను కనుగొనగలవు. గాలివీచుటకు సూర్యచంద్రులు ప్రకాశించుటకు మూలాధారమైన భగవత్ శక్తియే నీలో నున్నది. అదియే నాలోనున్నది. అదియే సర్వసృష్టికి ఆధారమై యున్నది. నీవు జడమగు శరీరము కావు. దీని కదలికకు ఆధారమైన శ్వాస, సోహం రూపములు నిరంతరము ప్రవహించుచున్నవి. నీవు గుర్తించినను గుర్తింప జాలక పోయినను, నీ జాగ్రత్ స్వప్న సుషుప్తావస్థలో గూడ సోహం సోహం నేనే అది, అదియే నేను అను అజపగాయత్రి జపము నిరంతరము అనాది నుండియూ చేయుట జరుగుచున్నదిగదా. ఆ శ్వాసయే ఆడనిచో శరీరము జడమైపోవుచున్నది. గదా. అందుచే సోహం భావన గుర్తించుచు ఈ రహస్యమును ఎంత త్వరగా తెలిసికొనిన నీకంత శ్రేయోదాయకము. ఓ సూత్రాత్మా! అట్టి నీ బిడ్డలలో కొందరు పాపులుగా, దుర్మార్గులని పిలచుట కించిత్‌జ్ఞతనేమో ? నీ గాఢనిద్రనుండి మేల్కొనుము. సృష్టిలో అన్ని నామరూపములను బంధించి ఏకము చేయుచున్న అద్వితీయమైన సూత్రాత్మకు నా ధన్యవాదములు.

ఓం ఓం ఓం

---

ఆత్మ జ్ఞానులకును, భగవత్ సాక్షాత్కారమును పొందిన వారికిని అదృష్టముతో పనిలేదు. వారే అదృష్ట రూపులు.

## శక్తినిచ్చెడి చిన్న ప్రార్థన

ఓ సచ్చిదానందస్వరూపా ! నీవు నా అంతరబాహ్యముల యందు ప్రత్యణువు నందు నిండి నిబిడీకృతయైయుండ, ఆపాదమస్తకము నేను నీ దివ్య తేజస్సుతో నింపబడియుండ తాపత్రయములు, చింతలునన్నెట్లు దరిచేరగలవు ? అండాండ, పిండాండ, బ్రహ్మాండములన్నింటిలో నీవు పరిపూర్ణుడవైయుండ నేనేగాదు, వివేకము గలవారెవ్వరైనను చింతనలు కోపతాపములకు ఎట్లు లోనుకాగలరు ? ఈ ఆకారము లన్నియు నీ సంతానమే కదా ! అట్టి అల్పభావన నా సర్వజ్ఞత్వమునకే కళంకము తెచ్చుచున్నది కదా ! ఓ దేవా మాలో ప్రవేశించనున్న అంధకారము అజ్ఞానతలను నీవే పారద్రోలి మమ్ము కరుణతో బ్రోవుము. ప్రతి ఆకారములోను నీ సచ్చిదానంద స్వరూపమును గాంచుటకు మాకు శక్తినొసంగుము.

ఒక్క సూర్యుండు సమస్త జీవులకు తన యందలి ప్రకాశమిచ్చుచున్నట్లు నీవు అద్వితీయుడవై వ్యక్తావ్యక్త లోకములన్నింటికి ఆధారభూతుండవై సర్వజీవులను రక్షించుచుంటివి.

ఓ పరమాత్మా ! పరిపూర్ణా ! మేము నీ అంశములోనివారమే గాన, నిన్ను అన్నింటియందు అందరిలోను గుర్తించి పరిపూర్ణానందము పొందునట్లు అనుగ్రహింపుము. నా యీ చిన్ని ప్రార్థనను మన్నించి నాలో నిన్ను ఈ క్షణముననే దర్శింపనిమ్ము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః